వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

గాజా యుద్ధానికి ఏడాది

గాజాలో కొనసాగుతున్న యుద్ధానికి ఏడాది పూర్తయినా, పరిష్కారం మాత్రం కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దుస్సాహసిక దాడితో మొదలైన ఘర్షణ దీర్ఘకాలిక యుద్ధంగా మారింది. నిజానికి దీన్ని యుద్ధం అనే కన్నా ఇజ్రాయెల్ ఏకపక్షంగా జరుపుతున్న విధ్వంసం అనడం సబబు. హమాస్ మిలిటెంట్లు నిరుడు అక్టోబర్ 7న జరిపిన దాడుల్లో 1,200 మంది ఇజ్రాయెలీలు హతమయ్యారు. మరో 250 మందిని వారు బందీలుగా పట్టుకుపోయారు. అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఎదురుదాడులు మొదలుపెట్టింది. మొదట్లో క్షిపణులతో విరుచుకుపడిన ఇజ్రాయెల్ తర్వాత గాజాలోకి సైన్యాన్ని పంపి భూతల యుద్ధాన్ని మొదలుపెట్టిం ది. ఈ ఏడాది కాలంలో గాజా ముఖచిత్రమే మారిపోయింది. దాదాపుగా అక్కడి భవనాలన్నీ బూడిదయ్యాయి. ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 42 వేల మంది గాజా పౌరులు హతమయ్యారు. వారిలో మహిళలు, పసివాళ్లే అధికం. ఇదిలా ఉంటే అటు లెబనాన్‌లో మరో మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా.. హమాస్‌కు సంఘీభావంగా రాకెట్లు వేస్తుండటంతో అక్కడ కూడా ఇజ్రాయెల్ భూతల యుద్ధం మొదలుపెట్టింది. ఇవి రెండూ ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పరోక్ష యుద్ధాలే. నేడో రేపో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రత్యక్ష దాడికి దిగుతుందనే వార్తలు వస్తున్నాయి. అంటే ఏడాదిలో గాజా ఘర్షణ మూడు ప్రాంతాల యుద్ధంగా పరిణమించింది తప్ప, గాజా పౌరులకు ఉపశమనం అనేదే దక్కలేదు.

మొదట ఆక్రమణదారు, ఆపై అణచివేతదారుగా మారిన ఇజ్రాయెల్ వైఖరిపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్నది. ఆత్మరక్షణకు ఇజ్రాయెల్ ఇస్తున్న నిర్వచనమే అందుకు కారణం. గాజాలో దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా కేసు దాఖలు చేసింది. అమెరికా సహా పలు పశ్చిమ దేశాల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం అమెరికా వర్సిటీలు పాలస్తీనా అనుకూల బైఠాయింపులు, ధర్నాలతో దద్దరిల్లాయి. ఏడాదిలో ఇజ్రాయెల్ తన మొండి వైఖరితో ఏకాకిగా మారుతుండటం మనం చూస్తున్నాం. ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకం నిలిపివేయాలని ఫ్రాన్స్ నిర్ణయించడం గమనార్హం. మరికొన్ని దేశాలు ఇదే బాటన వెళ్లే సూచనలు కనిపిస్తూనే ఉన్నాయి. ఏకైక అగ్రరాజ్యం అమెరికా మాత్రం పాలస్తీనీయుల పట్ల ఓ పక్క సానుభూతి ప్రకటిస్తూనే ఇజ్రాయెల్ యుద్ధ సంసిద్ధతకు అన్నివిధాలా అండదండలు అందిస్తూ ఉన్నది.

2020లో అరబ్బు దేశాలు, ఇజ్రాయెల్ మధ్య ఓస్లోలో కుదిరిన ఒప్పందం పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పలేకపోయింది. అందుకు పాలస్తీనా సమస్యే కారణం. పాలస్తీనీయులకు అండగా నిలిచిన ఇరాన్ ఇప్పుడు ఇజ్రాయెల్‌కు బద్ధవిరోధిగా మారి, యుద్ధం అంచున నిలిచింది. గాజాతో మొదలైన సమస్య ఒకటి రెండు దేశాలకు పరిమితం కాదనేది వాస్తవం. యుద్ధం దేశాల మధ్య జరిగినా అందులో నలిగిపోయేది ఇరువైపులా ఉన్న సామాన్యులే. గూడు చెదిరి నిరాశ్రయులయ్యేదీ వారే. గాజాలో నిత్య నరకం అనుభవిస్తున్న ప్రజల పరిస్థితి వర్ణనాతీతం. ఇది మానవతావాదానికి, నాగరికతకు మచ్చగా నిలుస్తుంది. ఇప్పటికైనా పశ్చిమదేశాలు గాజా హననాన్ని ఆపేందుకు ముందుకు రావాలి. రెండు దేశాల సూత్రమే సరైన పరిష్కారమనే సత్యాన్ని చిత్తశుద్ధితో అంగీకరించాలి. ఇజ్రాయెల్‌తో సమానంగా మనుగడ సాగించే హక్కు పాలస్తీనీయులకూ ఉంది. దానిని గుర్తిస్తే గాజా కల్లోలానికి ముగింపు పలకడం సాధ్యమే.

అదే బీజేపీ కొంపముంచింది!



హర్యానాలో బీజేపీ ఓడిపోనున్నదని స్పష్టంగా తెలుస్తోంది. రాష్ట్రంలో కమలం పార్టీ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ విషయం గురించి నేను మొదటి రోజు నుంచి చెబుతున్నా. కానీ, ఆ పార్టీ నేతలే పట్టించుకోలేదు. సీఎం నాయబ్ సింగ్ సైనీ చేతుల్లో బీజేపీ చచ్చిన పామును పెట్టింది. రాష్ర్టానికి కలుగుతున్న నష్టాన్ని ఆయన నిలువరించలేకపోయారు. అదే ఇప్పుడు బీజేపీ కొంపముంచింది.

- దిగ్విజయ్ చౌతాలా, జేజేపీ ప్రధాన కార్యదర్శి

ఒక సమస్య నోరు, రెండవది తీరు

తన ప్రతిభా సామర్థ్యాలతో పది నెలల క్రితం అధికారానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు, తీరు సరైనవి అయితే ఇంతకాలంలో ఎంతో మంచి పేరు తెచ్చుకునేవారు. పరిపాలనపై దృష్టి కేంద్రీకరించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తూ, తన స్థానాన్ని కూడా సుస్థిర పరచుకునేవారు. కానీ, ఆయన నోరు, తీరు రెండూ బాగా లేవు. ఇది సామాన్యుల నుంచి విజ్ఞుల వరకు అందరూ ఎత్తిచూపుతున్నారు. పాత లక్షణాలు పోయేందుకు కొంత సమయం పడుతుందిలే అనుకుని కొంతకాలం వేచిచూసిన వారు కూడా ఈ సరికి ఆశలు వదులుకున్నారు. తనలో ఆ ధోరణి పోకపోగా ఇటీవల మరింత రెచ్చిపోతున్నారు. అందుకు కారణం ఒత్తిడికి గురికావటమని, డెస్పరేషన్ అని ఏ మానసిక శాస్త్ర నిపుణుడిని అడిగినా చెప్తారు. మరి అటువంటి ఒత్తిడికి కారణమేమిటని విచారిస్తే, పరిపాలనలోని వైఫల్యాలు, వాటిపై ప్రజల నుంచి ఇతర వర్గాల నుంచి పెరుగుతున్న విమర్శలని కూడా ఎవరైనా చెప్పగలరు.



టంకశాల అశోక్

అసెంబ్లీ ఎన్నికలలో రేవంత్ నాయకత్వాన కాంగ్రెస్ గెలిచిన తొలి ఘడియలలో, తన చుట్టూ పార్టీ కార్యకర్తలు మోహరించి ఉండగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆ కార్యకర్తలను, వారితో పాటు అక్కడ లేనివారిని కూడా ఉద్దేశిస్తూ రెండు మాటలన్నారు. తాను అప్పటివరకు మాట్లాడిన తీరులో ఇక ముందు మాట్లాడలేనని, ఆ విషయం అందరూ అర్థం చేసుకోవాలని, ఇక ఆ భాషను ఆశించవద్దని అన్నారు. అప్పటివరకు మాట్లాడిన తీరు ఏమిటో ఆయన వివరించలేదు.

కానీ, అదేమిటో అందరికీ సుపరిచితమే గనుక వెంటనే ఓహో అనుకున్నారు. అయితే, అటువంటి భాషకు, దూకుడుకు మెచ్చి అలవాటు పడిన రేవంత్‌రెడ్డి బ్రాండ్ ఆధునిక శిష్య గణానికి, అటువంటి సాధు భాష ఎంతవరకు నచ్చిందో చెప్పలేము. అటువంటి సూక్ష్మస్థాయి (మైక్రో) రిపోర్టింగ్ జర్నలిజం మనకింకా రాలేదు. మామూలు పద్ధతిలో ఊహించాలంటే వారికది ఎంతమాత్రం నచ్చదు. అదెట్లున్నా, వారిని ఆయన ఎంతమాత్రం నిరాశపరచలేదన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ఎవరికైనా పాత సంస్కృతిని వదిలించుకోవాలని నిజంగానే ఉన్నా, జీవిత నేపథ్యం నుంచి అలవడిన దశాబ్దాల అలవాట్లు గనుక అంత త్వరగా పోవు. అందుకు సమయం అవసరం. సదరు అలవాట్లను క్రమక్రమంగానైనా పోగొట్టుకుంటున్నారా లేదా అని అందరూ గమనిస్తారు. పోగొట్టుకుంటుంటే సంతోషిస్తారు. లేకుంటే మరొకమారు ఓహో అనుకుంటారు. పైన పేర్కొన్న మొదటి ఓహోకు, ఈ రెండవ ఓహోకు అర్థమేమిటో బహుశా చెప్పనక్కరలేదు. ఈ పదినెలల తర్వాత మాత్రం అందరూ ఈ రెండవ ఓహో అనుకుంటున్నారు.

ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణాలలో రేవంత్‌రెడ్డి, తను అంతవరకు మాట్లాడిన భాష ఉచితమైనది కాదని గ్రహించినందువల్లనే, ఇక పైన తన భాష గురించి అటువంటి విజ్ఞతతో కూడిన మాట చెప్పారు. ఆ భాష ఇకనుంచి ఉపయోగించవద్దని ఆయన తనకు తాను అనుకునే ఉంటారు కూడా. కానీ, విధి బలీయమైనది అన్నట్లు మనుషులకు గత సంస్కృతీ సంస్కారాలు కూడా బలీయమైనవి. వారు జీవితంలో ఏదైనా దశలో గత అవాంఛనీయ సంస్కృతిని వదులుకోవాలని, అది ఇకపై ఫలానా విధంగా ఉండాలని సంకల్పించుకున్నప్పటికీ, పాత కొత్తల మధ్య ఘర్షణ జరుగుతుంటుంది. ఆ ఘర్షణలో క్రమంగా కొత్తదానిది పైచేయి అవుతే ఆ వ్యక్తి సంకల్పం గౌతమ బుద్ధునికి వలెనే బలమైనదని భావించాలి. అది ఆహ్వానించదగిన పరిణామక్రమం అవుతుంది. అందుకు భిన్నంగా ఒకవేళ పాతదానిదే పైచేయి అవుతున్నట్టు కనిపించే పక్షంలో ఆ వ్యక్తి సంకల్పం బలమైనది కాదని స్పష్టమవుతుంది. రేవంత్ రెడ్డి వలెనే. ఒకసారి ఆ విధంగా పాత సంస్కృతే గెలుస్తూ కొత్త సంకల్పమన్నది ఓడటం మొదలైతే, ఇక ఆ వ్యక్తికి నిష్కృతి లభించేది జీవితంలో ఏదో ఒక పెద్ద దెబ్బ తగిలితే మాత్రమే.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలోనే, తన భాషలో మార్పును గురించి ఇచ్చిన మాటను మరిచి చేసిన వ్యాఖ్యలు అనేకం ఉన్నాయి గానీ, వాటిలో ఒకటి ఆయనకు దేశమంతటా పేరును తెచ్చిపెట్టింది. అది, స్వయంగా తన ప్రభుత్వంలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి వారిది 'బీహార్ డీఎన్ఏ' అని వ్యాఖ్యానించటం. ఈ ఎలక్ట్రానిక్ యుగంలో అది నిముషాలలో ఢిల్లీతో సహా ఉత్తరాదికంతా, దానితో పాటు ఇతర రాష్ర్టాలకు వ్యాపించిపోయింది. అందరూ దిగ్భ్రాంతి చెందారు. రేవంత్ రెడ్డి పేరు అంతవరకు దేశంలో ఎక్కువగా తెలియదు. ఎన్నికలు గెలిచినాక అప్పుడప్పుడే వింటున్నారు. అటువంటిది ఈ వ్యాఖ్యతో ఒక్కసారిగా పేరుతో పాటు ఆయన నోటి తీరు కూడా తెలిసిపోయింది. ఒక మనిషి డీఎన్ఏ గురించిన ప్రస్తావన ఎవరైనా దూషణలో భాగంగా అలవోకగా చేయవచ్చుగానీ, అది చాలా సున్నితమైన ప్రస్తావన. అది విశ్లేషణాత్మకమైనది అయితే వేరే. కానీ, ఒక వర్గాన్ని ఉద్దేశించిన నిందాత్మక ప్రస్తావన. కనుకనే ఆ మాట తీవ్రంగా నొప్పించి దుమారం లేపింది. ఢిల్లీలో కాంగ్రెస్ వారు క్షమాపణాపూర్వకమైన స్వరాలలో సంజాయిషీలు ఇచ్చుకోవలసి వచ్చింది. మరి స్వయంగా ముఖ్యమంత్రి అందుకు క్షమాపణలు చెప్పి, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని అన్నట్టయితే గుర్తులేదు.

> **అట్లా చేయటం సరైనదని కొత్త సంస్కారం చెప్పే, చేయనక్కరలేదని పాత సంస్కారం చెప్పిందేమో తెలియదు. సినిమాల్లో చూస్తుంటాము గదా, హీరో లేదా హీరోయిన్‌కు అద్దంలోని ప్రతిరూపం ఒకటి, తన మనసు మరొకటి చెప్పటం వంటిదన్న మాట. ఆ విధంగా చూడగా ప్రస్తుత సన్నివేశంలో పాత సంస్కృతే గెలిచిందన్న మాట. (ఒకవేళ ఆయన ఉపసంహరించుకొని ఉండి అది నేను గమనించకపోతే, ఈ మాటలు ఉపసంహరించుకున్నట్టు భావించి నన్ను క్షమించగలరు.)**

సమస్య ఎక్కడ వస్తున్నదంటే, రేవంత్‌రెడ్డి తన భాషను పది నెలలు గడిచినా మార్చుకొనకపోగా, వీధిలోని సామాన్యుడు సైతం ఈసడిస్తున్నా పైన పేర్కొన్న విధంగా తానిచ్చిన మాటను ఎంతమాత్రం నిలబెట్టుకోకపోగా, నానాటికి మరింత పరుషంగా, అసభ్యంగా మార్చుకుంటున్నారు. అట్లా డెస్పరేషన్‌తో తమ గొంతు చించుకున్నా ప్రజలపై ప్రభావం పడే దశ గడిచిపోయిందన్నది వేరే మాట. ఒకవేళ ఆ తరహా భాష తన ప్రత్యర్థులు ఉపయోగిస్తున్నారని కారణంగా వెదకదలచుకున్నా తను అందుకు భిన్నంగా వ్యవహరించి మంచి సంప్రదాయం నెలకొల్పాలి. అప్పుడు ఒత్తిడి ఎదుటివారిపై పడుతుంది. స్వయంగా తమకు తాముగా, ప్రజాభిప్రాయ రూపంలో కూడా. అప్పుడు ఆయనకు ఔన్నత్యం లభిస్తుంది. కానీ ఇటువంటిదేమీ కన్పించటం లేదు. తను తన నోటి కారణంగా పలచన కావటం ఒకటైతే, వందరోజుల గడువుతో హామీల బాండ్ పేపర్లను ఇంటింటికీ తిరిగి ఇచ్చి కూడా వాటి అమలుపై మాట తప్పటం అందుకు తోడవుతున్నది. ఆయన తీరు అని పైన అన్నది ఇందుగురించే. తమ ఆరు గ్యారెంటీల పత్రాన్ని ఎవరూ చేతికి తీసుకుని ఒక్కొక్కటిగా లెక్కలు వేసినా, వంద రోజులు కాదు గదా ఈ పది నెలల కాలంలో జరిగిందేమిటో, జరగనిదేమిటో ఎవరైనా చెప్పగలరు. చెప్తున్నారు కూడా. అందుకు సంబంధించి ప్రజల వ్యాఖ్యలకు గాని, ప్రతిపక్షాల విమర్శలకు గాని ప్రభుత్వం వారు చేస్తున్నదేమిటి? రకరకాల బుకాయింపులు. ఈ విషయంలో మేధావులు అనబడేవారు ఏమీ మాట్లాడరని తెలిసిపోయిన ప్రజలకు, ఎందుకు మాట్లాడరో కూడా అర్థమైపోయినందున వారి సంగతి వదలి వేద్దాం. ప్రజలు కూడా వదలివేసినట్టున్నారు. మొన్నటి ఎన్నికలపుడు కాంగ్రెస్ ప్రచార రథాలకు జెండాలూపిన ఈ మేధావులు వచ్చే ఎన్నికలకు కూడా జండాలు ఊపేవరకు.

ప్రజలు గ్యారెంటీల గురించి మాత్రం మాట్లాడుతూనే ఉన్నారు. ఎందువల్ల? అవి అమలుకాకపోవటం వల్ల. అమలుపై ముఖ్యమంత్రి పదే పదే అలవోకగా, నిస్సంకోచంగా నిర్భీతిగా చెప్తున్న అబద్ధాల వల్ల. ఆయన తీరు అంటున్నది ఇది కావటం వల్ల. ఈ తెలుగు నేలపై ముఖ్యమంత్రులను మొదటినుంచి చూస్తూ వచ్చిన వారున్నారు. కానీ, రేవంత్‌రెడ్డి తరహా నోరున్నవారిని గాని, తెల్లవారిలేస్తే చాలు ఇన్నిన్ని అబద్ధాలు ఆడేవారిని గాని అవే అబద్ధాలు మళ్లీ మళ్లీ చెప్పేవారిని గాని చూడలేదు వారు. తనకు పరిపాలనానుభవం లేదు. ఆ మాట ఆయనే ఒప్పుకున్నారు గాని సమస్య అది కానక్కరలేదు. అనుభవం లేకుండా నేరుగా ముఖ్యమంత్రులైన వారు ఇతరులు కూడా ఉన్నారు. అందరికీ వెంటనే గుర్తుకువచ్చేది ఎన్టీఆర్. ఆయన పరిపాలన తీరు ఇట్లా ఎంతమాత్రం లేదే. నోటి విషయం వదిలివేద్దాం. ఇద్దరి నేపథ్యాలు, సంస్కృతులు వేరు గనుక. తనకు పాలనానుభవం లేదని మొదటనే నిజాయితీగా అంగీకరించిన రేవంత్‌రెడ్డి ఒకవేళ అంతే నిజాయితీ చూపుతూ, పరిపాలనను నేర్చుకుంటూ, అందరి సహకారంతో ముందుకు సాగటానికి ప్రయత్నించినట్లయితే, అది కొంత కాలం పాటు నెమ్మదిగా సాగినా ప్రజలు అర్థం చేసుకుని ఓపిక పట్టేవారు, హర్షించేవారు.

> **కానీ, తను అట్లా చేయకపోగా రోజూ బుకాయింపులు, అబద్ధాలతో అనేక హామీల గురించి అసలేమీ మాట్లాడనైనా మాట్లాడక దాటివేతలతో, రెండురోజుల కొక డ్రామాతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలతో, ప్రతిపక్షాలపై నోరు చేసుకోవటంతో కాలం గడుపుతుండటం వల్ల అందుకు గల అవకాశాన్ని ఆయన తనకు తానే ఇన్ని నెలలుగా చెడగొట్టుకుని, ఇప్పటికీ అదే చేస్తున్నారు.**

ఇందుకు ఇటీవలి రెండు ఉదాహరణలను చూడండి. ఒకటి, హైడ్రా వ్యవహారం. రెండు, సినీ నటి సమంత, మరికొందరు నటులు, అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు. జల వనరుల పరిరక్షణ, మూసీ ప్రక్షాళనలు రాజశేఖర్‌రెడ్డి కాలం నుంచి ఉన్న ఆలోచన. అవెంత ముఖ్యమైనవో కొత్తగా మళ్లీ చెప్పనక్కరలేదు. అటువంటి కార్యక్రమంపై ముందుగా మేధోమథనం, అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా సేకరించటం, పూర్తిస్థాయి ప్రణాళికారచన, దాని అమలుకు తగిన ఏర్పాట్లు, జాగ్రత్తలు, అన్నీ ప్రజల ముందు పారదర్శకంగా, ప్రజాస్వామికంగా ఉంచి వారి అభిప్రాయాలు తీసుకోవటం, ఇళ్లు, వ్యాపారాలు, పనులు కోల్పోయేవారికి ప్రత్యామ్నాయాలు, పరిహారాలు, దోషులైన అధికారులూ తదితరులపై చర్యలు, దేనికైనా ముందు మూసీ మురికి శుద్ధి, కాలుష్యాలు రాకుండా ఆపటం, మొదలైనవి అసలేవీ ఎంతమాత్రం లేకుండా, సర్వేలు ఎందుకో ప్రజలకు సమాచారం ఇవ్వకుండా, వివిధ శాఖల మధ్య సమన్వయమన్నదే లేకుండా, అకస్మాత్తుగా ఎర్ర మార్కింగులు, నోటీసులు ఇచ్చి సామాన్లయినా తీసుకునే అవకాశం ఇవ్వకుండా పోలీసులతో బెదిరింపులు, జేసీబీ కూల్చివేతలు, నోటీసులిస్తే కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటారు, శని, ఆదివారాల్లోనైతే కోర్టులుండవు వంటి దుర్మార్గపు ఆలోచనలూ, ఈ తీరునంతా ఏమంటారో ముఖ్యమంత్రే ప్రజలకు నిజాయితీగా చెప్పాలి.

ఈ తరహా హైడ్రా అరాచకం రెండు నెలలకు పైగా సాగినంతకాలం, ప్రజల ఆందోళనను, రోదనను ఎత్తిచూపిన ప్రతిపక్షాలపైనే ఆయన దాడులు సాగించారు తప్ప తన పొరపాట్లను నిజాయితీగా గుర్తించి సరిదిద్దుకోలేదు. లక్షన్నర కోట్లెందుకో చెప్పటం లేదు. కాంగ్రెస్‌లోనే విమర్శలు ఎందుకో గ్రహించటం లేదు. అంతా జరిగిన వెనుక ఇప్పుడు తీరికగా, ఏ ఒక్కరినీ బాధపెట్టం, పునరావాసానికి పూచీ మాది, ప్రతిపక్షాలు సూచనలివ్వాలి, ప్రత్యామ్నాయ ఉపాధికి కమిటీ, పరిహారాలిస్తాం, అందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ప్రజలు సహకరించాలి వగైరా మాటలు మాట్లాడుతున్నారు. ఒక పాలకునికి మొదటనే ఉండవలసిన వివేకమిది. కనీసం ఇప్పటికైనా, ఆయన ఏమి చేయగలరో జాగ్రత్తగా గమనించటం అవసరం. అదేవిధంగా, ధనికులు పేదల మధ్య వివక్ష చూపటాన్ని, ఫొటోల సాక్ష్యంగా బయటపడిన తమ వారి ఫాంహౌజ్‌లను కాపాడటాన్ని, ప్రతిపక్షాలలో సబితా ఇంద్రారెడ్డి కుమారుల వంటి వారికి ఫాంహౌజ్‌లు లేకున్నా ఉన్నాయనే తరహా దబాయింపులను, ప్రతిపక్షాలు తమ భూములూ నిధులూ ఇస్తే నిర్వాసితులకు ఇళ్లు కట్టిస్తామనే హాస్యాస్పదపు వాదనలను ఇప్పటికైనా ఆపివేయగలరేమో కూడా చూడాలి.

విశేషం ఏమంటే, 5వ తేదీన ఇవన్నీ మాట్లాడి తనది సానునయ వైఖరి అని చూపించదలచిన ముఖ్యమంత్రి, 24 గంటలు తిరిగేసరికి 6వ తేదీన అందుకు భిన్నంగా మాట్లాడారు. మూసీ పథకం ఎవరు అడ్డుపడినా ఆగదని, ప్రక్షాళన చేసి తీరుతామని, అక్కడి ప్రజలు మురికిలోనే బతకాలా, వారి పిల్లలు బాగుపడవద్దా అని తన షరామామూలు తరహాలో మరొకమారు విజృంభించారు. అది విని నవ్వు వచ్చింది. మూసీని ప్రక్షాళన చేయవద్దని, అక్కడి ప్రజలు, పిల్లల జీవితాలు బాగుపడవద్దని ఇంతవరకు ఒక్కరంటే ఒక్కరైనా అనలేదు. ఇళ్లూ, వ్యాపార స్థలాలు కోల్పోతున్న బాధితులు సైతం అనటం లేదు.

> **కానీ, ఆ ప్రక్షాళన ఒక సమగ్ర ప్రణాళిక ప్రకారం సవ్యంగా చేయాలంటున్నారు. అదంతా తెలిసి కూడా వదిలివేస్తున్న రేవంత్ రెడ్డి, తన వైఫల్యాలను దాచి పెట్టేందుకు, ప్రక్షాళనను ఎవరో వ్యతిరేకిస్తున్నారంటూ తనకు తానే విలన్లను సృష్టించుకొని వారిపై నీడల యుద్ధాలు చేస్తున్నారు. ఇది రాజకీయాలలో ఒక ఎత్తుగడే కానీ, దానికి కాలం చెల్లిందని ఆయన గ్రహించాలి. ఈ ధోరణి వల్ల తనకు తానే విలన్ అవుతున్నానని అర్థం చేసుకొని పద్ధతులు మార్చుకోవాలి.**

పోతే, విషయం సున్నితమైనది అయినందున ఎక్కువ రాసుకోలేము గానీ, సినిమా కళాకారులపై మంత్రి సురేఖ వ్యాఖ్యల గురించి దేశమంతటా విమర్శలు వెల్లువెత్తినా, స్వయంగా కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఆందోళన చెందినా, నోరు విప్పి ఒకమాటైనా అనని రేవంత్‌రెడ్డి తీరు గురించి ఏమనుకోవాలి. తన నోటిదురుసుతనపు సంస్కృతే ఆమెకు ప్రేరణ కలిగించి, ధైర్యాన్ని కూడా ఇచ్చి ఉంటుందని ఎందుకు భావించకూడదు. మొత్తానికి ఈ విధమైన నోరు, తీరులతో ఆయన తెలుగువారి రాజకీయ చరిత్రలో నిలిచిపోయేట్లున్నారు. అందరికీ ఏదో ఒక ప్రాతిపదిక ఉండాలి కదా.



నోటీసులు ఇచ్చి సామాన్లయినా తీసుకునే అవకాశం ఇవ్వకుండా పోలీసులతో బెదిరింపులు, జేసీబీ కూల్చివేతలు, నోటీసులిస్తే కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటారు, శని, ఆదివారాల్లోనైతే కోర్టులుండవు వంటి దుర్మార్గపు ఆలోచనలూ, ఈ తీరునంతా ఏమంటారో ముఖ్యమంత్రే ప్రజలకు నిజాయితీగా చెప్పాలి.

గోండు సూరీడు కుమ్రం భీం

జోడెఘాట్‌లో నాటి నిజాం బలగాలతో తలపడిన గోండు అమరవీరుడు కుమ్రంభీం చుట్టూ ఎన్నో కథనాలు, కల్పనలు అల్లుకున్నాయి. వాటిని ఛేదించే ప్రయాణంలో నేను భీం సతీమణి సోంబాయిని కలిసి మాట్లాడాను. అలాగే అప్పటి కలెక్టర్ (అవ్వల్ తాలూక్దార్) అబ్దుల్ సత్తార్ నివేదికలను పరిశోధించాను. వాటి ఆధారంగా రాసిన ఈ వ్యాసం ద్వారా కుమ్రంభీం వ్యక్తిత్వం, నాడు జరిగిన వాస్తవాలపై కొంత స్పష్టత వస్తుందని భావిస్తున్నాను.




ఎస్.ఎం.ప్రాణ్‌రావు
80089 50101

కుమ్రం భీం దాదాపుగా 1901లో పుట్టి ఉంటాడు. భీం సాధారణ శరీర సౌష్ఠవం, మామూలు ఎత్తు కలిగిన వ్యక్తి. ఆయన చదువుకున్నాడు. తెలుగు, ఉర్దూ రెండు భాషలు చదవడం, రాయడం ఆయనకు వచ్చు. గోండులు అతనిని ఎంతో గౌరవించేవారు. భీం వృత్తిరీత్యా రైతు. ఇతర రైతుల మాదిరిగా భూమినే నమ్ముకుని పగలు, రాత్రి శ్రమించేవాడు. భీం దైవభక్తి గలవాడు. గోండు దేవతలను నిత్యం పూజించేవాడు. ముస్లింల పట్ల ద్వేషం, వైరం ఎన్నడూ ప్రదర్శించేవాడు కాదు. తన తోటి గోండులలా భీం ఎన్నడూ అణిగిమణిగి ఉండలేదు. అందుకే తగిన కారణం లేకుండా సిద్దిఖీ దాడి చేసినప్పుడు దెబ్బకు దెబ్బ తీశాడు. భీం చేతిలో చావుదెబ్బలు తిన్న సిద్దిఖీ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాళ్లకు పనిచెప్పాడు. అణచివేతకు లొంగే తత్వం భీంలో ఏ కోశానా లేదు. అందుకే అటవీశాఖ అధికారులు బాబాజరీలో గోండుల గుడిసెలకు నిప్పు పెట్టి, వారి పొలాలు ధ్వంసం చేసినప్పుడు భీం ఎదురు తిరిగాడు. భీం దూకుడుకు అటవీ శాఖ అధికారులు తోకముడవక తప్పలేదు. భీం మోచేతి నీళ్లు తాగే రకం కాదు. అవినీతి అధికారులను చూసి అతడు ఎన్నడూ బెదరలేదు.

> **భీం మూఢ నమ్మకాలను విశ్వసిస్తాడని అతడి గురించి ప్రచారం జరిగింది. భీం నాస్తికుడు కాదు. అతడు తన దేవుళ్లను భక్తి శ్రద్ధలతో పూజించేవాడు. తన తెగకు చెందిన అన్నిరకాల కర్మ- కాండలలోనూ పాల్గొనేవాడు. అయితే, అతనికి మూఢ నమ్మకాలు లేవు. యుద్ధానికి ముందురోజు, వందలమంది గోండులు గుమిగూడిన సభలో అతను ప్రసంగించాడు. పోరుకు ముందుకు దూకలేని పిరికివాళ్లు, ప్రాణ భయం ఉన్నవాళ్లు వెనక్కి తిరిగి వెళ్లిపోవచ్చని అందరిముందు కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. భీం దగ్గర కొన్ని అతీంద్రియ శక్తులు, మంత్రశక్తులున్నాయని అతని గురించి కొమరం సూరు చెప్పిన కథలలో ఉన్నది. కానీ, అతని దగ్గర ఆ శక్తులున్నాయని అతని అనుచరులూ నమ్మలేదు.**

యుద్ధానికి ముందుకు కదులుతున్నప్పుడు, గోండులు తమని ఏదో మానవాతీత శక్తి ఆవహించి కదుపుతున్నట్టు కదులుతారు. అది ఒక రకమైన మంత్రంతో ముగ్ధులై ముందుకు కదిలినట్టు. దానివల్లే భీంకి అతీంద్రియ శక్తులున్నాయని వదంతులు వ్యాపించాయి. వీటిని పోలీసు కానిస్టేబుళ్లు కూడా నమ్మేవారు. 'నేను చావుకు సిద్ధపడే వచ్చానని' భీం ఎలుగెత్తి అరిచేవాడు. చేతిలో ఏ ఆయుధం లేకుండా కుమ్రం భీం నిజాం సైనికుల మీదికి యుద్ధానికి ముందుకు దూకాడని ఒక కథనం ఉంది. చేతిలో ఏ ఆయుధం లేకుండా భీం తమ వైపు సుడిగాలిలా దూసుకువచ్చాడన్నది పచ్చి అబద్ధం. భీం పుట్టుకతోనే యోధుడు. అతడు రాజగోండు. బాబాజరిలో భీం తన శత్రువుపై మెరుపుదాడి చేశాడు. ఇటువంటి గెరిల్లా తరహా దాడులు కేవలం కాకలు తీరిన యుద్ధవీరులే చేస్తారు. ఒక వీరుడు శత్రు సైన్యాన్ని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయడు. భీం కూడా అంతే. అందుకే ఇతర బలవంతులైన గోండుల సహాయ సహకారాల కోసం భీం తన దూతలను వారి దగ్గరికి పంపించినట్టు తెలుస్తున్నది. పంగడి రాజు దగ్గరికి వెళ్లి భీం దూతలైన జాకో, కుమారలింగ, భీం సందేశం వినిపిస్తారు. ప్రాణాలకు తెగించిన దాదాపు 500 మంది గోండులు చేతికి అందిన ఆయుధాలను తీసుకుని జోడెఘాట్‌కి రావడానికి కారణం భీం వాస్తవిక యుద్ధనీతి, అతనిలోని యోధుడి లక్షణాలు, గోండు రాజ్యం స్థాపించాలనే అతని ఆశయం తప్ప మరొకటి కాదు.



జోడెఘాట్‌లో యుద్ధం జరిగినరోజు గాని, లేక ఆ మరుసటి రోజు గాని కుమ్రం భీం వీర మరణం పొందాడు. ఆయన 1940 అక్టోబర్ 8న చనిపోయాడని ఒక అభిప్రాయం ఉంది. జోడెఘాట్‌లో జరిగిన యుద్ధం గురించి వివరాలు 1940 అక్టోబర్ 7న ముషీర్-ఏ-దక్కన్‌లో వచ్చాయని, హోమ్ సెక్రటరీ మహ్మద్ అజర్ హసన్ (Esq)కు అబ్దుల్ సత్తార్ రాసిన ఉత్తరంలో ఉన్నది. అంతకుముందు అక్టోబర్ 6న కాశీనాథరావు వైద్య, సిరాజుల్ తిర్మియాజీ, ఎం.నరసింగరావు, రామాచారి వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి ఆసిఫాబాద్ వెళ్లారు. అదే రోజు రాజకీయ నాయకులు, హిందూ ప్రజా మండలికి చెందినవారు కూడా వెళ్లారు. కాబట్టి, కుమ్రం భీం 1940 అక్టోబర్‌లో అమరుడయ్యాడనేది వాస్తవమే. కానీ, సరైన తేదీ 5వ తేదీ కంటే ముందే ఉంటుందనేది నా నమ్మకం.

(నేడు కుమ్రం భీం వర్ధంతి)

బీసీలపై కాంగ్రెస్ కప్పదాటు

బీసీ రిజర్వేషన్ల చుట్టే తెలంగాణ రాజకీయాలు తిరుగుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని బీసీలను కాంగ్రెస్ పార్టీ తమ వైపునకు మలుపుకొన్నది. ఆ వ్యూహాత్మక రాజకీయం ఫలించి కాంగ్రెస్‌కు అధికార పీఠం దక్కింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ గొప్పగా ప్రకటించినా, ఇంకా ఆ హామీని అమలుచేయకుండా కాలయాపన చేస్తోంది. బీసీలను కాంగ్రెస్ మరోసారి బలి పశువులను చేసిందనే చెప్పవచ్చు. అయితే, రిజర్వేషన్ల లెక్క తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు మొట్టికాయలు వేయడంతో కాంగ్రెస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక వలె మారింది.

బీసీ కమిషన్‌ను ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేసే దిశగా అడుగులు వేస్తున్నా, ప్రజలకు మాత్రం నమ్మకం ఏర్పడటం లేదు. బీసీ కులగణన మాత్రమే కాదు, సమగ్ర కులగణన చేయాలని పట్టుబడుతున్నారు. కాగా, కులగణన మాత్రమే చేసి చేతులు దులుపుకుంటే మరోసారి బీసీలకు కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక ద్రోహం తలపెట్టినట్టే. బీసీల పట్ల కాంగ్రెస్ వంచన కొత్త కాదు, ఇదే ఆఖరిదీ కాకపోవచ్చు. నాడు కాలేల్కర్ కమిషన్ నుంచి.. నేడు రాహుల్‌గాంధీ సామాజిక న్యాయం సమగ్ర కులగణన అనే జపం చేస్తూ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నా, అందుకు విరుద్ధంగా రేవంత్‌రెడ్డి ఆ పరంపరను కొనసాగిస్తున్నట్టుగానే భావించాల్సి ఉంటుంది.

బీహార్‌లో 69 శాతం రిజర్వేషన్లు కల్పించగా దానికి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. అందుకే, అధికార కాంగ్రెస్ పార్టీ ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఏం చొరవ తీసుకుంటుందని బీసీ సమాజం వెయ్యికండ్లతో చూస్తున్నది. అయితే, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం ఓ బోగస్‌గానే కనిపిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ కులగణన చేయాలని పల్లవి అందుకున్నారు. న్యాయ్‌యాత్ర ఆసాంతం బీసీ కులగణన జపం చేశారు. కానీ, కాంగ్రెస్ పాలిత రాష్ర్టాల్లో బీసీలు కోరుతున్నట్టుగా సమగ్ర కులగణన చేపట్టకపోగా, బీసీ కులగణనను కూడా చేపట్టేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖత వ్యక్తం చేయడం లేదు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే తెలంగాణలో బీసీ కులగణన జరుగుతున్నా, రేపు న్యాయపరమైన చిక్కులు ఏర్పడితే బీసీలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని అధికార కాంగ్రెస్ తీసుకుంటుందా? అనే విషయాన్ని బట్టి బీసీల పట్ల కాంగ్రెస్ ధోరణి తెలుస్తుంది.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కప్పదాటు నిర్ణయాలతో తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు పూర్తిగా చిక్కిశల్యమవుతున్నాయి. గ్రామాల్లో పాలన ముగిసినా ఇంకా సర్పంచ్ ఎలక్షన్లు నిర్వహించలేదు. దీంతో కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు కూడా వెనక్కి మళ్లాయి. అటు కేంద్రం నిధులు రాక, ఇటు సర్పంచ్‌లు లేక గ్రామాలు తిరోగమనంలోకి వెళ్తున్నాయి. మెజారిటీ గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మహాత్ముడి బోధనలను పదే పదే వల్లించే ముఖ్యమంత్రి రేవంత్ గాంధీ కలలుగన్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఏ ఒక్కరికీ భరోసానివ్వడం లేదు.

ఇక, బీసీలకు కాంగ్రెస్ ఆది నుంచి ద్రోహం చేసుకుంటూనే వస్తున్నది. తెలంగాణలో ఆ పార్టీ బీసీల నుంచి అగ్నిపరీక్షను ఎదుర్కొంటుండగా, జాతీయ స్థాయిలో బీజేపీ సైతం ఎలాంటి వైఖరి తీసుకోబోతుందన్నది బీసీలు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని చెప్తున్నా బీసీల పట్ల బీజేపీ వారి విశ్వసనీయతను మరింత పెంపొందించుకోవాలంటే జాతీయస్థాయిలో సమగ్ర కులగణన చేయాలి. అన్నివర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నట్టుగానే.. ఇంకా బ్యాక్‌వర్డ్ క్లాజ్‌గానే ఉండిపోయిన బీసీలను బ్యాక్‌బోన్ క్లాజ్‌గా మార్చాల్సిన తక్షణ కర్తవ్యం బీజేపీ ముందున్నది. సమగ్ర కులగణన తర్వాత బీసీల జనాభా దామాషా ప్రకారం కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో రిజర్వేషన్లు అమలుచేసి సామాజిక న్యాయం చేస్తుందని ఆశిద్దాం.

- చింతపల్లి కిరణ్, 99896 32612

ఫ్రీ బస్సు ప్రయాణంపై మహిళల మండిపాటు

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి దిమ్మదిరిగే షాక్ ఇచ్చిన మహిళలు

మునుగోడు, అక్టోబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు ప్రయాణం ఎలా ఉందని తెలుసుకోబోయిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మహిళలు షాక్ ఇచ్చారు. రాజగోపాల్‌రెడ్డి ఆదివారం మునుగోడు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులతోపాటు మునుగోడు బస్టాండ్‌ను పరిశీలిస్తున్న సమయంలో బస్టాండ్‌లోకి వచ్చిన ఆయన ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళలతో మాట్లాడారు. ఫ్రీ బస్సు సర్వీస్ ఎలా ఉంద ని మహిళలను ఎమ్మెల్యే ప్రశ్నించగా, ఆయనకు ఊహించని సమాధానాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ సంభాషణ సాగిందిలా...

- **రాజగోపాల్‌రెడ్డి:** ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది?
- **మహిళలు :** డబ్బులు ఇచ్చి టికెట్ కొన్నవాళ్లు నిలబడుతున్నారు సార్. మేం కూసోని పోతున్నం. ఇది కరెక్ట్ కాదు.
- **రాజగోపాల్‌రెడ్డి:** ఉచిత బస్సు సౌకర్యం సంతోషంగా ఉందా?లేదా?
- **మహిళలు :** ఏం సంతోషం! జాబ్ చేసుకునే వాళ్లకు తప్ప కూలీనాలి చేసుకునే మాకు ఏమన్నా ఉపయోగం ఉందా?



మునుగోడులో ఆర్టీసీ బస్సులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- **రాజగోపాల్‌రెడ్డి :** టికెట్ డబ్బులు మిగులుతున్నయి కదా?
- **మహిళలు :** మేం ఏమన్నా రోజు పోతున్నమా, మాకేం పని లేదా, ఇంతకు ముందు ఇంత రష్ ఉండకపోతుండే. ఫ్రీ బస్ అనేసరికి ఒకరి మీద ఒకరు పడుతున్నారు.



స్కందమాతా రూపంలో అమ్మవారు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం బాసర సరస్వతీ అమ్మవారు స్కందమాతా రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. ఆలయంలో సుహాసిని పూజ, మంత్రపుష్పం, మూల నక్షత్రపూజ, అర్చకులు నిర్వహించారు. ఆరో రోజు భక్తులకు సరస్వతీ అమ్మవారు కాత్యాయని రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. - బాసర

సీట్ల కోసం సిగపట్లు

మక్తల్‌లో ఆర్టీసీ బస్సులో మహిళల ఘర్షణ

మక్తల్, అక్టోబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల మధ్య కొట్లాటలు ఆగడం లేదు. నిత్యం ఏదో ఓ చోట గొడవలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా నారాయణపేట జిల్లా మక్తల్ బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులో సీట్ల కోసం ఇద్దరు మహిళలు సిగపట్లు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి గద్వాల వెళ్లే బస్సు సోమవారం ఉదయం 8:15 గంటలకు మక్తల్ బస్టాండ్‌కు వచ్చింది. ఈ సమయంలో మహిళలు తోసుకుంటూ బస్సెక్కారు. సీటు విషయంలో ఇద్దరి మధ్య మొదలైన గొడవలో సిగపట్లు పట్టుకున్నారు. తోటి ప్రయాణికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా.. వాళ్లు వచ్చి మొత్తం ఏడుగురిని పీఎస్‌కు తరలించారు. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డిని వివరణ కోరగా.. ప్రయాణికుల గొడవ తమ దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు.



నారాయణపేట జిల్లా మక్తల్ బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులో సీట్ల కోసం ఘర్షణ పడుతున్న మహిళలు

జర్నలిస్టుల ఇండ్ల రద్దు నిర్ణయం దారుణం

- పండుగవేళ కరీంనగర్ జర్నలిస్టుల్లో ఆవేదన
- రాజకీయ కక్షతోనే ప్రభుత్వ నిర్ణయం
- ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కరీంనగర్‌లో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలను ప్రభుత్వం రద్దుచేయడం శోచనీయమని, జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే దసరా కానుక ఇదేనా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరీంనగర్‌లో 118 మంది జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రాజకీయ కక్షలో భాగంగానే బతుకమ్మ, దసరా పండుగల వేళ జర్నలిస్టుల కుటుంబాల్లో ఆవేదనను మిగిల్చడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న దుర్మార్గ వైఖరికి ఇది మరో నిదర్శనమని తెలిపారు. జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అన్యాయం చేయొద్దని, ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల రద్దు ప్రకటనను ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన ఉద్యోగాలేవి?

- కొత్త నోటిఫికేషన్ లేదు.. ఉద్యోగం లేదు
- అబద్ధాలకు రేవంత్ బ్రాండ్ అంబాసిడర్
- ఢిల్లీకి మూటలు పంపడంపైనే సీఎం దృష్టి
- సింగరేణి లాభాలు కాంగ్రెస్ నేతల జేబుల్లోకి
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లు, ఉద్యోగాలు కాకుండా కాంగ్రెస్ సర్కార్ కొత్తగా ఎన్ని నోటిఫికేషన్లు వేసిందో? ఎన్ని కొత్త ఉద్యోగాలిచ్చిందో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వచ్చాక కొత్తగా నోటిఫికేషన్లు, ఉద్యోగాలేవీ ఇవ్వలేదని స్పష్టంచేశారు. అబద్ధాలకు రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని, నయా మోసగాడని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ లాగా రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు ఇస్తున్నారని ఎద్దేవాచేశారు.

ఒక్క హామీ అమలు కాలే

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరుతో ప్రియాంక గాంధీతో సభ ఏర్పాటు చేశారని, నిరుద్యోగ భృతి ఇస్తామని ఆమెతో చెప్పించారని, ఏటా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారని, 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని చెప్పారని, వీటిలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని బాల్క ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, మరో రెండు నెలలైతే ఏడాది పూర్తవుతుందని, ఈ రెండు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.



సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

నిరుద్యోగుల నోట్లో మట్టి

ప్రభుత్వ రంగంలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని బీఆర్‌ఎస్ చెప్పిందని, తాము అధికారంలో ఉన్నప్పుడు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 43వేల ఉద్యోగాల భర్తీ వివిధ దశల్లో ఉందని సుమన్ తెలిపారు. టీఎస్‌ఐపాస్ ద్వారా ప్రైవేట్ రంగంలో 24 లక్షలకు పైగా ఉద్యోగాలు వచ్చాయని, 2.32లక్షల ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని, 2.27 లక్షల ఉద్యోగాలకు బీఆర్‌ఎస్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చామని, బీఆర్‌ఎస్ సర్కార్ ఆరు వేల టీచర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదు వేలు కలిసి నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తుచేశారు. నిరుద్యోగుల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని, మూటలు సర్దుకోవడం, ఢిల్లీకి పంపడంపై రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని ఆరోపించారు. నిరుద్యోగులను రేవంత్‌రెడ్డి ఎందుకు కలవడం లేదని?, ఒక్క మంత్రి అయినా నిరుద్యోగులకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారా? అంటూ నిలదీశారు. మరో రెండు నెలలు ప్రభుత్వానికి సమయం ఇచ్చి ఆ తర్వాత నిరుద్యోగ యువతతో కలిసి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు ఇచ్చే బోనస్‌లో కొత్త పెట్టారని, కార్మికులకు రూ.3.80 లక్షలు రావాల్సి ఉంటే కేవలం రూ.1.90 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, కార్మికుల బోనస్ డబ్బులు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్లాయని విమర్శించారు. మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్ అభిలాషరావు, నరేశ్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

లోకం పోకడ



హెడ్డింగ్ ఇలా పెట్టొద్దని ఎన్నిసార్లు చెప్పాలయ్యా? ఆయన హైదరాబాద్ తిరిగి వచ్చేటప్పుడు ''హైదరాబాద్‌కు రేవంత్'' అని పెట్టమన్నా గదా!

ఎగవేతలకు కేరాఫ్ కాంగ్రెస్

- రుణమాఫీపై సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు
- పంటకాలం దాటినా రైతు భరోసాలేదాయె
- బోనస్ పేరిట బక్వాస్ చేస్తున్న సర్కార్
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, రైతుభరోసా, ఆసరా పింఛన్ పెంపును ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు ఎగవేతలకు కేరాఫ్‌గా మారిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టేసి పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. రెండు నెలలవుతున్నా ఎందుకు అమలు చేయడంలేదని నిలదీశారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ పూర్తయ్యేదాకా రైతుభరోసా ఇవ్వబోమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పడం దారుణమని పేర్కొన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ పేరిట రైతులను బక్వాస్ చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రభుత్వం ఉండటం ప్రజల దురదృష్టమని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బోగస్ సర్కారుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మైనంపల్లిపై కేసు నమోదు చేయాలి

లీగల్ ఒపీనియన్ పేరిట తాత్సారమెందుకు? • బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తేతెలంగాణ): తమ పార్టీ కార్యకర్తలు తనతోపాటు హరీశ్‌రావు, కేటీఆర్‌పై పెట్రోల్ పోస్తరని, ఇందుకు ప్లాన్ చేశానని.. ఆ ఇద్దరు నేతలు చావకుంటే పట్టుకొనైనా చంపేస్తమని కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో డీజీపీ వెంటనే స్పందించాలని కోరారు. సోమవారం 'ఎక్స్'లో ఇందుకు సంబంధించిన వీడియోను జత చేసి మాట్లాడారు. ఈ విషయంలో డీజీపీ వెంటనే స్పందించాలన్నారు. ఈ ఘటనపై అక్టోబర్ 3న గజ్వేల్ ఠాణాలో ఫిర్యాదు చేశామని తెలిపారు. అక్కడి పోలీసు అధికారులు లీగల్ ఒపీనియన్ పేరిట నాలుగు రోజులుగా నాన్చుతున్నారని ఆరోపించారు. అధికారుల విధులను అడ్డగించారనే నెపంతో హైడ్రా బాధితులను అరెస్ట్ చేసినప్పుడు లీగల్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. అంటే కాంగ్రెస్ పాలనలో సామాన్యులకు ఓ న్యాయం.. కాంగ్రెస్ నేతకు మరో న్యాయమా? అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్'లో మైనంపల్లి అన్న మాటల వీడియోను పోస్ట్ చేశారు.

దసరాలోగా హామీలను అమలు చేయాలి

తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను దసరా పండుగలోపే అమలు చేయాలని తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 భృతి ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన సర్కారు ఆరు నెలలైనా పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు నందకిషోర్, నర్సింహారెడ్డి, యాకన్న, రవికుమార్, ఈశ్వర్, లిఖిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనతో తెలిపారు. ఉపాధి కరువై పలువురు ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. మృతులను కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దసరా పండుగలోపు కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే దివ్యాంగుల అభ్యున్నతి

- కాంగ్రెస్ అవినీతి ఆరోపణలు హాస్యాస్పదం
- చేతనైతే మంచి పథకాలు అమలుచేయండి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే దివ్యాంగుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని, అలాంటి తమ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. బీఆర్‌ఎస్ హయంలో వికలాంగుల సంక్షేమం శాఖలో భారీ అవినీతి జరిగిందని శాఖతో సంబంధం లేని హరీశ్‌రావుపై, తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.500గా ఉన్న సామాజిక పింఛన్‌ను ప్రత్యేక రాష్ట్రంలో తొలుత రూ.1500, తర్వాత రూ.3,016, మూడోసారి 4,000కు పెంచామని గుర్తుచేశారు. విద్యలో ప్రతిభావంతులైన దివ్యాంగ విద్యార్థులకు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు అందించామని పేర్కొన్నారు. అంధ బాలికల కోసం ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆశ్రమ పాఠశాలలు నిర్వహించామని, బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రత్యేక పాఠశాలల్లో విద్య, ఏటా రూ.1,000 చొప్పున అందించామని తెలిపారు. స్వయం ఉపాధి కోసం 50 శాతం సబ్సిడీ రుణాలు, వాహనానికి రూ.30 వేల సబ్సిడీ, ఉచితంగా ల్యాప్‌టాప్, ఉపకరణాలు, దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించామని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 25 శాతం సబ్సిడీతో ఉపకరణాలు అందిస్తే.. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక వికలాంగుల సంక్షేమ శాఖ బడ్జెట్ రూ.20 కోట్ల నుంచి రూ.83 కోట్లకు పెంచామని తెలిపారు. సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు చివరికి కార్పొరేషన్ చైర్మన్లు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతనైతే దివ్యాంగులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే మంచి పథకాలు అమలు చేసి చూపించాలని సవాల్ విసిరారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.5°c	24.0°c
రంగారెడ్డి	37.1°c	19.8°c
మెదక్	36.1°c	20.7°c
నిజామాబాద్	35.6°c	24.9°c
ఖమ్మం	32.0°c	23.0°c
హైదరాబాద్	31.6°c	22.3°c
మహబూబ్‌నగర్	30.5°c	23.4°c
నల్లగొండ	29.5°c	24.0°c
కరీంనగర్	28.0°c	24.0°c
వరంగల్	28.0°c	22.0°c

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధ వారాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మ ల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొంది.

'టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్' వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు 21నుంచి 24వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని టీజీపీఎస్సీ సోమవారం తెలిపింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపింది. వెబ్ ఆప్షన్లకు 20 నుంచి లింక్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు https://www.tspsc.gov.inలో అందుబాటులో ఉన్న చెక్ లిస్ట్, అటెస్టేషన్ ఫారమ్‌లను డౌన్‌లోడ్ చేసి తీసుకురావాలని సూచించింది.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

- 7314 కోట్లకు 2350 కోట్లే కేటాయింపు
- ధాన్యం ఎక్కడ అమ్మినా బోనస్ చెల్లించాలి
- రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం
- సీఎం రేవంత్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్ది లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మద్దతు ధరతో పాటే రైతుల అకౌంట్లలో బోనస్ వేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రతి పంటకు బోనస్ చెల్లించాలని, కేవలం సన్న రకానికే ఇస్తామంటే కుదరని, ఈ విషయంలో రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టంచేశారు. ఈమేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. వానకాలం పంట 1,46,28,000 మెట్రిక్ టన్నుల ధాన్యానికి బోనస్ రూ.500 చొప్పున అంటే సుమారు రూ.7,314 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. సన్నరకాలకు సంబంధించి 88.09 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారని, దీనికి సుమారు రూ.4,404 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉంటుందని, దొడ్డు వడ్లకు రూ.2,909 కోట్ల బోనస్ చెల్లించాలని చెప్పారు. ఈ మొత్తం ధాన్యంలో కోత పెడుతూ ప్రభుత్వం 47 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నదని, మొత్తం రూ.7,314 కోట్ల బోనస్ ఇవ్వాల్సి ఉంటే కేవలం రూ.2,350 కోట్లు మాత్రమే బోనస్ చెల్లించేలా కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు.

ఎక్కడ అమ్మినా ఇవ్వాలి..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే బోనస్ ఇస్తామనటం సరికాదని పెద్ది సూచించారు. సన్న రకం బోనస్‌తో కలిపి రూ.2,820కి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిందని, ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు, ఇతర ట్రేడర్లు ఇప్పటికే తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా రూ.2,600 నుంచి రూ.3వేలకు కొంటున్నారని చెప్పారు. బోనస్‌తో కలిపినా రూ.2,820 మాత్రమే అవుతున్నప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే రైతుకు క్వింటాల్‌పై రూ.200 నష్టం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ కేంద్రాల్లో పంట అమ్మలేదనే సాకుతో బోనస్‌ను ఎగ్గొట్టే ప్రయత్నం చేయవద్దని, రైతు ఎక్కడ ధాన్యం అమ్మినా బోనస్ చెల్లించాల్సిందేనని డిమాండ్‌చేశారు. బోనస్ విషయంలో కొర్రీలు పెడుతున్నట్టు సమాచారం ఉన్నదని పాత పద్ధతిలో మద్దతు ధర మాత్రమే రైతులకు చెల్లించి తర్వాత బోనస్ ఖాతాల్లో వేస్తామని చెప్పడం దాటవేత ధోరణికి నిదర్శనమని విమర్శించారు.

ఆర్థిక సంక్షోభం దిశగా తెలంగాణ

- రుణమాఫీ విషయంలో సీఎం బండారం బట్టబయలు
- రేవంత్ విధానాలతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు
- కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, అక్టోబరు 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఆర్థిక సంక్షోభం దిశగా అడుగులు పడుతున్నాయని, ఆర్థిక అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ ఆర్థిక సంక్షోభం తలెత్తుతుందని ధ్వజమెత్తారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో పరిస్థితులు ఇందుకు అద్దంపడుతున్నాయని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో రాకేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 'రాష్ట్రం ఏర్పడిన నాడు తెలంగాణలోని ఉమ్మడి తొమ్మిది జిల్లాలు వెనకబడిన జిల్లాలుగా ఉండేవి. కానీ గడిచిన పది సంవత్సరాల్లో దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి క్రమంగా కుంటుపడుతున్నది. తొమ్మిది నెలల్లో ప్రభుత్వానికి రూ.89 వేల కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా రూ.73 వేల కోట్లు మాత్రమే వచ్చాయి. అందులోనూ అభివృద్ధి పనుల కోసం రూ.8 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. మరోవైపు కాంగ్రెస్ పాలన ఇల్లు పీకి పందిరేసినట్టు ఉన్నది. ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ కుప్పకూలింది. టెక్స్‌టైల్ పరిశ్రమ కుంటుపడింది. గ్రామ పంచాయతీ కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు లేవు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదు. ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. పీఆర్సీ పత్తా లేదు' అని ధ్వజమెత్తారు.

రుణమాఫీపై సీఎం మాటలు అబద్ధం

రుణమాఫీపై ప్రధానికి రాసిన లేఖతో రేవంత్ రెడ్డి బండారం బయటపడిందని, రూ.18 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశామని సీఎం ఒప్పుకున్నారని రాకేశ్‌రెడ్డి తెలిపారు. రేవంత్‌రెడ్డి రావడంతోనే కూల్చుడు మొదలు పెట్టారని, ఆయన విధ్వంసం వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. మూసీ ప్రక్షాళన కాదు.. రేవంత్ రెడ్డి మైండ్ ప్రక్షాళన జరుగాలన్నారు. మూసీ సుందరీకరణతో వచ్చే ఆదాయం ఏంటో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు లాభం జరుగుతుందని, మూసీ సుందరీకరణ ఎవరికి అన్నం పెడుతుందంటూ ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు డీపీఆర్ ఎక్కడ ఉన్నదని, ఈ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌తో రేవంత్ రెడ్డి ముందే కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. హైడ్రాను వెనక్కి తీసుకోవాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.



శిల్పాన్ని చూపిస్తున్న పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

వెల్మజాలలో 'ఎక్కటి శిల్పం'

13వ శతాబ్దం నాటిదిగా గుర్తింపు

గుండాల, అక్టోబర్ 7: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలో 13వ శతాబ్దం నాటి పొడవు జడ కలిగిన వీరుడి శిల్పాన్ని(ఎక్కటి శిల్పం) చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి కనుగొన్నారు. గ్రామంలోని శివుడి బండ మీద ఉన్న రాతి శిల్పంతో కూడిన శిలాశాసనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 13వ శతాబ్దం నాటి వీరులు పొడవైన జుట్టును కలిగి ఉండేవారని, వాటిని పాయలుగా విడదీసి అల్లినట్లుగా ఉండేవని తెలిపారు. అందుకు సంబంధించిన ఆనవాళ్లను శిలపై చెక్కిన శిల్పంలో ఉన్నట్టు చెప్పారు. అటువంటి వీరులు గ్రామ రక్షణ కోసం రణరంగంలో పోరాడేవారని పేర్కొన్నారు. భుజాలకు దండ కడియాలు, నడుముకు కత్తి, కాళ్లకు కడియాలు ధరించి బాణం సంధిస్తున్నట్టు బండరాతిపై వీరుడి చిత్రం చెక్కబడిందని తెలిపారు. ఆ వీరుడి జ్ఞాపకార్థంగా నాటి పాలకులు శిల వేసి ఉంటారని వెల్లడించారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి డిమాండ్



చిట్యాలలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, అక్టోబర్ 7: ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం భేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులకే కాదు మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులపై దాడులు చేస్తే కింది నాయకులు బయటకు రారనే భ్రమలో కేటీఆర్, హరీశ్‌రావుపై దాడులకు పాల్పడుతున్నారని, ఇది ఉద్యమ పార్టీ అని, ఎన్ని దౌర్జన్యాలు ఎదురైతే అంత బలపడుతుందని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అనే హూందాతనాన్ని మరిచి వీధి మనిషిలా చిల్లర భాష ఉపయోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 10 నెలలు దాటినా మాఫీ చేయకుండా రకరకాల కొర్రీలు పెడుతున్నదని దుయ్యబట్టారు. మహిళలకు ఇచ్చిన హామీలను కూడా తుంగలో తొక్కారని, ప్రభుత్వంలోని ఓ మహిళా మంత్రి తోటి మహిళ వ్యక్తిగత జీవితంపై నిందారోపణలు చేస్తే ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. కొండా సురేఖను వెంటనే ప్రభుత్వం నుంచి, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- 15 నుంచి ఆందోళనలు, నిరసనలు
- రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

రవీంద్రభారతి, అక్టోబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగలోపే తాజా మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేకుంటే ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గెలిచిన సర్పంచ్‌లమనే సాకుతో కక్ష గట్టి పెండింగ్ బిల్లులు ఇవ్వడంలేదని ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచ్‌లు వడ్డీలకు డబ్బులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించడంలేదని, దసరా పండుగ తరువాత 15 తేదీన సర్పంచ్‌ల సంఘం ముఖ్యనాయకులతో సమావేశమై ప్రభుత్వంపై ఆందోళనలు, నిరసనలు చేపడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, రాంపాక నాగయ్య, సుభాష్‌గౌడ్, మెడబోయిన గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు ఉద్యమపంథా మార్చుకోవాలి: నారాయణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మారిన పరిస్థితులకు అనుగుణంగా మావోయిస్టులు తమ ఉద్యమ పంథా మార్చుకోవాలని, ఆయుధాలతో కాకుండా ప్రజలతో కలిసి పోరాడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో నారాయణ మాట్లాడుతూ.. దేశంలో హత్యలు, లైంగికదాడులు పెరుగుతున్నాయని, వాటిని నిరోధించడంపై దృష్టిపెట్టాల్సిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. మావోయిస్టుల ఏరివేత కోసం సమావేశాలు పెడుతున్నారని ఆరోపించారు.

ఫార్మాకు వ్యతిరేకంగా రేపు పాదయాత్ర

రైతులకు వంద శాతం రుణమాఫీ చేయాలి • మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్

కోస్గి, అక్టోబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు రైతులకు వంద శాతం రుణమాఫీ చేయాలని, కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇబ్రహీం పట్నం, మహేశ్వరం నియోజకవర్గంలో 14 వేల ఎకరాలను గత ప్రభుత్వం కేటాయించగా.. ల్యాండ్ అక్వ్యూవేషన్ పూర్తి చేసుకున్న తర్వాత అక్కడ కాదని.. దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు సరికాదని చెప్పారు. రేవంత్ సర్కారు తీరును వ్యతిరేకిస్తూ 9న ఉదయం 7 గంటలకు పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో పూజల అనంతరం పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి హకీంపేట్, ఆర్‌బీ తండా, లగచర్ల, దుద్యాల్ వరకు 10 కిలోమీటర్లు యాత్ర కొనసాగుతుందని, అక్కడ ముగింపు కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొంటారని చెప్పారు. రైతులు, యువకులు, ఫార్మా బాధితులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 8.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 124 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

పంచమి

మంగళవారం, సూర్యోదయం: 6-08, సూర్యాస్తమయం: 5-59. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం తిథి: పంచమి ఉదయం 11-18 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం: జ్యేష్ఠ తెల్లవారుజామున 4-09 వరకు. వర్జ్యం: ఉదయం 8-25 నుంచి ఉదయం 10-08 వరకు. రాహుకాలం: పగలు 3-00 నుంచి సాయంత్రం 4-29 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-17 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 10-50 నుంచి రాత్రి 11-39 వరకు. అమృతకాలం: సాయంత్రం 6-42 నుంచి రాత్రి 8-25 వరకు.

మైక్రో ఆర్ఎన్ఏ ఆవిష్కర్తలకు వైద్య నోబెల్





అమెరికన్ శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌కు అవార్డు

› 10

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..



రుణమాఫీ పూర్తయ్యాకే రైతుభరోసా

మరో 20 లక్షల మందికి మాఫీ చేయాలి: తుమ్మల

› 8

అమిత్‌షాతో రేవంత్ ఏకాంత భేటీ

కేంద్రమంత్రి ఇంటికి వెళ్లి కలిసిన ముఖ్యమంత్రి

ఇరువురి మధ్య అరగంటకుపైగా చర్చలు

వివరాలు వెల్లడించని కేంద్ర హోంశాఖ, సీఎం కార్యాలయాలు

› 8

మూసీ మజిలీ కథలు-1

జనం కండ్లు 'మూసీ'..

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది. గడువు పెట్టి మరీ 6 గ్యారెంటీలను ప్రకటించింది. అందులోనూ 13 ఉప హామీలు. వీటిలో ఎక్కడా మూసీ ప్రస్తావన లేదు.

కానీ 6 నెలలు తిరగకముందే, ఒకటీ అరా తప్ప ఏ గ్యారెంటీ అమలు కాకముందే అకస్మాత్తుగా, హఠాత్తుగా మూసీ ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. దీని ఖర్చు అక్షరాలా లక్షన్నర కోట్లు! ప్రపంచంలో ఏ నదీ సుందరీకరణ ప్రాజెక్టుకూ ఒక దేశం ఇంతటిస్థాయిలో ఖర్చు చేయలేదు.

ఆరు గ్యారెంటీల అమలుకు అడుగు ముందుకు పడలేదు. మూసీ కోసం మాత్రం ఆగమేఘాలపై కూల్చివేతలు!

ఆరు గ్యారెంటీలకు సంబంధించి చిన్న సర్వే కూడా జరగట్లేదు.. కానీ యంత్రాంగమంతా మూసీపై మూకుమ్మడి సర్వే!

ఆరు గ్యారెంటీల అమలుపై సర్కార్ సమీక్షిస్తున్న దాఖలాల్లేవు. కానీ మూసీ ప్రాజెక్టుపై ప్రతిరోజూ సమీక్షల సందడే!

వేల కోట్లు అవసరమయ్యే ఆరు గ్యారెంటీల అమలుకు నిధుల్లేవట! కానీ, లక్షన్నర కోట్లు ఖర్చయ్యే మూసీకి ప్రణాళికలు సిద్ధం!

6 గ్యారెంటీల కోసం సర్కారు తీసుకున్న డాటా ఏమైందో తెల్వదు. కానీ, ఇప్పుడు మూసీ తీరంలో కొలువై లెక్కలు తీస్తున్న యంత్రాంగం!

మూసీ సుందరీకరణ ఇప్పుడు తెలంగాణకు అంత అత్యవసరమైన ప్రాజెక్టా? మిగిలిన పనులు, పథకాలు, పరేషాన్లు అన్నీ పక్కనబెట్టి అమలు చేయకపోతే తెలంగాణ కొంప మునిగేంత అర్జెంటు కార్యక్రమమా? రాత్రిగడిస్తే ఏం కొంపమునుగుతుందోనని శుక్రవారం రాత్రే పేదల కొంపలు కూల్చి చేయాల్సినంత గొప్ప పనా ఇది?

కానీ, రేవంత్ ప్రభుత్వం అట్లాగే చేస్తున్నది. 6 గ్యారెంటీల అమలుకు మాదే గ్యారెంటీ అని చెప్పిన రాహుల్, ప్రియాంక వాటి గురించి నోరు మెదపడం లేదు. మూసీపై ఇంత రచ్చ జరుగుతున్నా.. చూసీచూడనట్టు నోరెత్తడంలేదు. ఇక్కడ మూసీ ప్రాజెక్టు గొప్పతనం గురించి నోరారా అరుస్తున్న నేతలు!.. అక్కడ నోరుమూసుకుని చూస్తున్న పెద్దలు!

ఎందుకీ తొందర? ఏమిటీ దీని వెనక మతలబు? అసలేం జరుగుతున్నది?
భారత్‌కు శత్రుదేశాలుగా భావించే చైనా, పాక్‌లతో పరోక్ష లింకులు!
తెలంగాణ అంటేనే సరిపడని చంద్రబాబు సన్నిహితుల నీడలు!
అవినీతిపరుడిగా జైలుపాలైన సింగపూర్ మంత్రి జాడలు!
ఇన్ని ప్రతికూల శక్తులతో కుమ్మక్కై మూసీపై కాంగ్రెస్ సర్కార్ ఆటలు!

బాబు చూపిన బాటలో రేవంత్



పావులు కదుపుతున్నదెవరు? పాచికలు విసురుతున్నదెవరు?

నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనాలు.. నేటి నుంచి..



అప్పుడు నందనవనం.. ఇప్పుడు రివర్ ఫ్రంట్

మూసీపై నాటి బాబు ప్లాన్ మళ్లీ తెరపైకి

సింగపూర్ కంపెనీకే మాస్టర్ ప్లాన్ బాధ్యత

'మెయిన్ హార్ట్'కు అప్పగిస్తూ ఉత్తర్వులు

అమరావతిని ఆగం చేసిన కంపెనీ ఇదే!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇదేం సంవత్సరం? 2024 కదా! కానీ ఎందుకో కాలం 25 ఏండ్లు వెనక్కి తిరిగినట్టు , మనమంతా 1999 – 2001కి వెళ్లిపోయినట్టు అనిపిస్తున్నది. కారణం మూసీ కూల్చివేతల వ్యవహారం. మూసీ ప్రాజెక్టు తన మానసపుత్రిక అని రేవంత్ ఎంతగా చెప్తున్నా, ఇది వైఎస్ ఆలోచన అని కేవీపీ లాజిక్కులు లాగినా, చరిత్ర అందుకు సహకరించడం లేదు. ఎందుకంటే మూసీ తీరంలో ఉన్న పేదలను తొలగించి దాన్ని వాణిజ్య కేంద్రంగా మలచాలన్న అసలు ఆలోచన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది. ఆనాడు చంద్రబాబు ఏంచేశారో ఆయన సహచరుడు లాంటి శిష్యుడు రేవంత్‌రెడ్డి ఇప్పుడు సరిగ్గా అదే చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టుకు నాడు చంద్రబాబు నందనవనం అని పేరు పెట్టారు. ఇప్పుడు రేవంత్ దీనిని ఆధునిక భాషలో రివర్ ఫ్రంట్ అన్నారు. నాడు చంద్రబాబు మూసీ మురికి నీటి ప్రక్షాళన గురించి పట్టించుకోకుండా సుందరీకరణే ముఖ్యమని, పేదల తరలింపే ఫస్ట్ ప్రియారిటీగా తీసుకున్నారు. ఇప్పుడు కూడా సేమ్ టు సేమ్. రేవంత్ కూడా ప్రక్షాళన అని పైకి చెప్తూ.. మూసీని క్లీన్ చేయడానికి బదులు పేదలను క్లీన్ చేసే పనిలో పడ్డారు. మూసీ ఒడ్డు నుంచి తరలించే పేదల కోసమంటూ నాడు బాబు కర్మన్‌ఘాట్ సమీపంలో నందనవనం అనే భారీ గృహ సముదాయాన్ని నిర్మించారు. రేవంత్‌రెడ్డి ఆ మాత్రం కష్టం కూడా పడకుండా కేసీఆర్ నిరుపేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను నింపుతున్నారు. అప్పుడు › 6వ పేజీలో

ఇక గుండె చెరువే!

హెచ్ఎండీఏ పరిధిలోని మొత్తం చెరువుల సర్వే

- 45 సంవత్సరాల డాటా ఆధారంగా నిర్వహణ
- ఆ మేరకే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల నిర్ధారణ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన
- పాత మ్యాపుల ఆధారంగా హద్దులు: రంగనాథ్





హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మీకు హైదరాబాద్‌లో ఇల్లు ఉన్నదా? మీ ఇంటికి సమీపంలో చెరువు లేదా కుంటలు ఉన్నాయా? సమీపంలో కాకున్నా.. కనుచూపు మేరలో చెరువు, కుంట ఉన్నదా? మీరు ఇల్లు కట్టుకొని 20 ఏండ్లు దాటినా.. ఆ నిర్మాణానికి కూడా నోటీసులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ప్రక్షాళన పేరిట కాంగ్రెస్ సర్కారు మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్‌లో చెరువుల రీ సర్వే పేరిట అల్లకల్లోలం చేసేందుకు అడుగులు వేస్తున్నది. ఇప్పటికే హైడ్రా, › 7వ పేజీలో

బాబు మానస పుత్రిక.. రేవంత్ ప్రాజెక్టు

చంద్రబాబు హయాంలోనే తెరపైకి మూసీ సుందరీకరణ పనులు

'నందనవనం' పేరిట పేదల తరలింపు.. అప్పట్లో గాయిగాయి చేసిన కాంగ్రెస్

కేసీఆర్ హయంలో మూసీ ప్రక్షాళన.. పేదల జోలికి వెళ్లకుండా ప్రణాళిక

కానీ ఇప్పుడు ఇండ్లు కూల్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్

బాబు దోస్త్ ఈశ్వరన్ కంపెనీకే మూసీ మాస్టర్ ప్లాన్ బాధ్యతలు

166.48 కోట్లతో మెయిన్ హార్ట్‌కు అప్పగిస్తూ రేవంత్ సర్కారు ఉత్తర్వులు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కాలాలు మారినా పేదల తలరాతలు మారలేదనడానికి 'మూసీ' కంటే మంచి ఉదాహరణ ఉండదేమో. 1999-2001 చంద్రబాబు పాలనా కాలంలో మూసీ పేదల మెడపై వేలాడిన కత్తి.. మళ్లీ ఇప్పుడు ఆయన సహచరుడు రేవంత్ హయాంలో భయపెడుతున్నది. నాడు, నేడు సేమ్ టు సేమ్. అడ్డగోలుగా పేదల తరలింపే లక్ష్యం. నాడు ప్రతిపక్షాలు విజయవంతంగా అడ్డుకోవడంతో ఆగిన కత్తిని దశాబ్దాల తర్వాత మళ్లీ రేవంత్ ఝుళిపిస్తున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు రేవంత్ చెప్తున్నట్టు ఆయన మానస పుత్రిక కాదని, చంద్రబాబు హయాంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టును ఇప్పుడు రేవంత్ తలకెత్తుకున్నారని పలువురు హక్కుల కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. అంతేకాదు! లక్షన్నర కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ఏంచేయాలి? ఎట్లచేయాలి? ఎక్కడెంత ఖర్చు పెట్టాలి? అన్నింటికీ ఒక రూట్‌మ్యాప్‌ను రూపొందించే 'గురు'తర బాధ్యతను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెయిన్ హార్ట్ అనే ఒక కన్సల్టెన్సీ కంపెనీ చేతుల్లో పెట్టింది. ఇంతకీ ఈ కంపెనీ ఎవరిదో తెలుసా? ఏపీ సీం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, అమరావతి గ్రా ఫిక్స్ సూత్రధారి, ప్రస్తుతం జైల్లో ఉన్న సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. 166.48 కోట్లతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్ బాధ్యతలను మెయిన్‌హార్ట్ కన్సార్టియంకు అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ డొమైన్‌లో మాత్రం ఈ ఉత్తర్వులను (జీవో ఆర్టీ నెం.472, 4.10.2024) అందుబాటులో ఉంచలేదు.

'బాబు' హయాంలో 'నందనవనం'

మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వాస్తవంగా కేసీఆర్ హయాంలోనే రూపొందించారు. అప్పుడు తయారుచేసిన ప్రతిపాదనల ప్రకారమే మేం ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కొన్ని రోజుల కిందట ప్రకటించారు. అంటే కేసీఆర్ ప్రభుత్వమే ఈ సుందరీకరణ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందనే అభిప్రాయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లోకి వదిలింది. కానీ చరిత్ర తిరగేస్తే, అసలు మూసీ సుందరీకరణ అనే దానిని తెరపైకి తెచ్చింది సాక్షాత్తూ చంద్రబాబునాయుడు. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి. నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 1999-2001 సమయంలో ఈ ప్రాజెక్టు అమలులో ఉన్నట్టుగా సీనియర్ అధికారులు తెలిపారు. 'నందనవనం' పేరిట మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ నుంచి నాగోల్ వరకు 14 కిలోమీటర్ల మేర మూసీ సుందరీకరణ చేపట్టాలనేది ప్రతిపాదన. ఇందులో భాగంగా శంకర్‌నగర్, మూసానగర్, కమల్‌నగర్ తదితర మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అక్కడి నుంచి తరలించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వారందరికీ ఒకచోట ప్రభుత్వపరంగా వసతి కల్పించేందుకే కర్మన్‌ఘాట్ సమీపంలో 'నందనవనం' అనే భారీ గృహ సముదాయాన్ని నిర్మించింది. ఈ మేరకు చాలా మంది నిరుపేదలను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. చాలామంది వ్యతిరేకించి తాము ఖాళీ చేసేదిలేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. సుందరీకరణలో భాగంగా కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)తో కోట్లాది రూపాయల పనులు చేపట్టారు. కానీ ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకోవడంతో అప్పుడు ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. అప్పటి హైదరాబాద్ కలెక్టర్ కూడా అవినీతి వాస్తవమేనని తేల్చడంతో కుడాకు పనుల అప్పగింతను నిలిపివేస్తున్నట్టు అప్పటి పురపాలకశాఖ మంత్రి ఎంఎన్‌డీ ఫరూఖ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మూసీలో వేల క్యూసెక్కుల వరద వస్తుందనే రికార్డులు ఉండగా... కేవలం పది మీటర్ల సెంట్రల్ ఛానెల్‌ను నిర్మించి అందులోకి వరదను మళ్లిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదించడంపై తాము ఆయన ముందే నవ్వి మౌనంగా వచ్చామని సామాజిక కార్యకర్త ఒకరు తెలిపారు. అందుకు ఆ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు హౌస్ కమిటీకి కూడా డిమాండు చేశాయి. కాంగ్రెస్ తరపున ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీజేపీ తరపున అప్పటి బీజేఎల్పీ నేత, ప్రస్తుత త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మూసీ సుందరీకరణ పనుల్లో అవినీతి, ఇతరత్రా అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలక్రమేణా సుందరీకరణ ప్రాజెక్టు తెరమరుగైంది.

మూసీ వయా అమరావతి!

మూసీ రివర్ డెవపల్‌మెంట్ ప్రాజెక్టుకు మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతను మూడు కన్సల్టెన్సీల కన్సార్షియంకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 4వ తేదీన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిశోర్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ప్రతిపాదన మేరకు మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్‌తో పాటు కుష్మన్ వేక్ ఫీల్డ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఆర్‌ఐవోఎస్ డిజైన్ స్టూడియోస్ ప్రైవేటు లిమిటెడ్ అనే మూడు కన్సల్టెన్సీ కంపెనీల కన్సార్టియంకు బాధ్యత అప్పగించేందుకు పాలనా అనుమతినిస్తూ కన్సార్టియంతో ఒప్పందానికి కూడా ఆమోదం తెలిపింది. ఇందుకుగాను కన్సార్టియంకు రూ.166.48 కోట్లు (రూ.25.40 కోట్ల జీఎస్టీతో కలుపుకొని) చెల్లించనున్నట్టు అందులో పేర్కొన్నారు. ప్రధానమైన మెయిన్‌హార్ట్ కంపెనీలో కీలకమైన భాగస్వామి సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్. తమిళనాడుకు చెందిన ఈయన అమరావతి రాజధాని గ్రాఫిక్ డిజైన్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. అంటే ఏపీ సీఎం చంద్రబాబుకు ఈశ్వరన్ అత్యంత సన్నిహితుడనేది బహిరంగ రహస్యం. అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జి (మెయిన్‌హార్ట్ అనుబంధ సంస్థ)కు అప్పగించింది. ఈ సంస్థలో ప్రధాన పెట్టుబడిదారు, డైరెక్టర్ ఈశ్వరన్. ఈయనకు మెయిన్‌హార్ట్‌లో కూడా ప్రధాన వాటాలున్నాయి.

వైఎస్ హయాంలో సేవ్ మూసీ

ఉమ్మడి ఏపీలో 2004 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ 'సేవ్ మూసీ' పేరిట 2005లో ప్రాజెక్టును చేపట్టింది. ఇదే విషయాన్ని ఇటీవల కేవీపీ కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 908 కోట్లతో పథకాన్ని ప్రారంభించినప్పటికీ అప్పుడు ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్య అంశాల దృష్ట్యా దీనిపై పెద్దగా దృష్టిసారించలేదని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ వల్ల నష్టపోయే ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి సంతృప్తికరంగా నష్టపరిహారం చెల్లించాలంటే భారీ మొత్తం నిధులు అవసరమవుతున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని పేర్కొన్నారు. ముఖ్యంగా తొలుత మూసీ నది ప్రక్షాళన, ఆపై సుందీరకరణ ప్రాజెక్టును రెండో దశలో చేపట్టాలని కూడా కేవీపీ సూచించారు. గతంలోని వైఎస్ సర్కారు కూడా ప్రక్షాళనపైనే నిధులు వెచ్చించింది. అంబర్‌పేట, నాగోల్, అత్తాపూర్ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించింది.

అప్పుడు బాబు.. ఇప్పుడు ఆర్‌బీ-ఎక్స్

మూసీ సుందరీకరణ పేరు 1999లో తెరపైకి రాగా అప్పట్లో మూసీ పరివాహక ప్రాంత ప్రజల కంటి మీద కునుకు లేకుండా పోయిందని నగరానికి చెందిన పలువురు హక్కుల నేతలు గుర్తు చేసుకున్నారు.

కేసీఆర్ హయాంలో విజయవంతంగా ప్రక్షాళన

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఒక రోజు, ఒక ఏడాదిలో మూసీ మురుగుగా మారలేదు. ఆరు దశాబ్దాల కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే మూసీ మురికికూపంలా మారింది. రాత్రికి రాత్రి మూసీ సుందరీకరణ పూర్తవదనే కేసీఆర్ ప్రభుత్వం అంచెలంచెలుగా ప్రణాళిక రూపొందించింది. భారీ ఎత్తున మురుగునీటి శుద్ధి కేంద్రాలను చేపట్టిం ది. తెలంగాణ ఏర్పడే నాటికి నగరంలో రోజుకు 1950 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుంటే అందులో కేవలం 772 మిలియన్ లీటర్లు మాత్రమే శుద్ధి అవుతుంది. మిగిలిన 1178 మిలియన్ లీటర్లు రోజూ మూసీలో కలుస్తుంది. అందుకే కేసీఆర్ ప్రభుత్వం 3866 కోట్లతో 31 శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టింది. గత డిసెంబరు వరకు పనులు శరవేగంగా జరిగాయి. అందులో 6 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. గత 10 నెలలుగా రేవంత్‌ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే వంద శాతం మురుగు శుద్ధి జరుగుతుంది. రేవంత్ ప్రభుత్వం ఇలాంటి కీలక అంశాలపై దృష్టిసారించకుండా రాత్రికి రాత్రి బుల్డోజర్లతో నిరుపేదల ఇండ్ల కూల్చివేతలను భుజాన వేసుకుంది.

మూసీ లెక్కలకే ఢిల్లీకి!

పాలన గాలికొదిలి సీటు కోసం ఢిల్లీ టూర్లు

- ఢిల్లీ పర్యటనలతో రాష్ట్రానికి తెచ్చిందెంత?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు
- ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీ
- హైడ్రా హైరానాతో రియల్ ఎస్టేట్ కుదేలు
- తెలంగాణను ఏంజేద్దామనుకుంటున్నవ్?
- సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టు మూటల లెక్కలు చెప్పేందుకే ముఖ్యమంత్రి హస్తిన పర్యటనలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పేదల గూడు చెదరగొట్టేందుకు ఢిల్లీలోని తన బాస్‌లతో మంతనాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలతో ప్రజలకు ఏం ప్రయోజనం ఒనగూరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం పది నెలల్లోనే 24 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం, రాష్ట్ర ప్రజలకు ఏ మేరకు లబ్ధిచేకూర్చారో? చెప్పాలని నిలదీశారు. రేవంత్‌రెడ్డి అత్యధికసార్లు ఢిల్లీ పర్యటన చేసిన ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దేవాచేశారు.

గులాంగిరీ తప్పదని ముందే చెప్పినం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఢిల్లీకి గులాంగిరీ తప్పదని తాము ఎన్నికలకు ముందే చెప్పామని, ఇప్పుడు అదే జరుగుతున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. ఢిల్లీ బాసులకు ఎప్పుడు గుర్తొస్తే అప్పుడు ముఖ్యమంత్రి జీ హుజూర్ అంటూ హస్తినకు వెళ్తున్నారని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల ముందు తాకట్టు పెట్టడమేనంటూ నిప్పులు చెరిగారు. మొదట్లో సీఎం ఢిల్లీ పర్యటనలపై విమర్శలు రావటంతో ఇప్పుడు తెలివిగా కేంద్ర పెద్దలను కలిసి రాష్ట్రానికి నిధులు తెచ్చేందుకని నమ్మబలుకుతున్నారని మండిపడ్డారు. ఎంత మంది కేంద్రం పెద్దలను కలిసి రాష్ట్రానికి ఎన్నివేల కోట్లు తెచ్చారో చెప్పాలని, రేవంత్ బడే భాయ్ మోదీని ఒప్పించి ఎన్ని వేల కోట్లు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

> మూసీలో కొల్లగొట్టే వేలకోట్ల రూపాయల లెక్క చెప్పేందుకే సీఎం ఢిల్లీ వెళ్లారు. పేదల గూడు కూల్చేందుకు రాహుల్ గాంధీ, అధిష్ఠానంతో రేవంత్ చర్చలు జరుపుతున్నారు.. ప్రజలకు మంచి చేయటం కన్నా ఢిల్లీ బాసులకు జై కొడితే తన సీటుకు ఎలాంటి ఢోకా ఉండదనే చక్కర్లు కొడుతున్నారు. - కేటీఆర్

ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోకస్

రేవంత్‌రెడ్డి తన ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీపై ఫోకస్ చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ బూమ్ తగ్గిపోవటానికి ఫోర్త్‌సిటీ పేరుతో కృత్రిమ బూమ్‌ను సృష్టించడమే కారణమని ఆయన ఎక్స్‌వేదికగా ధ్వజమెత్తారు. హైడ్రా హైరానాతో రెండు నెలల్లోనే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందని, తద్వారా రిజిస్ట్రేషన్లు పడిపోయిన వైనాన్ని ఆయన ఏకరువు పెట్టారు. ఫోర్ బ్రదర్స్ సిటీపైనే ఫోకస్ చేసి, కృతిమ రియల్ బూమ్ కోసం ఆలోచిస్తున్నాడని, సామాన్యుల కొనుగోళ్లు, అమ్మకం లేనిది బూమ్ ఎట్లా వస్తది? ఆదాయం ఎట్లా పెరుగుతది? అని ప్రశ్నించారు. 'ప్రతి పథకానికి డబ్బుల్లేవని తెల్లారి లేస్తే అరిచే రేవంత్‌రెడ్డి తీరు మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె అన్నట్టు ఉన్నది' అని విమర్శించారు.

సీఎం సీటుకు ఢోకా రావద్దనే..


ప్రజల అవసరాలను పక్కనబెట్టి చీటికి మాటికి సీఎం ఢిల్లీకి వెళ్తుండటం చూస్తుంటే ప్రజలకు మంచి చేయటం కన్నా ఢిల్లీ బాసులకు జై కొడితే తన సీటుకు ఢోకా ఉండదని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. పది నెలల పాలనలో తెలంగాణలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని చెప్పారు. ఢిల్లీ హైకమాండ్ కూడా రేవంత్‌రెడ్డి పాలనపై సంతోషంగా లేనందునే పదేపదే పిలుస్తూ ఆయనకు చీవాట్లు పెడుతున్నట్టు ఉందని ఎద్దేవాచేశారు. పది నెలల్లోనే ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్తే ఏడ్లెళ్లలో మరో 125 సార్లు వెళ్తాడు కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ప్రజలు అధికారమిచ్చింది ఢిల్లీకి గులాంగిరీ చేసేందుకు కాదని ప్రజలకు మంచి చేసేందుకనే విషయాన్ని సీఎం గుర్తించాలని హితవుపలికారు.

జనం కండ్లు 'మూసీ'..

> మొదటిపేజీ తరువాయి...

చంద్రబాబు ఇప్పుడు రేవంత్ పేదల్ని బలవంతగా తరలించడం షరా మామూలే! అప్పుడూ అవినీతి ఆరోపణలు గుప్పుమనడమే కాదు ; ఏకంగా రుజువయ్యాయి. ఇప్పుడూ మూసీ భారీ స్కామ్ ముక్కుపుటాలు అదిరేలా కంపు కొడుతున్నది. ఈ పోలికలన్నీ ఇట్లా ఉంటే తాజాగా మరో అద్భుతమైన పోలిక వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే ఐదేండ్ల కింద అమరావతి ప్రాజెక్టును చేపట్టి, గ్రాఫిక్‌లతో రంగుల కలలు చూపించి, సగంలో వదిలేసిపోయిన సింగపూర్‌కు చెందిన 'మెయిన్ హార్ట్' కంపెనీయే ఇప్పుడు మూసీ కథకు అసలు కన్సల్టెంట్. ఈ మేరకు శుక్రవారమే రహస్యంగా జీవో కూడా జారీఅయ్యింది. పార్టీలేవైతేనేం? మనుషులు ఎక్కడుంటేనేం? మనసులు కలిస్తే సరిపోదా! 'బంధాల'వే కుదురుకుంటాయి. మూసీ ప్రాజెక్టు 25 ఏండ్ల తర్వాత కూడా బాబుగారు చూపిన బాటలోనే తెరమీదకు రావడం, ఐదేండ్ల క్రితం ఆయనతో సన్నిహిత సంబంధాలు నెరపిన మెయిన్ హార్ట్ కంపెనీకే ప్రాజెక్టు కన్సల్టెన్సీ బాధ్యత కూడా దక్కడం కాకతాళీయం కాదు కదా?

ఈ కుంట ఎవరి 'హస్త'గతం!



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం గ్రామంలో వడ్డర్‌వాణి కుంట ఉన్నదని ప్రస్తుతం ఈ కుంట పూర్తిగా కబ్జాకు గురైందని భట్టి చూపిన మ్యాప్ ఇది. అయితే 2014 మ్యాప్‌లో కుంటలో ఎక్కడా చుక్క నీరు కనిపించలేదు. అంటే 2014కు ముందే కుంట కబ్జాకు గురైనట్టేనని, అప్పుడు కాంగ్రెస్ పాలనే ఉండేనని నెటిజన్లు అనుకుంటున్నరు.

భట్టి 'సినిమా' అట్టర్ ఫ్లాప్!

- హైడ్రా, మూసీపై మంత్రి భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- లండన్, జపాన్ నదుల వీడియోల ప్రదర్శన
- విలేకరుల ప్రశ్నలకు ఎదురు ప్రశ్నే సమాధానం



హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): హైడ్రా, మూసీ నది వివాదంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సచివాలయంలో సినిమా స్టైల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా నగరంలో ఎన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయి, లండన్, జపాన్ నగరాల్లోని నదులు ఏ విధంగా ఉన్నాయో చూపించారు. అయితే, ఈ సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన ఈ సమావేశం ఎందుకు పెట్టారు. సినిమా ఎందుకు ప్రదర్శించారు. జనాలకు ఏం చెప్పదలుచుకున్నారనే సందేహాలు సమావేశానికి హాజరైన విలేకరులను పీడించాయి. కొద్ది రోజులుగా డిప్యూటీ సీఎం విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా మూసీ, హైడ్రాపై మాట్లాడలేకపోయారు. ఇప్పుడు స్వదేశానికి వచ్చిన ఆయన.. తాను కూడా ఏదో ఒకటి మాట్లాడాలనే ఉద్దేశంతో విలేకరుల సమావేశం నిర్వహించినట్టుగా ఉంది తప్ప, ఎలాంటి కొత్త విషయం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు విలేకరులు సంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానం దాటవేశారు.

ప్రశ్న: మీరు చూపించిన లండన్‌లోని థేమ్స్, జపాన్‌లోని యోడా, సుమిధ నదులకు అనుకునే పెద్ద పెద్ద బిల్డింగ్‌లు ఉన్నాయి. మరి అక్కడ ఇండ్లను కూల్చనప్పుడు ఇక్కడ మూసీ నది కోసం ఎందుకు ఇండ్లను కూల్చుతున్నారు.

మంత్రి: కాలక్రమంలో అలా జరుగుతుంటాయి.

హైడ్రా కూల్చివేతలు ఆగుతాయా? కొనసాగుతాయా?

ఏం చేస్తే బాగుంటుందో మీరే చెప్పండి.

మీరు చూపించిన శాటిలైట్ మ్యాప్‌ల ప్రకారం కబ్జా అయిన చెరువుల్లోని మొత్తం నిర్మాణాలను కూల్చివేస్తారా..?

ఏం చేయాలో మీరే చెప్పండి.

మీరు ప్రదర్శించిన చెరువుల మ్యాప్‌ను అధికారికంగా పరిగణించవచ్చా?

సమాధానం కరువు

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లను కూల్చివేస్తామని హైడ్రా చెప్తున్నది. మీరేమో బఫర్ జోన్ జోలికి వెళ్లడం లేదంటున్నారు. ఏది నిజం.

సమాధానం దాటవేత

పెద్ద పెద్ద వాళ్లు బఫర్ జోన్‌లో ఇండ్లు నిర్మించుకున్నట్టు ఆరోపణలున్న గండిపేట, హిమాయత్‌సాగర్, సకాలం చెరువుల్లోనూ ఆక్రమణలు గుర్తించారా?

అన్ని చెరువుల్లోని ఆక్రమణలను గుర్తించాం.

మీరేమో అసలు అంచనాలే సిద్ధం చేయనప్పుడు మూసీ ప్రాజెక్టుకు రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అని ఎవరు చెప్పారని అంటున్నారు. కానీ, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో ఎవరి మాట నిజం?

ఏదో ఓరల్‌గా చెప్పినవి కుదరవు. ఆధారాలు లేకుండా మాట్లాడొద్దు. ఇంకా మేం అంచనాలనే సిద్ధం చేయలేదు.

మూసీ సుందరీకరణకు టెండర్లు ఖరారు కాలేదని మీరంటున్నారు. కానీ ఎంఏయూడీ కార్యదర్శి టెండర్లు పూర్తయ్యాయని, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని చెప్తున్నారు.

అధికారులు చెప్పింది వేరే అంశం గురించి కావొచ్చు. మూసీ సుందరీకరణను ఎలా చేయాలనే దానిపైనే ఇంకా టెండర్ వేయలేదు. అప్పుడే పనులు ఎలా ప్రారంభిస్తారు.

సీఎంది ఓ మాట.. డిప్యూటీ సీఎందిమరో మాట

హైడ్రా, మూసీపై తలోమాట

ఇద్దరి మధ్య సమన్వయం కరువు?

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ, హైడ్రాపై సీఎం రేవంత్‌రెడ్డిది ఒక మాటైతే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో మాట మాట్లాడుతున్నారు. ఒకే అంశంపై వీరిద్దరు తలో మాట మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మధ్య సమన్వయం కరువైందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం హైడ్రా, మూసీపై మీడియా సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు భిన్నంగా చెప్పడం గమనార్హం.

రేవంత్‌రెడ్డి: జూలై 20న గోపాన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రూ. 1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణను చేపట్టనున్నాం. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీని ప్రక్షాళన చేస్తాం' అని తెలిపారు.

> **భట్టి విక్రమార్క: మూసీ సుందరీకరణకు అసలు డీపీఆర్ సిద్ధం కాకుండా, అంచనాలు వేయకుండా రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. అసలు మూసీ సుందరీకరణ బడ్జెట్ రూ.1.5 లక్షల కోట్లు అని ఎవరు చెప్పారు?**

రేవంత్‌రెడ్డి: హైడ్రా కూల్చివేతలు కొనసాగుతాయి.

> **భట్టి విక్రమార్క: బఫర్ జోన్‌లోని ఇండ్ల జోలికి మేం వెళ్లడం లేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వాటిపై మాత్రమే దృష్టిపెట్టినం.**

రేవంత్‌రెడ్డి: మూసీ నిర్వాసితులను అక్కడి నుంచి తరలించి వేరే చోట డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తాం.

> **భట్టి విక్రమార్క: మూసీ నిర్వాసితులకు అక్కడే సొంతంగా ఇండ్లు కట్టించే ఆలోచన చేస్తున్నాం.**

రేవంత్‌రెడ్డి: మూసీ నిర్వాసితులపై ఇప్పటికే సర్వే చేశాం. వారిని తరలిస్తున్నాం.

> **భట్టి విక్రమార్క: మూసీ నిర్వాసితులకు సంబంధించి ఇంకా సర్వే చేస్తున్నాం. ఇప్పుడే ఎవర్నీ తరలించడం లేదు.**

లేనిది ఉన్నట్టు.. భట్టి కనికట్టు!

- నీళ్లు లేని చోట చెరువులున్నట్టు ప్రజెంటేషన్
- 2014 తర్వాత 20, 1956-2014 మధ్య 225 చెరువులు కబ్జా అయినట్టు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : 'ఆల్ జీబ్రా.. అబ్రక దబ్రా' అన్నట్టు ఉన్నది సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన చెరువుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్! లేని చెరువులను ఉన్నట్టు చూపి.. అవీ కాంగ్రెస్ హయాంలోనే కబ్జాకు గురైనట్టు పరోక్షంగా చూపి అభాసుపాలయ్యారు. బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువులు ఎక్కువ కబ్జా అయ్యాయనే నెపం వేసే క్రమంలో 2014 కంటే ముందు, ఎక్కువ సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతల కబ్జాలనే తాను విడుదల చేసిన రిపోర్టు ద్వారా బహిర్గతం చేశారు. దీంతో సోషల్ మీడియాలో 'కబ్జాల కాంగ్రెస్' అంటూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల కబ్జా గురించి భట్టి మాట్లాడుతూ 2014 తర్వాత 20 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, 1956 నుంచి 2014 వరకూ హైదరాబాద్‌లో 225 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని చెప్పారు. 1956 నుంచి 2014 వరకు ఎక్కువ కాలం అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే కదా? అని విశ్లేషకులు నొక్కిచెప్తున్నారు.

కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే..

భట్టి విడుదల చేసిన రిపోర్ట్ చూస్తుంటే కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ఎక్కువశాతం చెరువులు కబ్జా అయినట్టు స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఆ రెండు పార్టీల పాలనలోనే సుమారు 10 రెట్ల ఆక్రమణలు జరిగినట్టు భట్టి రిపోర్టు ద్వారా తెలుస్తున్నదని అంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆక్రమణకు గురైనట్టు చెప్తున్న చిత్రాల్లో కొన్నింట్లో చెరువుల ఉనికే లేదని అంటున్నారు. చిన్న నీటి కుంటలను కూడా పెద్ద సరస్సులుగా చూపినట్టు స్పష్టంగా అర్థమవుతున్నదని అంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ సెల్ఫ్‌డబ్బా కొట్టుకోవడంలోనే నిమగ్నమైందని, లేని చెరువులను చూపి అవి కబ్జా అయ్యాయని చెప్పే ప్రయత్నం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలోనూ చెరువుల ఆక్రమణలు

- 2014కు ముందు కూడా ఆక్రమణలు
- ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్ పైనే దృష్టి
- 'మూసీ' బడ్జెట్1.5 లక్షల కోట్లు కాదు
- ఇప్పటి వరకు టెండర్లే పిలవలేదు
- డిప్యూటీ సీఎం భట్టి స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): 2014కు ముందు కూడా హైదరాబాద్‌లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ పాలనలో చెరువులు ఆక్రమణకు గురైనట్టుగా ఆయన పరోక్షంగా అంగీకరించారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైడ్రా, మూసీ వివాదంపై స్పందించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ట్రాక్ సెంటర్‌తో కలిసి నగరంలో చెరువులు ఏ విధంగా కబ్జా అయ్యాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్‌లో 920 చెరువులు ఉండగా రాష్ట్ర ఏర్పాటు తర్వాత 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, 196 చెరువులు కొంత వరకు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. మిగిలిన 499 చెరువులు సురక్షితంగా ఉన్నట్టు చెప్పారు. 2014కు ముందు రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. అందుకే కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చెరువులన్నీ కబ్జా అవుతున్నాయని, వీటిని కాపాడుకోకుంటే అందరికీ నష్టమని వివరించారు. ప్రస్తుతానికి తమ ప్రభుత్వం కేవలం చెరువుల ఎఫ్‌టీఎల్‌పైనే దృష్టి పెట్టిందని, ఇంకా బఫర్ జోన్ జోలికి పోవడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ బఫర్ జోన్ జోలికి వెళితే ఇంకా ఎక్కువ కూల్చివేతలు ఉంటాయనే సంకేతాలు ఇచ్చారు. మూసీ సుందరీకరణకు రూ. 1.5 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అంత బడ్జెట్ అని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు మూసీ సుందరీకరణకు టెండర్లే పిలవలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మూసీ బాధితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయబోమని, వారికి అక్కడే ఇండ్లు కట్టించే ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. తమది ప్రజల ప్రభుత్వమని, కూల్చివేతలు ఎవరికీ ఇష్టం ఉండవని అన్నారు. మూసీ ప్రాజెక్టు సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఎజెండా కాదని భట్టి స్పష్టం చేశారు.

మూసీ పరీవాహక ఎమ్మెల్యేలతో దక్షిణ కొరియాకు మంత్రులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబరు 7 (నమస్తే తెలంగాణ) : మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లతో కూడిన నగర ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, అధికారుల బృందం దక్షిణ కొరియాకు వెళ్లనున్నది. మూసీ పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, ఇతర అధికారులతో మంత్రులు దక్షిణ కొరియాలోని చియోంగేచియోన్ స్ట్రీమ్ పునరుద్ధరణ ప్రాజెక్టును సందర్శించనున్నారు. దక్షిణ కొరియాలోని సియోల్ మధ్యలో 5.84 కిలోమీటర్ల మేర చియోంగేచియోన్ స్ట్రీమ్ ప్రాజెక్టును తీర్చిదిద్దారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు 15 మందితో కూడిన బృందం ఈ నెల 21 నుంచి 26 వరకు దక్షిణ కొరియాలో పర్యటించనున్నది.

కూల్చివేతలు తక్షణం ఆపాలి

సీఎంకు దాసోజు శ్రవణ్ లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులందరికీ సోమవారం ఆయన లేఖ రాశారు. సరైన పరిహారం, కనీస సంప్రదింపులు లేకుండా బలవంతంగా ఖాళీ చేయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. కూల్చివేతలు సీఎం రేవంత్‌రెడ్డి నియంత్రత్వానికి పరాకాష్టగా అని అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌ను అనుసరించి బుల్డోజర్‌రాజ్‌ను తెలంగాణలోకి తెచ్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. కూల్చివేతలను ఆపాలని, జీవో 477ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరిగింది. ఉత్సవాల సందర్భంగా భక్తులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. ఆదివారం స్వామివారిని 86,859 మంది దర్శించుకోగా 37,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న వివిధ



కానుకల ద్వారా హుండీకి రూ.3.63 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

తిరుమలలో నేడు శ్రీవారి గరుడ సేవ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): టీటీడీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ సేవ నిర్వహించనున్నారు. మలయప్పస్వామి.. గరుడవాహనంపై సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11 గంటల వరకు విహరిస్తారు. ఈ సేవ కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. భక్తులరద్దీ దృష్ట్యా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు భక్తులకు అన్నప్రసాద సౌకర్యం కల్పించనున్నారు. భక్తుల కోసం 400కు పైగా బస్సులు ఏర్పాటుచేశారు. గరుడ సేవకు దాదాపు 3.50 లక్షల మంది భక్తులు రానున్నట్టు ఈవో అంచనా వేశారు.

హైదరాబాద్ నుంచే 'విశాఖ హనీట్రాప్'

- గ్యాంగ్ సభ్యులుగా సుమారు 15 మంది?
- 3 బ్యాంక్ అకౌంట్లు హైదరాబాద్ నుంచే నిర్వహణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : అందమే వాళ్ల పెట్టుబడి. డబ్బున్న మగాళ్లే వారి టార్గెట్. హస్కీ వాయిస్‌తో మాటాల్లోకి దించుతారు. పరిచయాలు, చాటింగ్స్, డేటింగ్స్, వీడియోకాల్స్‌తో మెల్లగా రంగంలోకి దించుతారు. ప్రేమ, పెళ్లి అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత అందినకాడికి దోచేస్తారు. విశాఖలో వెలుగుచూసిన 'హనీట్రాప్' అలాగే జరిగింది. ఈ ట్రాప్‌లో కీలక సూత్రధారి అయిన జమీమా అండ్ కో.. మొదట ఓనమాలు దిద్దింది హైదరాబాద్‌లోనే. ఇక్కడ పదుల సంఖ్యలో డబ్బున్న వారిని వంచించిన తర్వాతే వైజాగ్‌కు షిఫ్ట్ అయినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో మోసపోయిన వారిలో ఎక్కువగా ధనవంతులు, పెండ్లయినవారే ఉండటంతో ఏ ఒక్కరూ ఫిర్యాదులు చేయలేదని సమాచారం. దీనిని వెలుగులోకి తెచ్చిన విశాఖపట్నం సీపీ బాగ్చీ సైతం హైదరాబాద్ బాధితులు తమకు వివరాలు చెప్పాలని కోరారు.

మూడు బ్యాంక్ అకౌంట్లు..

విదేశాల్లో స్థిరపడ్డ, బాగా సంపాదించిన మగవాళ్లను లక్ష్యంగా చేసుకొని మోసాలు చేస్తున్న ఈ గ్యాంగ్‌లో మొత్తం 15 మంది వరకు సభ్యులు ఉన్నట్టు సమాచారం. వీరు నిర్వహిస్తున్న బ్యాంకు అకౌంట్లు హైదరాబాద్‌లో ఓపెన్ చేసినవే కావడటంతో ఇక్కడ కూడా వారి మూలాల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎన్నారైలకు అందమైన ఫొటోలు షేర్ చేసి ఆకర్షించడం, ప్రేమపెళ్లి పేరుతో లైన్‌లో పెట్టడం వీరి దినచర్య. ఎవరైతే వీరి వీడియోలకు లైక్‌లు, కామెంట్లు చేస్తారో వారి అకౌంట్లు, హోదా, అంతస్తు తదితర విషయాలను గమనించి వారిని లైన్‌లో పెడుతారు. రొమాంటిక్ వీడియోకాల్స్ చేసి స్వీట్‌గా మాట్లాడుతూ.. ఆ తర్వాత మెల్లిగా పెండ్లి ప్రపోజల్ తీసుకొస్తారు. 'అమ్మానాన్నలతో మాట్లాడిన తర్వాతే ఏదైనా'.. అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత ఓ ఇంటి అడ్రస్ ఇస్తారు. అప్పటికే ఓ సినిమా స్టైల్‌లో నకిలీ పేరెంట్స్‌ను రంగంలోకి దించుతారు. అంతా ఓకే అనుకున్న తర్వాత.. వాళ్లే ఓ ప్లేస్ చెప్పి అక్కడికి రమ్మంటారు. రొమాన్స్ పేరుతో మత్తుమందు కలిపిన మందు తాపించి, డ్యాన్స్‌లు చేయించి సోయితప్పేలా చేస్తారు. ఆ తర్వాత వారిని నగ్నంగా మార్చి ఫొటోలు, వీడియోలు తీసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. అడిగినంత ఇవ్వకపోతే ఫొటోలు సోషల్‌మీడియాలో పెడతామని బెదిరిస్తారు.

వడ్డీ లేని రుణాల నిధులేవి?

- 7 నెలలుగా విడుదల చేయని సర్కార్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు వడ్డీ లేని రుణాల పథకం ఆరంభ శూరత్వంగా వెక్కిరిస్తున్నది. మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలకు అయ్యే వడ్డీని తామే చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మొదటి మూడు నెలల వడ్డీని చెల్లించింది. కానీ, ఏడు నెలలుగా వడ్డీ డబ్బులు నయాపైసా కూడా చెల్లించలేదని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.100 కోట్లు బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఏడు నెలలుగా రూ.700 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వం పెండింగ్ నిధులు విడుదల చేయాలని మహిళా సభ్యులు కోరుతున్నారు.

ఏడేండ్ల ప్రణాళికలు సిద్ధం చేయండి: భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రాబోయే ఏడేండ్లు విద్యుత్తు సరఫరా చేసేందుకు కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం టీజీ ట్రాన్స్‌కో సంస్థ బలోపేతంపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే రోజుల్లో 27వేల మెగావాట్ల డిమాండ్‌ను అధిగమించేందుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్, డిప్యూటీ సీఎం కృష్ణభాస్కర్, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గురుకుల సమస్యలను పరిష్కరించండి

- భట్టికి గురుకుల జేఏసీ వినతి

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలని గురుకుల సంఘాల జేఏసీ నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకులాలకు శాశ్వత భవనాలను ఏర్పాటుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ప్రస్తుతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న నేపథ్యంలో గురుకుల పనివేళలను తక్షణం మార్చాలని కోరారు. జేఏసీ నేతలు నర్సింహులు గౌడ్, గణేశ్, భిక్షం యాదవ్, వేదాంత చారి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాతో రేవంత్ ఏకాంత భేటీ

- కేంద్రమంత్రి ఇంటికి వెళ్లి కలిసిన సీఎం
- ఇరువురి మధ్య అరగంటకుపైగా సమావేశం
- వివరాలు వెల్లడించని కేంద్రహోంశాఖ, సీఎం కార్యాలయాలు



హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్ర నాయకుడు అమిత్‌షాను ఆయన నివాసంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సోమవారం కలుసుకున్నారు. వీరిద్దరూ సుమారు అరగంట పాటు ఏకాంతంగా భేటీ అయినట్టు తెలిసింది. కేంద్ర హోంశాఖ ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. సమావేశం ముగిసిన వెంటనే మూడున్నర గంటలకు కృష్ణమీనన్ మార్గ్‌లోని అమిత్‌షా ఇంటికి వెళ్లారు. రేవంత్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీ, ఢిల్లీలో రాష్ట్ర ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి కూడా అమిత్‌షా నివాసానికి వెళ్లారు.అయితే, వీరిద్దరు ఆ భేటీలో లేరు. అమిత్‌షా, రేవంత్‌రెడ్డిల మధ్య సుదీర్ఘంగా అనేక అంశాలపై చర్చ జరిగినట్టు ఢిల్లీలోని మీడియా వర్గాలు చెప్తున్నాయి. ఈ భేటీపై అటు అమిత్‌షా కార్యాలయంకానీ, ఇటు సీఎం కార్యాలయం కానీ ఎటువంటి స్పష్టతనివ్వలేదు. ఏకాంతంగా ఎందుకు భేటీ అయ్యారన్న ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదు. రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన ఏదైనా అంశాన్ని కేంద్ర మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లాలనుకుంటే విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన సమావేశంలోనే ఆయనతో మాట్లాడే అవకాశం ఉన్నది. కొన్ని రాష్ట్రాల హోంశాఖ మంత్రులు, అమిత్‌షాను కలిసి తమ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలను చర్చించారు. అధికారులు కూడా అక్కడే అందుబాటులో ఉండడంతో అమిత్‌షా అడిగిన ప్రశ్నలకు కూడా సులువుగా సమాధానం ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి హోంమంత్రి అమిత్‌షాను వెళ్లి కలువడం కాంగ్రెస్ పార్టీలో కూడా చర్చనీయాంశమైంది. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా అమిత్‌షాను కలిశారు. రేవంత్‌రెడ్డి కలువడానికి కొద్దిసేపు ముందే వీరి భేటీ జరగడం గమనార్హం. అయితే, తాను అమిత్‌షాను మర్యాదపూర్వకంగా కలిశానని, ఏలాంటి రాజకీయపరమైన చర్చ జరగలేదని విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు.

మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల భేటీ

మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల అధికారులు, మంత్రులతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజ్ఞాన్‌భవన్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నిత్యానంద రాయ్, జువల్ ఓరం, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, ఒడిశా సీఎం చరణ్‌మాంఝీ, ఏపీ హోంశాఖ మంత్రి అనిత, బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన అధికారులు, మంత్రులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ఎస్ఐబీ డీఐజీ బడుగుల సుమతి తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని, రాష్ట్రాలు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా అమిత్‌షా చెప్పారు. 2026 నాటికి దేశంలో మావోయిస్టులను రూపుమాపాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. నిఘా వ్యవస్థను పటిష్ఠపరచుకోవాలని, రాష్ట్రాలకు ఈమేరకు అవసరమైన సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

ఆయిల్‌పామ్, డ్రిప్‌కు 227.66 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ) : ఆయిల్‌పామ్ సబ్సిడీకి రూ.176 కోట్లు, డ్రిప్ పథకానికి రూ.51.66 కోట్లు కలిపి మొత్తం 227.66 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు ఎప్పుడు విడుదల చేస్తారనేదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.



ఉత్పాదక వ్యయంలో ఇంత తేడానా?

- బొగ్గు బావుల దగ్గరే ఆగిపోతే సంస్థ నిర్వీర్యం
- ప్రత్యామ్నాయ రంగాలలోకి ప్రవేశించాలి
- ఉత్పాదక వ్యయాన్ని తగ్గించాలి: మంత్రి భట్టి
- సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ చెక్కుల పంపిణీ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సింగరేణి బొగ్గు ఉత్పాదక వ్యయంలో వ్యత్యాసం పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసంతృప్తి వ్యక్తంచేశారు. పర్మినెంట్ కార్మికులు ఓపెన్‌కాస్ట్‌లో ఉత్పత్తిచేసే బొగ్గు టన్నుకు రూ.3,500, అండర్‌గ్రౌండ్‌లో ఉత్పత్తిచేసే బొగ్గుకు రూ.9,000 అవుతున్నది. అదే ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఓపెన్‌కాస్ట్‌లో చేసే ఉత్పత్తికి టన్నుకు రూ.1,500 మాత్రమే అవుతున్నది. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ఇంత వ్యత్యాసమా? అని ప్రశ్నించారు. ఈ వ్యత్యాసాన్ని సవరించి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించినప్పుడే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సింగరేణి కార్మికులకు సోమవారం లాభాల బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ దసరా సందర్భంగా ఈ నెల 11న ప్రతి గని ముందు సంస్థ నిధులతో ప్రత్యేక విందు ఏర్పాటు చేయాలని, ఆ సమయంలో ఉత్పాదకతపై కార్మికులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్యసేవల పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. సింగరేణి ప్రాంతంలోని ఖాళీ స్థలాలు భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీకి ఆవాసాలుగా మారనున్నాయని, అవి సింగరేణికి ఆదాయాన్ని సమకూర్చే ఆస్తులని ఆయన అభివర్ణించారు. ప్రపంచం యావత్తు కార్బన్ ఫ్రీ వరల్డ్‌గా బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ, థర్మల్‌ప్లాంట్లను మూసివేస్తూ ముందుకెళుతున్నదని అన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు బావుల దగ్గరే ఆగిపోతే సంస్థ నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. సింగరేణిని నిలబెట్టాలని గ్రీన్‌పవర్, లిథియం బ్యాటరీ రంగంలోను ప్రవేశించనున్నామని చెప్పారు.

1800 ఉద్యోగాల భర్తీ: శ్రీధర్‌బాబు

తమ ప్రభుత్వం చెన్నూరు, రామగుండంలో నైపుణ్యకేంద్రాలను ఏర్పాటు చేసిందని, 1800లకు పైగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. సింగరేణిలో విద్య, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌ను ప్రభుత్వం అన్ని రకాలుగా విస్మరించిందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఫైర్ అయ్యారు. 'మేం బంద్‌పెడితే సింగరేణియే బంద్ అయితది.. గుర్తుంచుకోండి' అంటూ హెచ్చరించారు.

మక్కాన్‌సింగ్ కినుక..

చెక్కుల పంపిణీ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ కినుక వహించారు. మొత్తంగా 25 మందిని చెక్కుల పంపిణీ కోసం ఎంపికచేయగా, తొలుత అత్యధిక మస్టర్లు గల కార్మికులను వేదికపైకి పిలిచారు. అయితే భట్టి విక్రమార్క, మంత్రులు ఎమ్మెల్యేలు ఒకరిద్దరికి చెక్కులిచ్చి వెళ్లిపోయారు. దీంతో రామగుండం రీజియన్ కార్మికులకు ఆలస్యంగా చెక్కులివ్వడంతో తాను ఉన్నప్పుడు వారిని పిలవాల్సిందని అంటూ మక్కాన్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.

సమస్యల ఏకరువు..

కార్మికులకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, గడ్డం వినోద్, గడ్డం వివేక్, డాక్టర్ మట్టా రాగమయి, గండ్ర సత్యనారాయణరావు, కోరం కనకయ్యలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు ఇండ్ల స్థలాలు, సొంతింటి పథకాన్ని రూపొందించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను రిటైర్డ్ కార్మికలకు నామమాత్రపు రుసుముకు కేటాయించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు ఆసరా పెన్షన్ల కంటే తక్కువగా వస్తోందని, పెన్షన్ మొత్తాన్ని పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచేందుకు జీవో -22ను అమలుచేయాలని, సింగరేణి ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు నిర్మించాలని, రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఆసరా పెన్షన్లు వర్తింజేయాలని ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.

స్థానికతపై చట్టసవరణ తప్పనిసరి

- ఆ తరువాతే జీవో 317 ఉద్యోగుల బదిలీలు..
- క్యాబినెట్ సబ్ కమిటీకి న్యాయనిపుణుల నివేదన

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): 317జీవో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో స్థానికతకు అవరోధంగా ఉన్న చట్టపరమైన క్లాజ్‌లను సవరించాల్సి ఉందని అడ్వకేట్ జనరల్, న్యాయవిభాగం అధికారులు వెల్లడించారు. 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించారు. మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సచివాలయంలో సోమవారం భేటీ జరిగింది. కమిటీ సభ్యులు, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, న్యాయనిపుణులు సుదీర్ఘంగా చర్చించారు. అయితే, ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో స్థానికత అంశానికి అవరోధంగా ఉన్న చట్టపరమైన క్లాజ్‌లను సవరించడానికి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అడ్వకేట్ జనరల్, లా డిపార్ట్‌మెంట్ అధికారులు క్యాబినెట్ సబ్ కమిటీకి నివేదించారు. అనంతరం న్యాయ వివాదాలు లేకుండా 317జీవోలో ఉద్యోగుల కేటాయింపు జరగాలని క్యాబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. సమావేశంలో రాష్ట్ర జీఏడీ ముఖ్య కార్యదర్శి మహేశ్‌కుమార్, విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి, పీఆర్సీ చైర్మన్ శివశంకర్, న్యాయశాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాఫీపై చెప్పిందేమిటి.. చేసిందేమిటి?

- సీఎం రేవంత్‌రెడ్డివన్నీ అబద్ధాలే
- మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు మేలు కోసమే ప్రధానికి సీఎం లేఖ
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి





హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తున్నవన్నీ అబద్ధాలేనని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మేలు చేసేందుకే ప్రధాని మోదీకి సీఎం లేఖ రాశారని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖను తాము ఖండిస్తున్నట్టు చెప్పారు. 'రుణమాఫీపై కాంగ్రెస్ చెప్పిందేమిటి?, చేసిందేమిటి? వాస్తవాలపై బహిరంగ చర్చకు రావాలి' అని సవాల్ విసిరారు. లేఖలోని అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, తేదీ, వేదిక ఖరారు చేయాలని రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. రుణమాఫీ చేయలేదని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు మహారాష్ట్రలో తమ విజయావకాశాలను దెబ్బ తీస్తాయని కాంగ్రెస్ అధిష్ఠానం గ్రహించి ఆదేశిస్తేనే ప్రధానికి ఆగమేఘాల మీద రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ఆరోపించారు.

కాంగ్రెస్‌వన్నీ పచ్చి మోసాలు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆ పార్టీ అంటేనే పచ్చిమోసమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అంకెల గారడీలతో ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తున్నదని, రుణమాఫీ అంశమే అందుకు నిదర్శనమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసలు తెలంగాణలో పంటరుణాలు తీసుకున్న రైతులెందరు? రూ.2లక్షల్లోపు రుణాలున్నవారెందరు? మాఫీ అయిన వారెందరు? లెక్కలన్నీ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చెప్పినదాంట్లో మూడోవంతు కూడా మాఫీ జరగలేదని తెలిపారు.

రుణమాఫీ పూర్తయ్యాకే రైతుభరోసా

- మరో 20 లక్షల మందికి మాఫీ చేయాలి: తుమ్మల



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 'ఆగస్టు 15 నుంచి ఇప్పటి వరకు 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశాం. మరో 20 లక్షల మందికి మాఫీ చేస్తాం.. ఆ తర్వాతే రైతుభరోసా ఇస్తాం' అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టంచేశారు. సోమవారం గాంధీభవన్‌లో కార్యకర్తలతో ముఖాముఖి అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై రైతుల్లో ఎలాంటి వ్యతిరేకత కనిపించడంలేదని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణలో రూ.18 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన విషయం ప్రధానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

సగం మందికే మాఫీ

రుణమాఫీ విషయంలో సీఎం, వ్యవసాయ మంత్రి పరస్పర విరుద్ధంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్ ప్రధానికి రాసిన లేఖలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేశామని ప్రస్తావించారు. ఆ మరునాడే మంత్రి తుమ్మల 22 లక్షల మందికి రుణమాఫీ చేశామని, మరో 20 లక్షల మందికి వర్తింపజేస్తామని చెప్పడం గమన్హారం. అంటే సగం మంది రైతులకే రుణమాఫీ చేశామని మంత్రి పరోక్షంగా అంగీకరించినట్టయ్యింది. కాగా, 50% రైతులకే రుణాలు మాఫీ అయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పిన మాటలకు మంత్రి వ్యాఖ్యలు బలం చేకూరుస్తున్నాయి.



కాంగ్రెస్ నేతలపై ఎంఐఎం దాడి

- కర్రలు, రాళ్లతో ఎంఐఎం వర్గీయుల దాడి
- రోడ్డు పరిశీలనకు వెళ్లిన కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్
- ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, అనుచరుల దాడి
- పోలీసుల సాక్షిగా దౌర్జన్యం



కాంగ్రెస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్

మెహిదీపట్నం అక్టోబర్ 7: ఎంఐఎం ఎమ్మెల్యే తన అనుచరులతో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులను చితకబాదారు. పోలీసులు వారిస్తున్నా ఎంఐఎం వర్గీయులు కర్రలు, రాళ్లతో కాంగ్రెస్ నాయకులపై దాడి చేసి తరిమికొట్టారు. అరగంటకుపైగా ఇరువర్గాల మధ్య రణరంగం చోటుచేసుకున్నది. కాంగ్రెస్ కార్యకర్తలు సైతం ఓ సందర్భంలో ఎంఐఎం కార్యకర్తలపై ప్రతిదాడికి దిగారు. నాంపల్లి నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్ నియోజకవర్గంలోని విజయ్‌నగర్‌కాలనీ డివిజన్ ఫిరోజ్‌గాంధీనగర్‌లో సీసీ రోడ్డు పనులను సోమవారం తన అనుచరులతో వెళ్లి పరిశీలించారు. అనంతరం తిరిగి వెళ్తుండగా, అభివృద్ధి పనుల కోసం ఎంఐఎం నేతలు ప్రజల నుంచి డబ్బు అడుతున్నారంటూ ఓ మహిళ గట్టిగా అరిచింది. ఇది విన్న స్థానిక ఎంఐఎం ఏరియా అధ్యక్షుడు ఆ మహిళతో గొడవకు దిగడంతోపాటు తన పార్టీ ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆ విషయాన్ని పట్టించుకోకుండానే ఫిరోజ్‌ఖాన్ వెళ్లిపోయారు.

ఎంఐఎం ఎమ్మెల్యే రాకతో ఉద్రిక్తత

ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ భారీ బలగాన్ని వెంటేసుకొని ఫిరోజ్‌గాంధీనగర్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఫిరోజ్‌ఖాన్ మళ్లీ తన అనుచరులతో చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఇరువర్గాలు రెచ్చిపోయాయి. కాంగ్రెస్ నాయకులపై ఎంఐ ఎం నాయకులు దాడికి దిగారు. గట్టిగా కేకలు వేస్తూ ఏకంగా ఎమ్మెల్యేనే కాంగ్రెస్ నేతలపై దాడిచేశాడు. కాంగ్రెస్ నాయకులపై రాళ్లు విసురుతూ చేతులో కర్ర లు పట్టుకొని, పోలీసుల నుంచి కర్రలు లాక్కొని కాంగ్రెస్ కార్యకర్తలను తరిమికొట్టారు. ఇరువర్గాలు బూతులు తిట్టుకుంటూ దాడులు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. కొందరికి స్వల్పగాయాలయ్యాయి. తొలుత అదుపు చేసేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను సముదాయించారు. పోలీసుల సాక్షిగా ఎంఐ ఎం ఎమ్మెల్యే, ఆయన అనుచరులు కలిసి కాంగ్రెస్ నేతలను కొట్టిన వీడియోలు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అతికష్టమీద పరిస్థితిని అదుపులోకి తెచ్చి ఎక్కడి వారిని అక్కడికి పంపించి వేశారు. ఇరువర్గాల నుంచి హుమాయిన్‌నగర్ ఠాణాలో ఫిర్యాదులు అందాయని, ఘర్షణకు కారుకులైన వారందరిపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.





ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ

మేడ్చల్, అక్టోబరు 7: లంచం తీసుకుంటున్న ఏఎస్ఐని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉండే శర్మ మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామ పరిధిలోని సాకేత్ ప్రణామ్‌లో ఇల్లు నిర్మించారు. ఇంటీరియర్ పనుల కోసం సరూర్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్‌తో రూ.8 లక్షల చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. విశ్వనాథ్‌కు రూ.4 లక్షలను ముందుగా చెల్లించారు. కొన్ని రోజులు పనిచేసిన తర్వాత మరికొంత డబ్బు కావాలని విశ్వనాథ్ కోరాడు. ఇందుకు శర్మ నిరాకరించారు. దీంతో పని ఆగిపోయింది. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగడంతో శర్మ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. ఈ కేసులో జోక్యం చేసుకున్న ఏఎస్ఐ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మెయిన్‌హార్ట్‌కే మూసీ సుందరీకరణ!

- సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలు
- ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించిన పాకిస్థాన్ ప్రభుత్వం
- దానికే 4 రోజుల కిందట రూ.166 కోట్ల టెండర్ ఖరారు
- కంపెనీ బాగోతాన్ని ముందే బయటపెట్టిన బీఆర్ఎస్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలను రోడ్డు మీద పడేసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న 'మూసీ సుందరీకరణ' ప్రాజెక్టు బాధ్యతను అంతర్జాతీయంగా మోసపూరిత కంపెనీగా పేరొందిన 'మెయిన్‌హార్ట్'కు కట్టబెట్టింది. పాకిస్థాన్‌లో వందల కోట్ల మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ కంపెనీకి మూసీ సుందరీకరణ మాస్టర్‌ప్లాన్ తయారీ టెండర్ అప్పగించింది. మూసీ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు సంబంధించి రూ.166 కోట్ల పనులు కేటాయించింది. ఇకపై మూసీ ప్రాజెక్టు భవిష్యత్తు మొత్తం ఈ కంపెనీ చేతుల్లోనే ఉండనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు మూసీ సుందరీకరణను లక్షన్నర కోట్ల బడ్జెట్‌తో తీస్తున్న సినిమా మాదిరిగా తెరపై రంగుల కలను చూపిస్తున్నది. దాని చాటున వేల కుటుంబాలను బలి తీసుకుంటున్నది. ఇప్పుడు దొంగకు మరో దొంగ తోడైనట్టు.. పాకిస్థాన్ ప్రభుత్వం ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించిన వ్యక్తుల కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం జతకట్టింది. లక్షన్నర కోట్ల ప్రాజెక్టును వాళ్ల చేతుల్లో పెట్టింది. మాస్టర్‌ప్లాన్ తయారీకి కన్సల్టెన్సీ బాధ్యతలను మెయిన్‌హార్ట్ కంపెనీకి అప్పగిస్తూ పురపాలక శాఖ ఆధ్వర్యంలోని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఈ నెల 4న నిర్ణయం తీసుకుంది. టెండర్ ఖరారు చేసి నాలుగు రోజులు గడిచినా ఈ జీవో బయటకు విడుదల చేయకుండా గుట్టుగా ఉంచడం విశేషం. జీవో వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు.

టెండర్లు పిలిచిన మరుసటి రోజే భేటీ..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కన్సల్టెంట్ నియామకానికి ఈ ఏడాది ఫిబ్రవరి 5న పురపాలక శాఖ టెండర్లు పిలిచింది. ఆ మరుసటి రోజే మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితో సచివాలయంలో భేటీ అయ్యారు. ప్రాజెక్టు డిజైన్లను వివరించారు. అదేరోజు కంపెనీ బాగోతాన్ని బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ బయటపెట్టారు. ఆర్థిక నేరాలకు పాల్పడ్డ కంపెనీతో ఎలా చర్చలు జరుపుతారని, లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' సైతం బయట పెట్టింది. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిని బట్టి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును మెయిన్‌హార్ట్‌కే అప్పగించాలని ముందుగానే నిర్ణయించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ నిబంధనలు కూడా కంపెనీకి అనుకూలంగా రూపొందించారని అంటున్నారు.

రూ.166.48 కోట్లకు టెండర్ ఖరారు

'మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్'కు మాస్టర్‌ప్లాన్ రూపొందించే బాధ్యతను మూడు కన్సల్టెన్సీల కన్సార్షియంకు అప్పగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు కుష్మన్ వేక్‌ఫీల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆర్ఐఓఎస్ డిజైన్స్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వాములుగా ఉన్నాయి. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

కాంగ్రెస్ తీరుపై విమర్శలు వెల్లువ..

అంతర్జాతీయంగా అభియోగాలున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు అని చెప్పుకుంటూ ఇలాంటి కంపెనీకి కట్టబెట్టడం ద్వారా ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని ప్రశ్నిస్తున్నారు. కాస్త ఇంటర్నెట్ పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా.. కంపెనీ బాగోతం తెలిసిపోతుందని అంటున్నారు. నెటిజన్లు, రాజకీయ నాయకులు, మీడియా ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకులాల్లో ఇంటర్ వరకూ ప్రవేశాలు

- ఎంసెట్, నీట్ కోచింగ్‌కు చర్యలు
- త్వరలోనే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్: మంత్రి పొన్నం
- బీసీ సంక్షేమ, సొసైటీ అధికారులతో సమావేశం

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ స్కూళ్ల తరహాలో బీసీ గురుకులాల్లో కూడా పదోతరగతి తరువాత నేరుగా ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తామని, విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బీసీ గురుకులాల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా సమాలోచనలు చేస్తున్నామని వివరించారు. బీసీ సంక్షేమశాఖలోని అన్నివిభాగాల ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి సమావేశాన్ని బంజారాహిల్స్‌లోని కొమురంభీమ్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ గురుకులంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా, ఎంసెట్, నీట్ కోచింగ్ ఇచ్చేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. హాస్టల్ వార్డెన్ల ప్రమోషన్లపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. గురుకులాల కోసం ఎమ్మెల్యే, ఎంపీ ఆ జిల్లా మంత్రి, ఎమ్మెల్సీలు వారి నిధుల నుంచి కేటాయించేలా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఈనెల 15-31లోపు ప్రతి గురుకులంలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, వారి సలహాలు, సూచనలు తీసుకొని ఫీడ్ బ్యాక్ అందించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి గురుకులలో బాక్స్ ఏర్పాటు చేసి ఆర్సీవోలు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జేడీ సంధ్య, నాయీబ్రాహ్మణ ఎండీ ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీబీసీడీవోలు, ఏడీబీసీడీవోలు, ఆర్సీవోలు, డీసీవోలు, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1502 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్7(నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ బీసీ విద్యార్థులకు అమలు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, వివిధ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1502.83కోట్ల నిధులను విడుదల చేసింది. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ స్కాలర్‌షిప్‌ల కోసం ప్రభుత్వం మొత్తంగా రూ.1890.34కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. ఇప్పటికే 387.51కోట్లను విడుదల చేయగా, మిగిలిన రూ.1502.83కోట్ల నిధులను తాజాగా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మొదటిపేజీ తరువాయి...

ఇక గుండె చెరువే!

మూసీ ప్రక్షాళన పేరిట చేపట్టిన కూల్చివేతలే సామాన్యుడిని కలవర పెడుతుంటే.. చెరువుల రీ సర్వే అంటే కనుమరుగైన ఎన్నో చెరువుల పేరిట అగ్గిరాజేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఇన్నేండ్లు హెచ్‌ఎండీఏ నిర్దేశించిన చెరువుల బఫర్, ఎఫ్టీఎల్ ఆధారంగా అన్ని అనుమతులు, ఎన్వోసీలతో భవనాలు నిర్మించుకున్నా.. వాటితో సంబంధం లేకుండా బుల్డోజర్లను దింపనున్నది.

చెరువుల రీ సర్వే: భట్టి

చెరువుల రీ సర్వే చేపట్టనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 'పదేండ్లలో చెరువులన్నీ విధ్వంసానికి గురయ్యాయి. ఎంతో మంది చెరువు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇలానే వదిలేస్తే నగరంలో చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నది. ఇప్పటివరకు ఆక్రమించుకున్న చెరువుల బఫర్ జోన్ ప్రాంతాలను వదిలేస్తాం. కానీ ఎఫ్‌టీఎల్ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. చెరువులు, కుంటల ఎఫ్టీఎల్ భూములను పరిరక్షించేలా సర్వే చేపడతాం. గతంలోనూ ఆక్రమణలు జరిగాయి. చెరువులు, కుంటల విషయంలో జరిగిన లోపాలను సవరించి ఎఫ్టీఎల్ వరకైనా జలవనరులను కాపాడుకుంటాం' అని వెల్లడించారు.

45 ఏండ్ల డాటాతో ఎఫ్‌టీఎల్ గుర్తింపు: రంగనాథ్

చెరువుల హద్దులను శాస్త్రీయంగా గుర్తించేలా చర్యలు చేపట్టినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. 45 ఏండ్ల డాటా ఆధారంగా చెరువుల ఎఫ్‌టీఎల్, పూర్తిస్థాయి వాటర్ స్ప్రెడ్ ఏరియాను గుర్తించేందుకు ఎన్ఆర్ఎస్ఏ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, ఇరిగేషన్ విభాగాల డాటాను ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు. హైడ్రా కార్యాలయంలో సోమవారం లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించిన ఆయన.. విలేజ్ మ్యాప్స్, ల్యాండ్ యూజ్ సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే క్యాడస్ట్రల్ మ్యాప్స్, 45 ఏండ్లలో పూర్తిస్థాయిలో చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారాన్ని సేకరిస్తామని వివరించారు. హిమాయత్ సాగర్‌తో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల గుర్తింపు ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువులకు వర్తింపజేస్తామని చెప్పారు. ఓఆర్ఆర్ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయో, ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయో లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు.

హైడ్రా ప్రత్యేక యాప్

నగరంలో చెరువుల ఆక్రమణలను ఉపేక్షించేది లేదని రంగనాథ్ స్పష్టంచేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం నిఘా పెట్టేందుకు హైడ్రా చర్యలు చేపట్టిందని అన్నారు. ఆక్రమణలను వెంటనే గుర్తించేలా హైడ్రా ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తున్నట్టు చెప్పారు. ఈ యాప్ ద్వారా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని, తక్షణమే క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన, చర్యలు ఉంటాయని వివరించారు. ఆక్రమణలను తొలగించి చెరువుల్లో డెబ్రిస్‌ను పూర్తి స్థాయిలో తొలగిస్తామని చెప్పారు. మొదటిదశగా సున్నం చెరువు, అప్పా చెరువు, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

పాత చెరువులకు కొత్త హద్దులు

ఏడు జిల్లాల హెచ్‌ఎండీఏ పరిధిలో 3,532కిపైగా చెరువులు ఉన్నాయి. చెరువు హద్దుల నిర్ధారణ, పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలను అదే చూసుకుంటుంది. ఇప్పటివరకు 2,525 చెరువులకు ప్రాథమిక హద్దులను ఖరారు చేసింది. ఇందులో 230 చెరువులకు మాత్రమే బఫర్ జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారించింది. మిగిలిన వాటికి ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఈ క్రమంలో సమగ్రమైన వివరాలతో తుది నోటిఫికేషన్ జారీ చేయాల్సింది పోయి.. ఇప్పటివరకు చేసిన హద్దులను చెరిపివేసి, మొదటి నుంచి ప్రక్రియను మొదలుపెట్టనున్నది. ఈ లెక్కన పాత చెరువులకు కొత్తగా హద్దులను ఏర్పాటుచేసి పరివాహక ప్రాంత జనాలను కలవరపెట్టేలా కాంగ్రెస్ అడుగులు వేస్తున్నది. రీ సర్వే పేరిట హద్దు రాళ్లను చెరిపేసి కొత్తగా హద్దులను నిర్ధారిస్తే పాత హద్దులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఇచ్చిన క్లియరెన్సులు బుట్టదాఖలు కానున్నాయి.

రీ సర్వేతో రియల్ ఎస్టేట్ కుదేల్

ఇప్పటికే హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట చేపట్టిన కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం ఢమాల్ అన్నది. ఇక దశాబ్దాల కాలంగా మూసీ వెంబడి ఉన్న నిర్మాణాలను కూలదోసేలా హద్దులను నిర్ధారిస్తుండగా, చెరువుల రీ సర్వే చేస్తే పేద, మధ్యతరగతి వర్గాలు కట్టుకున్న నిర్మాణాలన్నీ కూలిపోనున్నాయి. కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం చెరువుల రీ సర్వే చేసి తులసి నీళ్లు పోసే కుట్రకు దిగిందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు

- సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించాలి
- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కొత్తపల్లి, అక్టోబర్ 7 : ప్రభుత్వం ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని, న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించాలని, లేకుంటే దసరా తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను దసరాలోపు ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతనాలు, ఇతర బిల్లుల చెల్లింపులను ఈ-కుబేర్‌తో కాకుండా జిల్లా ట్రెజరీల ద్వారా అందేలా చూడాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. లీవ్ సాలరీ, జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఇన్ క్యాష్ అసెస్మెంట్, బిల్డింగ్ లోన్లను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, సర్దార్ హర్మీందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, సబిత, విజయలక్ష్మి, రాజేశ్వర్‌రావు, రామస్వామి, వివిధ డిపార్ట్‌మెంట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద సాయం 11,713 కోట్లు ఇవ్వండి

- సీఆర్పీఎఫ్ క్యాంపులు పెట్టండి
- ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌ను తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో చేర్చండి
- మెట్రోరైలు రెండో దశకు సహకరించండి
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరద నష్టం కింద రూ.11,713.49 కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సీఎస్‌ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని, మెట్రో రైలు రెండో దశకు సహకారం అందించాలని కోరారు. కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అనంతరం హోం మంత్రి అమిత్‌షాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టాన్ని అమిత్‌షాకు వివరించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలను తిరిగి చేర్చాలని కోరారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటుచేయాలని విన్నవించారు. ఎస్పీవోల పెండింగ్ నిధులు విడుదల చేయాలని, 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో శిక్షణకు అదనంగా రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని, రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. తెలంగాణకు అదనంగా 29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్ సీఎస్‌ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని కోరారు. మూసీలో మురుగు చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్‌సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో రూపొందించిన డీపీఆర్‌ను కేంద్ర మంత్రికి అందజేశారు. డీపీఆర్‌ను ఆమోదించడంతోపాటు పనుల అనుమతికి చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రూ.24,269 కోట్ల వ్యయంతో డీపీఆర్‌ను సమర్పిస్తామని, అది త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని ఖట్టర్‌ను కోరారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వంశీకృష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, ముఖ్య కార్యదర్శులు వీ శేషాద్రి, దానకిశోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

5 నెలలుగా అధికారుల అరిగోస

- లోక్‌సభ ఎన్నికల్లో 14 శాఖల్లో బదిలీలు
- ఐదు నెలలైనా వెనక్కి రప్పించని వైనం
- పనిఒత్తిడిలో ఎందరో అనారోగ్యాల పాలు
- తక్షణమే రప్పించాలని కోరుతున్న ఉద్యోగులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 'ఉద్యోగుల్లో అశాంతి మంచిది కాదు. అలాంటి పరిస్థితులుంటే వారు సరిగ్గా పనిచేయలేరు. అందుకే పదోన్నతులు ఇచ్చాం. బదిలీలు చేపడతున్నాం. అసంతృప్తిని దూరం చేస్తున్నాం' ఇది తరుచూ సీఎం మొదలు మంత్రుల వరకు చెప్పే నీతివాక్యాలు. కానీ గత లోక్‌సభ ఎన్నికల సమయంలో వివిధ స్థాయిల్లో ఉన్న వందలాది మంది అధికారులను బదిలీ చేసి ప్రభుత్వం వారిని వెనక్కి రప్పించడాన్ని విస్మరించింది. వీరి గోడును కనీసం పట్టించుకోకుండా గాలి కొదిలేసింది. దీంతో వారంతా ఐదునెలలుగా ఆపసోపాలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కొన్ని కీలక శాఖల్లోని ఉద్యోగులను బదిలీచేయడం, ఎన్నికలు పూర్తికాగానే తిరిగి వెనక్కి రప్పించడం అనవాయితీ. ఈ తరహాలోనే మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉద్యోగులను పెద్ద ఎత్తున బదిలీ చేశారు. పంచాయతీరాజ్, పోలీస్, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, ఎక్సైజ్ సహా 14 శాఖల్లో ఈ బదిలీలు జరిగాయి. మున్సిపల్ కమిషనర్లు సహా కింది స్థాయి ఉద్యోగులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఇన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను బదిలీచేశారు. ఎన్నికలను సాకుగా చూపి ఇష్టారీతిన ఆనాడు బదిలీలు చేశారు. కనీసం ఆప్షన్లు కూడా ఇవ్వకుండా, ఒక్కొక్కరిని జిల్లాలకు జిల్లాలను దాటించి 150 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు పూర్తవగానే వెనక్కి వస్తామన్న ధీమాతో ఆనాడు వెళ్లారు. కానీ ఎన్నికలు ముగిసి దాదాపు 5 నెలలు గడిచించి. కానీ బదిలీ చేసిన వారిని మాత్రం వెనక్కి రప్పించలేదు.

జిల్లాలకు జిల్లాలే దాటించారు!

వివిధ జిల్లాల్లోని 399 మంది ఎంపీడీవోలను ఇష్టారీతిన బదిలీ చేశారు. వికారాబాద్ జిల్లాలోని ఓ ఎంపీడీవోను నారాయణపేట జిల్లాకు బదిలీచేశారు. నల్లగొండ నుంచి మెదక్, నారాయణపేట, వికారాబాద్ నుంచి సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో కర్ణాటక బార్డర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసిన దాఖలాలు ఉన్నాయి. దాదాపు 300 మంది ఎంపీడీవోలను 150 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో ఒక్కరినీ వెనక్కి తీసుకురాలేదు.

పనిఒత్తిడితో ఆరుగురు చనిపోయారు

లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆప్షన్లు ఇవ్వకుండా ఇష్టారీతిన బదిలీలు చేశారు. కొందరు ఎంపీడీవోలను 250 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో వేశారు. నల్లగొండ జిల్లా వారిని నారాయణపేట జిల్లాకు బదిలీచేశారు. అనేక మంది కుటుంబాలకు దూరమయ్యారు. ఈ రెండు నెలల్లో పని ఒత్తిడితో ఆరుగురు ఎంపీడీవోలు చనిపోయారు. ఇప్పటి వరకు ఆరుసార్లు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించాం. సీఎస్‌లను కలిసి బదిలీ అయిన వారిని వెనక్కి రప్పించాలని కోరాం. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి ఇప్పటికైనా వారిని వెనక్కి రప్పిస్తుందని ఆశిస్తున్నాం.

- పద్మావతి, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఈడీ కస్టడీకి సాహితీ అధినేత

హైదరాబాద్ (నాంపల్లి కోర్టులు), అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ అధినేత లక్ష్మీనారాయణను 5రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఈడీ కోర్టు జడ్జి సురేశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడి తరపు న్యాయవాది సమక్షంలో ఈడీ విచారణ చేపట్టాలని కోర్టు సూచించింది. వందల మందిని నమ్మించి 2,500 కోట్ల కుంభకోణానికి సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ పాల్పడిందని ఆరోపణలున్నాయి.

కర్ణాటక బస్సు, బైక్ ఢీకొని నలుగురి మృతి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు

జహీరాబాద్, అక్టోబర్ 7: కొద్దిక్షణాల్లో ఇంటికి చేరుకుంటామనుకునే లోగా ఎదురుగా మృత్యురూపంలో వచ్చిన కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడ్డారు. ఈ విషాద ఘటన సోమవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌లో చోటుచేసుకుంది. గణేశ్‌పూర్‌కు చెందిన గునెల్లి సిద్రామప్ప (71), ఆయన అల్లుడు జగన్నాథ్ (42), కూతురు రేణుక(38), మనుమడు వినయ్‌కుమార్(15) పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ.. బైక్‌పై రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ నుంచి బీదర్‌కు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్రామప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. జగన్నాథ్, అతడి భార్య రేణుక, కుమారుడు వినయ్‌కుమార్‌లను చికిత్స కోసం కారులో బీదర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, రూరల్ సీఐ హనుమంతు, హద్నూర్ ఎస్సై రామానాయుడు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుడు సిద్రామప్పకు ఇద్దరు భార్యలు. ఆయన అల్లుడు జగన్నాథ్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నట్టు గ్రామస్థులు పేర్కొన్నారు.

నేడు నాగార్జున వాంగ్మూలం

ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరుకానున్న సినీ నటుడు నాగార్జున



నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాలో సినీ నటుడు అక్కినేని నాగార్జున తన వాంగ్మూలం ఇచ్చేందుకు మంగళవారం కోర్టుకు హాజరుకానున్నారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో నాగార్జున తన వాంగ్మూలాన్ని నమోదు చేయాలని కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో సాక్షులుగా ఉన్న యార్లగడ్డ సుప్రియ, వెంకటేశ్వర్లు అట్లా వాంగ్మూలాలను కూడా కోర్టు నమోదు చేయనుంది. సెక్షన్ 356 బీఎన్ఎస్‌ను చేర్చుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ రచ్చ శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. పిటిషన్‌లో తెలిపిన వివరాల ప్రకారం మరి కొన్ని సెక్షన్లు జోడించాల్సి ఉంటుందని, వాటి ప్రకారం ఏ కోర్టును ఆశ్రయించాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుందని సూచించారు. మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యల గురించి పిటిషన్‌లో పొందపర్చిన విధంగా సెక్షన్లను కూడా జోడించాల్సి ఉంటుందని తెలిపారు. కేవలం ఒక్క సెక్షన్ ప్రకారమే కేసు నమోదు చేయాలని కోరారని పీపీ తెలిపారు. మరోవైపు నష్ట పరిహారాన్ని కోరుతూ మంత్రిపై మరో పిటిషన్ వేసేందుకు నాగార్జున తరపు న్యాయవాది సిద్ధమవుతున్నారు. మంత్రి కొండా తరపున టీపీసీసీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు తిరుపతివర్మతోపాటు ఇతర సభ్యులు కోర్టు ఎదుట హాజరయ్యారు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో...

భుజంగరావు బెయిల్ పొడిగింపుపై నేడు వాదనలు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో మధ్యంతర బెయిల్‌పై ఉన్న అదనపు ఎస్పీ భుజంగరావు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మరికొన్ని రోజుల బెయిల్ పొడిగించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు కొనసాగనున్నాయి. ఇప్పటికే 35 రోజులుగా ఆయన మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. గుండె సంబంధిత శస్త్ర చికిత్స నిమిత్తం మరికొంత సమయం కావాలని నిందితుడి తరపు న్యాయవాది కోరడంతో తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు మధ్యంతర బెయిల్‌లో షరతులే వర్తిస్తాయని కోర్టు పేర్కొంది.

వికలాంగుల సహకార సంస్థను ప్రక్షాళన చేస్తాం

చైర్మన్ ముత్తినేని వీరయ్య

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య వెల్లడించారు. సెక్రటేరియట్ మీడియా సెల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల సంక్షేమ శాఖలో అనేక అక్రమాలు జరిగాయని, జేడీ, విశ్రాంత ఉద్యోగులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వాటన్నింటిపై ఏసీబీ, విజిలెన్స్‌తో విచారణ జరిపిస్తామని తెలిపారు. సహకార సంస్థలో ఉన్నతస్థాయి ప్రమోషన్ల విషయంలో క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాలని, ఐఏఎస్‌ను డైరెక్టర్‌గా నియమించాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్ వంకర బుద్ధి

- డయల్ 100తో పరిచయం
- గృహిణిపై లైంగికదాడికి యత్నం
- వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

వనస్థలిపురం, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): డయల్ 100కు వచ్చిన ఫోన్‌కాల్‌తో వెళ్లిన ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కడి ఓ కుటుంబంతో పరిచయం చేసుకున్నాడు. వారితో ఆర్థికపరమైన లావాదేవీలు నిర్వహించి, చివరకు ఆ కుటుంబంలోని మహిళను బెదిరించి లైంగికదాడికి యత్నించిన ఘటన వెలుగుచూసింది. హైదరాబాద్ వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు సాహెబ్‌నగర్ గాయత్రీనగర్ ప్రాంతం నుంచి ఇటీవల డయల్ 100కు ఒక కాల్ వచ్చింది. ఆ సమస్య పరిశీలనకు పోలీసులు వెళ్లారు. వారిలో జగన్‌గౌడ్ అనే ఒక హెడ్ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతంలో నివాసముండే బాధితురాలితో జగన్‌గౌడ్‌కు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల వరకూ దారితీసింది. తన బంగారాన్ని కుదువపెట్టి డబ్బు తెచ్చి మరీ ఆమె కానిస్టేబుల్‌కు ఇచ్చింది. ఈ డబ్బు తిరిగి ఇవ్వడంలో కానిస్టేబుల్ జాప్యం చేస్తుండటంతో బాధితురాలు అతడిని నిలదీసింది. దీంతో ఈ నెల 4న ఇంజాపూర్‌లో కమాన్ వద్ద మా అమ్మానాన్న ఉన్నారని, వాళ్లిచ్చే డబ్బు ఇస్తానని నమ్మబలికి కారులో ఇంజాపూర్ వైపు తీసుకెళ్లాడు. ఓ నిర్జన ప్రదేశంలోకి తీసికెళ్లి ఆమెపై కానిస్టేబుల్ అఘాయిత్యానికి ప్రయత్నించాడు. అక్కడి నుంచి ఆమె తప్పించుకొని ఇంటికి చేరుకున్నది. ఈ విషయంపై వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.



ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ

మేడ్చల్, అక్టోబరు 7: లంచం తీసుకుంటున్న ఏఎస్ఐని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉండే శర్మ మేడ్చల్ మండలం గౌడెవల్లి గ్రామ పరిధిలోని సాకేత్ ప్రణామ్‌లో ఇల్లు నిర్మించారు. ఇంటీరియర్ పనుల కోసం సరూర్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్‌తో రూ.8 లక్షల చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. విశ్వనాథ్‌కు రూ.4 లక్షలను ముందుగా చెల్లించారు. కొన్ని రోజులు పనిచేసిన తర్వాత మరికొంత డబ్బు కావాలని విశ్వనాథ్ కోరాడు. ఇందుకు శర్మ నిరాకరించారు. దీంతో పని ఆగిపోయింది. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగడంతో శర్మ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. ఈ కేసులో జోక్యం చేసుకున్న ఏఎస్ఐ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మెయిన్‌హార్ట్‌కే మూసీ సుందరీకరణ!

- సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలు
- ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించిన పాకిస్థాన్ ప్రభుత్వం
- దానికే 4 రోజుల కిందట రూ.166 కోట్ల టెండర్ ఖరారు
- కంపెనీ బాగోతాన్ని ముందే బయటపెట్టిన బీఆర్ఎస్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలను రోడ్డు మీద పడేసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న 'మూసీ సుందరీకరణ' ప్రాజెక్టు బాధ్యతను అంతర్జాతీయంగా మోసపూరిత కంపెనీగా పేరొందిన 'మెయిన్‌హార్ట్'కు కట్టబెట్టింది. పాకిస్థాన్‌లో వందల కోట్ల మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ కంపెనీకి మూసీ సుందరీకరణ మాస్టర్‌ప్లాన్ తయారీ టెండర్ అప్పగించింది. మూసీ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు సంబంధించి రూ.166 కోట్ల పనులు కేటాయించింది. ఇకపై మూసీ ప్రాజెక్టు భవిష్యత్తు మొత్తం ఈ కంపెనీ చేతుల్లోనే ఉండనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు మూసీ సుందరీకరణను లక్షన్నర కోట్ల బడ్జెట్‌తో తీస్తున్న సినిమా మాదిరిగా తెరపై రంగుల కలను చూపిస్తున్నది. దాని చాటున వేల కుటుంబాలను బలి తీసుకుంటున్నది. ఇప్పుడు దొంగకు మరో దొంగ తోడైనట్టు.. పాకిస్థాన్ ప్రభుత్వం ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించిన వ్యక్తుల కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం జతకట్టింది. లక్షన్నర కోట్ల ప్రాజెక్టును వాళ్ల చేతుల్లో పెట్టింది. మాస్టర్‌ప్లాన్ తయారీకి కన్సల్టెన్సీ బాధ్యతలను మెయిన్‌హార్ట్ కంపెనీకి అప్పగిస్తూ పురపాలక శాఖ ఆధ్వర్యంలోని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఈ నెల 4న నిర్ణయం తీసుకుంది. టెండర్ ఖరారు చేసి నాలుగు రోజులు గడిచినా ఈ జీవో బయటకు విడుదల చేయకుండా గుట్టుగా ఉంచడం విశేషం. జీవో వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు.

టెండర్లు పిలిచిన మరుసటి రోజే భేటీ..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కన్సల్టెంట్ నియామకానికి ఈ ఏడాది ఫిబ్రవరి 5న పురపాలక శాఖ టెండర్లు పిలిచింది. ఆ మరుసటి రోజే మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితో సచివాలయంలో భేటీ అయ్యారు. ప్రాజెక్టు డిజైన్లను వివరించారు. అదేరోజు కంపెనీ బాగోతాన్ని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ బయటపెట్టారు. ఆర్థిక నేరాలకు పాల్పడ్డ కంపెనీతో ఎలా చర్చలు జరుపుతారని, లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' సైతం బయట పెట్టింది. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిని బట్టి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును మెయిన్‌హార్ట్‌కే అప్పగించాలని ముందుగానే నిర్ణయించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ నిబంధనలు కూడా కంపెనీకి అనుకూలంగా రూపొందించారని అంటున్నారు.

రూ.166.48 కోట్లకు టెండర్ ఖరారు

'మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్'కు మాస్టర్‌ప్లాన్ రూపొందించే బాధ్యతను మూడు కన్సల్టెన్సీల కన్సార్షియంకు అప్పగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు కుష్మన్ వేక్‌ఫీల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆర్ఐఓఎస్ డిజైన్స్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వాములుగా ఉన్నాయి. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

కాంగ్రెస్ తీరుపై విమర్శలు వెల్లువ..

అంతర్జాతీయంగా అభియోగాలున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు అని చెప్పుకుంటూ ఇలాంటి కంపెనీకి కట్టబెట్టడం ద్వారా ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని ప్రశ్నిస్తున్నారు. కాస్త ఇంటర్నెట్ పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా.. కంపెనీ బాగోతం తెలిసిపోతుందని అంటున్నారు. నెటిజన్లు, రాజకీయ నాయకులు, మీడియా ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకులాల్లో ఇంటర్ వరకూ ప్రవేశాలు

- ఎంసెట్, నీట్ కోచింగ్‌కు చర్యలు
- త్వరలోనే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్: మంత్రి పొన్నం
- బీసీ సంక్షేమ, సొసైటీ అధికారులతో సమావేశం

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ స్కూళ్ల తరహాలో బీసీ గురుకులాల్లో కూడా పదోతరగతి తరువాత నేరుగా ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తామని, విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బీసీ గురుకులాల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా సమాలోచనలు చేస్తున్నామని వివరించారు. బీసీ సంక్షేమశాఖలోని అన్నివిభాగాల ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి సమావేశాన్ని బంజారాహిల్స్‌లోని కొమురంభీమ్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ గురుకులంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా, ఎంసెట్, నీట్ కోచింగ్ ఇచ్చేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. హాస్టల్ వార్డెన్ల ప్రమోషన్లపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. గురుకులాల కోసం ఎమ్మెల్యే, ఎంపీ ఆ జిల్లా మంత్రి, ఎమ్మెల్సీలు వారి నిధుల నుంచి కేటాయించేలా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఈనెల 15-31లోపు ప్రతి గురుకులంలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, వారి సలహాలు, సూచనలు తీసుకొని ఫీడ్ బ్యాక్ అందించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి గురుకులలో బాక్స్ ఏర్పాటు చేసి ఆర్సీవోలు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జేడీ సంధ్య, నాయీబ్రాహ్మణ ఎండీ ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీబీసీడీవోలు, ఏడీబీసీడీవోలు, ఆర్సీవోలు, డీసీవోలు, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1502 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్7(నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ బీసీ విద్యార్థులకు అమలు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, వివిధ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1502.83కోట్ల నిధులను విడుదల చేసింది. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ స్కాలర్‌షిప్‌ల కోసం ప్రభుత్వం మొత్తంగా రూ.1890.34కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. ఇప్పటికే 387.51కోట్లను విడుదల చేయగా, మిగిలిన రూ.1502.83కోట్ల నిధులను తాజాగా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు

- సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించాలి
- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కొత్తపల్లి, అక్టోబర్ 7 : ప్రభుత్వం ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని, న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించాలని, లేకుంటే దసరా తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను దసరాలోపు ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతనాలు, ఇతర బిల్లుల చెల్లింపులను ఈ-కుబేర్‌తో కాకుండా జిల్లా ట్రెజరీల ద్వారా అందేలా చూడాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. లీవ్ సాలరీ, జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఇన్ క్యాష్ అసెస్మెంట్, బిల్డింగ్ లోన్లను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, సర్దార్ హర్మీందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, సబిత, విజయలక్ష్మి, రాజేశ్వర్‌రావు, రామస్వామి, వివిధ డిపార్ట్‌మెంట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇక గుండె చెరువే!

మొదటిపేజీ తరువాయి...

మూసీ ప్రక్షాళన పేరిట చేపట్టిన కూల్చివేతలే సామాన్యుడిని కలవర పెడుతుంటే.. చెరువుల రీ సర్వే అంటే కనుమరుగైన ఎన్నో చెరువుల పేరిట అగ్గిరాజేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఇన్నేండ్లు హెచ్ఎండీఏ నిర్దేశించిన చెరువుల బఫర్, ఎఫ్టీఎల్ ఆధారంగా అన్ని అనుమతులు, ఎన్వోసీలతో భవనాలు నిర్మించుకున్నా.. వాటితో సంబంధం లేకుండా బుల్డోజర్లను దింపనున్నది.

చెరువుల రీ సర్వే: భట్టి

చెరువుల రీ సర్వే చేపట్టనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 'పదేండ్లలో చెరువులన్నీ విధ్వంసానికి గురయ్యాయి. ఎంతో మంది చెరువు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇలానే వదిలేస్తే నగరంలో చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నది. ఇప్పటివరకు ఆక్రమించుకున్న చెరువుల బఫర్ జోన్ ప్రాంతాలను వదిలేస్తాం. కానీ ఎఫ్టీఎల్ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. చెరువులు, కుంటల ఎఫ్టీఎల్ భూములను పరిరక్షించేలా సర్వే చేపడతాం. గతంలోనూ ఆక్రమణలు జరిగాయి. చెరువులు, కుంటల విషయంలో జరిగిన లోపాలను సవరించి ఎఫ్టీఎల్ వరకైనా జలవనరులను కాపాడుకుంటాం' అని వెల్లడించారు.

45 ఏండ్ల డాటాతో ఎఫ్‌టీఎల్ గుర్తింపు: రంగనాథ్

చెరువుల హద్దులను శాస్త్రీయంగా గుర్తించేలా చర్యలు చేపట్టినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. 45 ఏండ్ల డాటా ఆధారంగా చెరువుల ఎఫ్‌టీఎల్, పూర్తిస్థాయి వాటర్ స్ప్రెడ్ ఏరియాను గుర్తించేందుకు ఎన్ఆర్ఎస్ఏ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, ఇరిగేషన్ విభాగాల డాటాను ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు. హైడ్రా కార్యాలయంలో సోమవారం లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించిన ఆయన.. విలేజ్ మ్యాప్స్, ల్యాండ్ యూజ్ సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే క్యాడస్ట్రల్ మ్యాప్స్, 45 ఏండ్లలో పూర్తిస్థాయిలో చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారాన్ని సేకరిస్తామని వివరించారు. హిమాయత్ సాగర్‌తో ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల గుర్తింపు ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువులకు వర్తింపజేస్తామని చెప్పారు. ఓఆర్ఆర్ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయో, ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయో లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు.

హైడ్రా ప్రత్యేక యాప్

నగరంలో చెరువుల ఆక్రమణలను ఉపేక్షించేది లేదని రంగనాథ్ స్పష్టంచేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం నిఘా పెట్టేందుకు హైడ్రా చర్యలు చేపట్టిందని అన్నారు. ఆక్రమణలను వెంటనే గుర్తించేలా హైడ్రా ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తున్నట్టు చెప్పారు. ఈ యాప్ ద్వారా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని, తక్షణమే క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన, చర్యలు ఉంటాయని వివరించారు. ఆక్రమణలను తొలగించి చెరువుల్లో డెబ్రీస్‌ను పూర్తి స్థాయిలో తొలగిస్తామని చెప్పారు. మొదటిదశగా సున్నం చెరువు, అప్పా చెరువు, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

పాత చెరువులకు కొత్త హద్దులు

ఏడు జిల్లాల హెచ్ఎండీఏ పరిధిలో 3,532కిపైగా చెరువులు ఉన్నాయి. చెరువు హద్దుల నిర్ధారణ, పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలను అదే చూసుకుంటుంది. ఇప్పటివరకు 2,525 చెరువులకు ప్రాథమిక హద్దులను ఖరారు చేసింది. ఇందులో 230 చెరువులకు మాత్రమే బఫర్ జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారించింది. మిగిలిన వాటికి ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఈ క్రమంలో సమగ్రమైన వివరాలతో తుది నోటిఫికేషన్ జారీ చేయాల్సింది పోయి.. ఇప్పటివరకు చేసిన హద్దులను చెరిపివేసి, మొదటి నుంచి ప్రక్రియను మొదలుపెట్టనున్నది. ఈ లెక్కన పాత చెరువులకు కొత్తగా హద్దులను ఏర్పాటుచేసి పరివాహక ప్రాంత జనాలను కలవరపెట్టేలా కాంగ్రెస్ అడుగులు వేస్తున్నది. రీ సర్వే పేరిట హద్దు రాళ్లను చెరిపేసి కొత్తగా హద్దులను నిర్ధారిస్తే పాత హద్దులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఇచ్చిన క్లియరెన్సులు బుట్టదాఖలు కానున్నాయి.

రీ సర్వేతో రియల్ ఎస్టేట్ కుదేల్

ఇప్పటికే హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట చేపట్టిన కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం ఢమాల్ అన్నది. ఇక దశాబ్దాల కాలంగా మూసీ వెంబడి ఉన్న నిర్మాణాలను కూలదోసేలా హద్దులను నిర్ధారిస్తుండగా, చెరువుల రీ సర్వే చేస్తే పేద, మధ్యతరగతి వర్గాలు కట్టుకున్న నిర్మాణాలన్నీ కూలిపోనున్నాయి. కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం చెరువుల రీ సర్వే చేసి తులసి నీళ్లు పోసే కుట్రకు దిగిందని నిపుణులు పేర్కొంటున్నారు.

వరద సాయం 11,713 కోట్లు ఇవ్వండి

- సీఆర్పీఎఫ్ క్యాంపులు పెట్టండి
- ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌ను తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో చేర్చండి
- మెట్రోరైలు రెండో దశకు సహకరించండి
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరద నష్టం కింద రూ.11,713.49 కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని, మెట్రో రైలు రెండో దశకు సహకారం అందించాలని కోరారు. కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అనంతరం హోం మంత్రి అమిత్‌షాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టాన్ని అమిత్‌షాకు వివరించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలను తిరిగి చేర్చాలని కోరారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటుచేయాలని విన్నవించారు. ఎస్పీవోల పెండింగ్ నిధులు విడుదల చేయాలని, 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో శిక్షణకు అదనంగా రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని, రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. తెలంగాణకు అదనంగా 29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చాలని కోరారు. మూసీలో మురుగు చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్‌సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో రూపొందించిన డీపీఆర్‌ను కేంద్ర మంత్రికి అందజేశారు. డీపీఆర్‌ను ఆమోదించడంతోపాటు పనుల అనుమతికి చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రూ.24,269 కోట్ల వ్యయంతో డీపీఆర్‌ను సమర్పిస్తామని, అది త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని ఖట్టర్‌ను కోరారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వంశీకృష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, ముఖ్య కార్యదర్శులు వీ శేషాద్రి, దానకిశోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

5 నెలలుగా అధికారుల అరిగోస

- లోక్‌సభ ఎన్నికల్లో 14 శాఖల్లో బదిలీలు
- ఐదు నెలలైనా వెనక్కి రప్పించని వైనం
- పనిఒత్తిడిలో ఎందరో అనారోగ్యాల పాలు
- తక్షణమే రప్పించాలని కోరుతున్న ఉద్యోగులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 'ఉద్యోగుల్లో అశాంతి మంచిది కాదు. అలాంటి పరిస్థితులుంటే వారు సరిగ్గా పనిచేయలేరు. అందుకే పదోన్నతులు ఇచ్చాం. బదిలీలు చేపడుతున్నాం. అసంతృప్తిని దూరం చేస్తున్నాం' ఇది తరుచూ సీఎం మొదలు మంత్రుల వరకు చెప్పే నీతివాక్యాలు. కానీ గత లోక్‌సభ ఎన్నికల సమయంలో వివిధ స్థాయిల్లో ఉన్న వందలాది మంది అధికారులను బదిలీ చేసి ప్రభుత్వం వారిని వెనక్కి రప్పించడాన్ని విస్మరించింది. వీరి గోడును కనీసం పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో వారంతా ఐదునెలలుగా ఆపసోపాలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కొన్ని కీలక శాఖల్లోని ఉద్యోగులను బదిలీచేయడం, ఎన్నికలు పూర్తికాగానే తిరిగి వెనక్కి రప్పించడం అనవాయితీ. ఈ తరహాలోనే మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉద్యోగులను పెద్ద ఎత్తున బదిలీ చేశారు. పంచాయతీరాజ్, పోలీస్, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, ఎక్సైజ్ సహా 14 శాఖల్లో ఈ బదిలీలు జరిగాయి. మున్సిపల్ కమిషనర్లు సహా కింది స్థాయి ఉద్యోగులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఇన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను బదిలీచేశారు. ఎన్నికలను సాకుగా చూపి ఇష్టారీతిన ఆనాడు బదిలీలు చేశారు. కనీసం ఆప్షన్లు కూడా ఇవ్వకుండా, ఒక్కొక్కరిని జిల్లాలకు జిల్లాలను దాటించి 150 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు పూర్తవగానే వెనక్కి వస్తామన్న ధీమాతో ఆనాడు వెళ్లారు. కానీ ఎన్నికలు ముగిసి దాదాపు 5 నెలలు గడిచింది. కానీ బదిలీ చేసిన వారిని మాత్రం వెనక్కి రప్పించలేదు.

జిల్లాలకు జిల్లాలే దాటించారు!

వివిధ జిల్లాల్లోని 399 మంది ఎంపీడీవోలను ఇష్టారీతిన బదిలీ చేశారు. వికారాబాద్ జిల్లాలోని ఓ ఎంపీడీవోను నారాయణపేట జిల్లాకు బదిలీచేశారు. నల్లగొండ నుంచి మెదక్, నారాయణపేట, వికారాబాద్ నుంచి సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో కర్ణాటక బార్డర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసిన దాఖలాలు ఉన్నాయి. దాదాపు 300 మంది ఎంపీడీవోలను 150 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో ఒక్కరినీ వెనక్కి తీసుకురాలేదు.

పనిఒత్తిడితో ఆరుగురు చనిపోయారు

లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆప్షన్లు ఇవ్వకుండా ఇష్టారీతిన బదిలీలు చేశారు. కొందరు ఎంపీడీవోలను 250 నుంచి 300 కిలోమీటర్ల దూరంలో వేశారు. నల్లగొండ జిల్లా వారిని నారాయణపేట జిల్లాకు బదిలీచేశారు. అనేక మంది కుటుంబాలకు దూరమయ్యారు. ఈ రెండు నెలల్లో పని ఒత్తిడితో ఆరుగురు ఎంపీడీవోలు చనిపోయారు. ఇప్పటి వరకు ఆరుసార్లు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించాం. సీఎస్‌లను కలిసి బదిలీ అయిన వారిని వెనక్కి రప్పించాలని కోరాం. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి ఇప్పటికైనా వారిని వెనక్కి రప్పిస్తుందని ఆశిస్తున్నాం.

- పద్మావతి, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఈడీ కస్టడీకి సాహితీ అధినేత

హైదరాబాద్ (నాంపల్లి కోర్టులు), అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ అధినేత లక్ష్మీనారాయణను 5రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఈడీ కోర్టు జడ్జి సురేశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడి తరపు న్యాయవాది సమక్షంలో ఈడీ విచారణ చేపట్టాలని కోర్టు సూచించింది. వందల మందిని నమ్మించి 2,500 కోట్ల కుంభకోణానికి సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ పాల్పడిందని ఆరోపణలున్నాయి.


కర్ణాటక బస్సు, బైక్ ఢీకొని నలుగురి మృతి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు

జహీరాబాద్, అక్టోబర్ 7: కొద్దిక్షణాల్లో ఇంటికి చేరుకుంటామనుకునే లోగా ఎదురుగా మృత్యురూపంలో వచ్చిన కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడ్డారు. ఈ విషాద ఘటన సోమవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌లో చోటుచేసుకుంది. గణేశ్‌పూర్‌కు చెందిన గునెల్లి సిద్రామప్ప (71), ఆయన అల్లుడు జగన్నాథ్ (42), కూతురు రేణుక(38), మనుమడు వినయ్‌కుమార్(15) పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ.. బైక్‌పై రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ నుంచి బీదర్‌కు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్రామప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. జగన్నాథ్, అతడి భార్య రేణుక, కుమారుడు వినయ్‌కుమార్‌లను చికిత్స కోసం కారులో బీదర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, రూరల్ సీఐ హనుమంతు, హద్నూర్ ఎస్సై రామానాయుడు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుడు సిద్రామప్పకు ఇద్దరు భార్యలు. ఆయన అల్లుడు జగన్నాథ్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నట్టు గ్రామస్థులు పేర్కొన్నారు.

నేడు నాగార్జున వాంగ్మూలం

ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరుకానున్న సినీ నటుడు నాగార్జున



నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాలో సినీ నటుడు అక్కినేని నాగార్జున తన వాంగ్మూలం ఇచ్చేందుకు మంగళవారం కోర్టుకు హాజరుకానున్నారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో నాగార్జున తన వాంగ్మూలాన్ని నమోదు చేయాలని కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో సాక్షులుగా ఉన్న యార్లగడ్డ సుప్రియ, వెంకటేశ్వర్లు అట్లా వాంగ్మూలాలను కూడా కోర్టు నమోదు చేయనుంది. సెక్షన్ 356 బీఎన్ఎస్‌ను చేర్చుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ రచ్చ శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. పిటిషన్‌లో తెలిపిన వివరాల ప్రకారం మరికొన్ని సెక్షన్లు జోడించాల్సి ఉంటుందని, వాటి ప్రకారం ఏ కోర్టును ఆశ్రయించాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుందని సూచించారు. మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యల గురించి పిటిషన్‌లో పొందపర్చిన విధంగా సెక్షన్లను కూడా జోడించాల్సి ఉంటుందని తెలిపారు. కేవలం ఒక్క సెక్షన్ ప్రకారమే కేసు నమోదు చేయాలని కోరారని పీపీ తెలిపారు. మరోవైపు నష్ట పరిహారాన్ని కోరుతూ మంత్రిపై మరో పిటిషన్ వేసేందుకు నాగార్జున తరపు న్యాయవాది సిద్ధమవుతున్నారు. మంత్రి కొండా తరపున టీపీసీసీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు తిరుపతివర్మతోపాటు ఇతర సభ్యులు కోర్టు ఎదుట హాజరయ్యారు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో... భుజంగరావు బెయిల్ పొడిగింపుపై నేడు వాదనలు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో మధ్యంతర బెయిల్‌పై ఉన్న అదనపు ఎస్పీ భుజంగరావు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మరికొన్ని రోజుల బెయిల్ పొడిగించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు కొనసాగనున్నాయి. ఇప్పటికే 35 రోజులుగా ఆయన మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. గుండె సంబంధిత శస్త్ర చికిత్స నిమిత్తం మరికొంత సమయం కావాలని నిందితుడి తరపు న్యాయవాది కోరడంతో తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు మధ్యంతర బెయిల్‌లో షరతులే వర్తిస్తాయని కోర్టు పేర్కొంది.

వికలాంగుల సహకార సంస్థను ప్రక్షాళన చేస్తాం

చైర్మన్ ముత్తినేని వీరయ్య

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య వెల్లడించారు. సెక్రటేరియట్ మీడియా సెల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల సంక్షేమ శాఖలో అనేక అక్రమాలు జరిగాయని, జేడీ, విశ్రాంత ఉద్యోగులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వాటన్నింటిపై ఏసీబీ, విజిలెన్స్‌తో విచారణ జరిపిస్తామని తెలిపారు. సహకార సంస్థలో ఉన్నతస్థాయి ప్రమోషన్ల విషయంలో క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాలని, ఐఏఎస్‌ను డైరెక్టర్‌గా నియమించాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్ వంకర బుద్ధి

- డయల్ 100తో పరిచయం
- గృహిణిపై లైంగికదాడికి యత్నం
- వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

వనస్థలిపురం, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): డయల్ 100కు వచ్చిన ఫోన్‌కాల్‌తో వెళ్లిన ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కడి ఓ కుటుంబంతో పరిచయం చేసుకున్నాడు. వారితో ఆర్థికపరమైన లావాదేవీలు నిర్వహించి, చివరకు ఆ కుటుంబంలోని మహిళను బెదిరించి లైంగికదాడికి యత్నించిన ఘటన వెలుగుచూసింది. హైదరాబాద్ వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు సాహెబ్‌నగర్ గాయత్రీనగర్ ప్రాంతం నుంచి ఇటీవల డయల్ 100కు ఒక కాల్ వచ్చింది. ఆ సమస్య పరిశీలనకు పోలీసులు వెళ్లారు. వారిలో జగన్‌గౌడ్ అనే ఒక హెడ్ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతంలో నివాసముండే బాధితురాలితో జగన్‌గౌడ్‌కు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల వరకూ దారితీసింది. తన బంగారాన్ని కుదువపెట్టి డబ్బు తెచ్చి మరీ ఆమె కానిస్టేబుల్‌కు ఇచ్చింది. ఈ డబ్బు తిరిగి ఇవ్వడంలో కానిస్టేబుల్ జాప్యం చేస్తుండటంతో బాధితురాలు అతడిని నిలదీసింది. దీంతో ఈ నెల 4న ఇంజాపూర్‌లో కమాన్ వద్ద మా అమ్మానాన్న ఉన్నారని, వాళ్లిచ్చే డబ్బు ఇస్తానని నమ్మబలికి కారులో ఇంజాపూర్ వైపు తీసుకెళ్లాడు. ఓ నిర్జన ప్రదేశంలోకి తీసికెళ్లి ఆమెపై కానిస్టేబుల్ అఘాయిత్యానికి ప్రయత్నించాడు. అక్కడి నుంచి ఆమె తప్పించుకొని ఇంటికి చేరుకున్నది. ఈ విషయంపై వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరిగింది. ఉత్సవాల సందర్భంగా భక్తులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. ఆదివారం స్వామివారిని 86,859 మంది దర్శించుకోగా 37,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న వివిధ కానుకల ద్వారా హుండీకి రూ.3.63 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.



తిరుమలలో నేడు శ్రీవారి గరుడ సేవ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): టీటీడీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ సేవ నిర్వహించనున్నారు. మలయప్పస్వామి.. గరుడవాహనంపై సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11 గంటల వరకు విహరిస్తారు. ఈ సేవ కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. భక్తులరద్దీ దృష్ట్యా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు భక్తులకు అన్నప్రసాద సౌకర్యం కల్పించనున్నారు. భక్తుల కోసం 400కు పైగా బస్సులు ఏర్పాటుచేశారు. గరుడ సేవకు దాదాపు 3.50 లక్షల మంది భక్తులు రానున్నట్టు ఈవో అంచనా వేశారు.

హైదరాబాద్ నుంచే 'విశాఖ హనీట్రాప్'

- గ్యాంగ్ సభ్యులుగా సుమారు 15 మంది?
- 3 బ్యాంక్ అకౌంట్లు హైదరాబాద్ నుంచే నిర్వహణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : అందమే వాళ్ల పెట్టుబడి. డబ్బున్న మగాళ్లే వారి టార్గెట్. హస్కీ వాయిస్‌తో మాటాల్లోకి దించుతారు. పరిచయాలు, చాటింగ్స్, డేటింగ్స్, వీడియోకాల్స్‌తో మెల్లగా రంగంలోకి దించుతారు. ప్రేమ, పెళ్లి అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత అందినకాడికి దోచేస్తారు. విశాఖలో వెలుగుచూసిన 'హనీట్రాప్' అలాగే జరిగింది. ఈ ట్రాప్‌లో కీలక సూత్రధారి అయిన జమీమా అండ్ కో.. మొదట ఓనమాలు దిద్దింది హైదరాబాద్‌లోనే. ఇక్కడ పదుల సంఖ్యలో డబ్బున్న వారిని వంచించిన తర్వాతే వైజాగ్‌కు షిఫ్ట్ అయినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో మోసపోయిన వారిలో ఎక్కువగా ధనవంతులు, పెండ్లయినవారే ఉండటంతో ఏ ఒక్కరూ ఫిర్యాదులు చేయలేదని సమాచారం. దీనిని వెలుగులోకి తెచ్చిన విశాఖపట్నం సీపీ బాగ్చీ సైతం హైదరాబాద్ బాధితులు తమకు వివరాలు చెప్పాలని కోరారు.

మూడు బ్యాంక్ అకౌంట్లు..

విదేశాల్లో స్థిరపడ్డ, బాగా సంపాదించిన మగవాళ్లను లక్ష్యంగా చేసుకొని మోసాలు చేస్తున్న ఈ గ్యాంగ్‌లో మొత్తం 15 మంది వరకు సభ్యులు ఉన్నట్టు సమాచారం. వీరు నిర్వహిస్తున్న బ్యాంకు అకౌంట్లు హైదరాబాద్‌లో ఓపెన్ చేసినవే కావడటంతో ఇక్కడ కూడా వారి మూలాల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎన్నారైలకు అందమైన ఫొటోలు షేర్ చేసి ఆకర్షించడం, ప్రేమపెళ్లి పేరుతో లైన్‌లో పెట్టడం వీరి దినచర్య. ఎవరైతే వీరి వీడియోలకు లైక్‌లు, కామెంట్లు చేస్తారో వారి అకౌంట్లు, హోదా, అంతస్తు తదితర విషయాలను గమనించి వారిని లైన్‌లో పెడుతారు. రొమాంటిక్ వీడియోకాల్స్ చేసి స్వీట్‌గా మాట్లాడుతూ.. ఆ తర్వాత మెల్లిగా పెండ్లి ప్రపోజల్ తీసుకొస్తారు. 'అమ్మానాన్నలతో మాట్లాడిన తర్వాతే ఏదైనా'.. అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత ఓ ఇంటి అడ్రస్ ఇస్తారు. అప్పటికే ఓ సినిమా స్టైల్‌లో నకిలీ పేరెంట్స్‌ను రంగంలోకి దించుతారు. అంతా ఓకే అనుకున్న తర్వాత.. వాళ్లే ఓ ప్లేస్ చెప్పి అక్కడికి రమ్మంటారు. రొమాన్స్ పేరుతో మత్తుమందు కలిపిన మందు తాపించి, డ్యాన్స్‌లు చేయించి సోయితప్పేలా చేస్తారు. ఆ తర్వాత వారిని నగ్నంగా మార్చి ఫొటోలు, వీడియోలు తీసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. అడిగినంత ఇవ్వకపోతే ఫొటోలు సోషల్‌మీడియాలో పెడతామని బెదిరిస్తారు.

బాబు మానస పుత్రిక.. రేవంత్ ప్రాజెక్టు

చంద్రబాబు హయాంలోనే తెరపైకి మూసీ సుందరీకరణ పనులు

'నందనవనం' పేరిట పేదల తరలింపు.. అప్పట్లో గాయిగాయి చేసిన కాంగ్రెస్

కేసీఆర్ హయంలో మూసీ ప్రక్షాళన.. పేదల జోలికి వెళ్లకుండా ప్రణాళిక

కానీ ఇప్పుడు ఇండ్లు కూల్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్

బాబు దోస్త్ ఈశ్వరన్ కంపెనీకే మూసీ మాస్టర్ ప్లాన్ బాధ్యతలు

166.48 కోట్లతో మెయిన్ హార్ట్‌కు అప్పగిస్తూ రేవంత్ సర్కారు ఉత్తర్వులు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కాలాలు మారినా పేదల తలరాతలు మారలేదనడానికి 'మూసీ' కంటే మంచి ఉదాహరణ ఉండదేమో. 1999-2001 చంద్రబాబు పాలనా కాలంలో మూసీ పేదల మెడపై వేలాడిన కత్తి.. మళ్లీ ఇప్పుడు ఆయన సహచరుడు రేవంత్ హయాంలో భయపెడుతున్నది. నాడు, నేడు సేమ్ టు సేమ్. అడ్డగోలుగా పేదల తరలింపే లక్ష్యం. నాడు ప్రతిపక్షాలు విజయవంతంగా అడ్డుకోవడంతో ఆగిన కత్తిని దశాబ్దాల తర్వాత మళ్లీ రేవంత్ ఝుళిపిస్తున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు రేవంత్ చెప్తున్నట్టు ఆయన మానస పుత్రిక కాదని, చంద్రబాబు హయాంలో అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టును ఇప్పుడు రేవంత్ తలకెత్తుకున్నారని పలువురు హక్కుల కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. అంతేకాదు! లక్షన్నర కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ఏంచేయాలి? ఎట్లచేయాలి? ఎక్కడెంత ఖర్చు పెట్టాలి? అన్నింటికీ ఒక రూట్‌మ్యాప్‌ను రూపొందించే 'గురు'తర బాధ్యతను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెయిన్ హార్ట్ అనే ఒక కన్సల్టెన్సీ కంపెనీ చేతుల్లో పెట్టింది. ఇంతకీ ఈ కంపెనీ ఎవరిదో తెలుసా? ఏపీ సీం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, అమరావతి గ్రా ఫిక్స్ సూత్రధారి, ప్రస్తుతం జైల్లో ఉన్న సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. 166.48 కోట్లతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్ బాధ్యతలను మెయిన్‌హార్ట్ కన్సార్టియంకు అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ డొమైన్‌లో మాత్రం ఈ ఉత్తర్వులను (జీవో ఆర్టీ నెం.472, 4.10.2024) అందుబాటులో ఉంచలేదు.

'బాబు' హయాంలో 'నందనవనం'

మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వాస్తవంగా కేసీఆర్ హయాంలోనే రూపొందించారు. అప్పుడు తయారుచేసిన ప్రతిపాదనల ప్రకారమే మేం ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కొన్ని రోజుల కిందట ప్రకటించారు. అంటే కేసీఆర్ ప్రభుత్వమే ఈ సుందరీకరణ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందనే అభిప్రాయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లోకి వదిలింది. కానీ చరిత్ర తిరగేస్తే, అసలు మూసీ సుందరీకరణ అనే దానిని తెరపైకి తెచ్చింది సాక్షాత్తూ చంద్రబాబునాయుడు. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి. నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 1999-2001 సమయంలో ఈ ప్రాజెక్టు అమలులో ఉన్నట్టుగా సీనియర్ అధికారులు తెలిపారు. 'నందనవనం' పేరిట మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ నుంచి నాగోల్ వరకు 14 కిలోమీటర్ల మేర మూసీ సుందరీకరణ చేపట్టాలనేది ప్రతిపాదన. ఇందులో భాగంగా శంకర్‌నగర్, మూసానగర్, కమల్‌నగర్ తదితర మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అక్కడి నుంచి తరలించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వారందరికీ ఒకచోట ప్రభుత్వపరంగా వసతి కల్పించేందుకే కర్మన్‌ఘాట్ సమీపంలో 'నందనవనం' అనే భారీ గృహ సముదాయాన్ని నిర్మించింది. ఈ మేరకు చాలా మంది నిరుపేదలను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. చాలామంది వ్యతిరేకించి తాము ఖాళీ చేసేదిలేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. సుందరీకరణలో భాగంగా కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)తో కోట్లాది రూపాయల పనులు చేపట్టారు. కానీ ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకోవడంతో అప్పుడు ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. అప్పటి హైదరాబాద్ కలెక్టర్ కూడా అవినీతి వాస్తవమేనని తేల్చడంతో కుడాకు పనుల అప్పగింతను నిలిపివేస్తున్నట్టు అప్పటి పురపాలకశాఖ మంత్రి ఎంఎన్‌డీ ఫరూఖ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మూసీలో వేల క్యూసెక్కుల వరద వస్తుందనే రికార్డులు ఉండగా... కేవలం పది మీటర్ల సెంట్రల్ ఛానెల్‌ను నిర్మించి అందులోకి వరదను మళ్లిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదించడంపై తాము ఆయన ముందే నవ్వి మౌనంగా వచ్చామని సామాజిక కార్యకర్త ఒకరు తెలిపారు. అందుకు ఆ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు హౌస్ కమిటీకి కూడా డిమాండు చేశాయి. కాంగ్రెస్ తరపున ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీజేపీ తరపున అప్పటి బీజేఎల్పీ నేత, ప్రస్తుత త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మూసీ సుందరీకరణ పనుల్లో అవినీతి, ఇతరత్రా అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలక్రమేణా సుందరీకరణ ప్రాజెక్టు తెరమరుగైంది.

మూసీ వయా అమరావతి!

మూసీ రివర్ డెవపల్‌మెంట్ ప్రాజెక్టుకు మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతను మూడు కన్సల్టెన్సీల కన్సార్షియంకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 4వ తేదీన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిశోర్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ప్రతిపాదన మేరకు మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్‌తో పాటు కుష్మన్ వేక్ ఫీల్డ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఆర్ఐవోఎస్ డిజైన్ స్టూడియోస్ ప్రైవేటు లిమిటెడ్ అనే మూడు కన్సల్టెన్సీ కంపెనీల కన్సార్టియంకు బాధ్యత అప్పగించేందుకు పాలనా అనుమతినిస్తూ కన్సార్టియంతో ఒప్పందానికి కూడా ఆమోదం తెలిపింది. ఇందుకుగాను కన్సార్టియంకు రూ.166.48 కోట్లు (రూ.25.40 కోట్ల జీఎస్టీతో కలుపుకొని) చెల్లించనున్నట్టు అందులో పేర్కొన్నారు. ప్రధానమైన మెయిన్‌హార్ట్ కంపెనీలో కీలకమైన భాగస్వామి సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్. తమిళనాడుకు చెందిన ఈయన అమరావతి రాజధాని గ్రాఫిక్ డిజైన్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. అంటే ఏపీ సీఎం చంద్రబాబుకు ఈశ్వరన్ అత్యంత సన్నిహితుడనేది బహిరంగ రహస్యం. అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జి (మెయిన్‌హార్ట్ అనుబంధ సంస్థ)కు అప్పగించింది. ఈ సంస్థలో ప్రధాన పెట్టుబడిదారు, డైరెక్టర్ ఈశ్వరన్. ఈయనకు మెయిన్‌హార్ట్‌లో కూడా ప్రధాన వాటాలున్నాయి.

వైఎస్ హయాంలో సేవ్ మూసీ

ఉమ్మడి ఏపీలో 2004 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ 'సేవ్ మూసీ' పేరిట 2005లో ప్రాజెక్టును చేపట్టింది. ఇదే విషయాన్ని ఇటీవల కేవీపీ కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 908 కోట్లతో పథకాన్ని ప్రారంభించినప్పటికీ అప్పుడు ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్య అంశాల దృష్ట్యా దీనిపై పెద్దగా దృష్టిసారించలేదని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ వల్ల నష్టపోయే ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి సంతృప్తికరంగా నష్టపరిహారం చెల్లించాలంటే భారీ మొత్తం నిధులు అవసరమవుతున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని పేర్కొన్నారు. ముఖ్యంగా తొలుత మూసీ నది ప్రక్షాళన, ఆపై సుందీరకరణ ప్రాజెక్టును రెండో దశలో చేపట్టాలని కూడా కేవీపీ సూచించారు. గతంలోని వైఎస్ సర్కారు కూడా ప్రక్షాళనపైనే నిధులు వెచ్చించింది. అంబర్‌పేట, నాగోల్, అత్తాపూర్ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించింది.

అప్పుడు బాబు.. ఇప్పుడు ఆర్‌బీ-ఎక్స్

మూసీ సుందరీకరణ పేరు 1999లో తెరపైకి రాగా అప్పట్లో మూసీ పరీవాహక ప్రాంత ప్రజల కంటి మీద కునుకు లేకుండా పోయిందని నగరానికి చెందిన పలువురు హక్కుల నేతలు గుర్తు చేసుకున్నారు.

కేసీఆర్ హయాంలో విజయవంతంగా ప్రక్షాళన

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఒక రోజు, ఒక ఏడాదిలో మూసీ మురుగుగా మారలేదు. ఆరు దశాబ్దాల కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే మూసీ మురికికూపంలా మారింది. రాత్రికి రాత్రి మూసీ సుందరీకరణ పూర్తవదనే కేసీఆర్ ప్రభుత్వం అంచెలంచెలుగా ప్రణాళిక రూపొందించింది. భారీ ఎత్తున మురుగునీటి శుద్ధి కేంద్రాలను చేపట్టిం ది. తెలంగాణ ఏర్పడే నాటికి నగరంలో రోజుకు 1950 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుంటే అందులో కేవలం 772 మిలియన్ లీటర్లు మాత్రమే శుద్ధి అవుతుంది. మిగిలిన 1178 మిలియన్ లీటర్లు రోజూ మూసీలో కలుస్తుంది. అందుకే కేసీఆర్ ప్రభుత్వం 3866 కోట్లతో 31 శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టింది. గత డిసెంబరు వరకు పనులు శరవేగంగా జరిగాయి. అందులో 6 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. గత 10 నెలలుగా రేవంత్‌ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే వంద శాతం మురుగు శుద్ధి జరుగుతుంది. రేవంత్ ప్రభుత్వం ఇలాంటి కీలక అంశాలపై దృష్టిసారించకుండా రాత్రికి రాత్రి బుల్డోజర్లతో నిరుపేదల ఇండ్ల కూల్చివేతలను భుజాన వేసుకుంది.

మూసీ లెక్కలకే ఢిల్లీకి!

పాలన గాలికొదిలి సీటు కోసం ఢిల్లీ టూర్లు

- ఢిల్లీ పర్యటనలతో రాష్ట్రానికి తెచ్చిందెంత?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు
- ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీ
- హైడ్రా హైరానాతో రియల్ ఎస్టేట్ కుదేలు
- తెలంగాణను ఏంజేద్దామనుకుంటున్నవ్?
- సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టు మూటల లెక్కలు చెప్పేందుకే ముఖ్యమంత్రి హస్తిన పర్యటనలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పేదల గూడు చెదరగొట్టేందుకు ఢిల్లీలోని తన బాస్‌లతో మంతనాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలతో ప్రజలకు ఏం ప్రయోజనం ఒనగూరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం పది నెలల్లోనే 24 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం, రాష్ట్ర ప్రజలకు ఏ మేరకు లబ్ధిచేకూర్చారో? చెప్పాలని నిలదీశారు. రేవంత్‌రెడ్డి అత్యధికసార్లు ఢిల్లీ పర్యటన చేసిన ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దేవాచేశారు.

గులాంగిరీ తప్పదని ముందే చెప్పినం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఢిల్లీకి గులాంగిరీ తప్పదని తాము ఎన్నికలకు ముందే చెప్పామని, ఇప్పుడు అదే జరుగుతున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. ఢిల్లీ బాసులకు ఎప్పుడు గుర్తొస్తే అప్పుడు ముఖ్యమంత్రి జీ హుజూర్ అంటూ హస్తినకు వెళ్తన్నారని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల ముందు తాకట్టు పెట్టడమేనంటూ నిప్పులు చెరిగారు. మొదట్లో సీఎం ఢిల్లీ పర్యటనలపై విమర్శలు రావటంతో ఇప్పుడు తెలివిగా కేంద్ర పెద్దలను కలిసి రాష్ట్రానికి నిధులు తెచ్చేందుకని నమ్మబలుకుతున్నారని మండిపడ్డారు. ఎంత మంది కేంద్రం పెద్దలను కలిసి రాష్ట్రానికి ఎన్నివేల కోట్లు తెచ్చారో చెప్పాలని, రేవంత్ బడే భాయ్ మోదీని ఒప్పించి ఎన్ని వేల కోట్లు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

> మూసీలో కొల్లగొట్టే వేలకోట్ల రూపాయల లెక్క చెప్పేందుకే సీఎం ఢిల్లీ వెళ్లారు. పేదల గూడు కూల్చేందుకు రాహుల్ గాంధీ, అధిష్ఠానంతో రేవంత్ చర్చలు జరుపుతున్నారు.. ప్రజలకు మంచి చేయటం కన్నా ఢిల్లీ బాసులకు జై కొడితే తన సీటుకు ఎలాంటి ఢోకా ఉండదనే చక్కర్లు కొడుతున్నారు. - కేటీఆర్

ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోకస్

రేవంత్‌రెడ్డి తన ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీపై ఫోకస్ చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ బూమ్ తగ్గిపోవటానికి ఫోర్త్‌సిటీ పేరుతో కృత్రిమ బూమ్‌ను సృష్టించడమే కారణమని ఆయన ఎక్స్‌వేదికగా ధ్వజమెత్తారు. హైడ్రా హైరానాతో రెండు నెలల్లోనే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందని, తద్వారా రిజిస్ట్రేషన్లు పడిపోయిన వైనాన్ని ఆయన ఏకరువు పెట్టారు. ఫోర్ బ్రదర్స్ సిటీపైనే ఫోకస్ చేసి, కృతిమ రియల్ బూమ్ కోసం ఆలోచిస్తున్నాడని, సామాన్యుల కొనుగోళ్లు, అమ్మకం లేనిది బూమ్ ఎట్లా వస్తది? ఆదాయం ఎట్లా పెరుగుతది? అని ప్రశ్నించారు. 'ప్రతి పథకానికి డబ్బుల్లేవని తెల్లారి లేస్తే అరిచే రేవంత్‌రెడ్డి తీరు మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె అన్నట్టు ఉన్నది' అని విమర్శించారు.

సీఎం సీటుకు ఢోకా రావద్దనే..


ప్రజల అవసరాలను పక్కనబెట్టి చీటికి మాటికి సీఎం ఢిల్లీకి వెళ్తుండటం చూస్తుంటే ప్రజలకు మంచి చేయటం కన్నా ఢిల్లీ బాసులకు జై కొడితే తన సీటుకు ఢోకా ఉండదని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. పది నెలల పాలనలో తెలంగాణలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని చెప్పారు. ఢిల్లీ హైకమాండ్ కూడా రేవంత్‌రెడ్డి పాలనపై సంతోషంగా లేనందునే పదేపదే పిలుస్తూ ఆయనకు చీవాట్లు పెడుతున్నట్టు ఉందని ఎద్దేవాచేశారు. పది నెలల్లోనే ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్తే ఏడైళ్లలో మరో 125 సార్లు వెళ్తాడు కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ప్రజలు అధికారమిచ్చింది ఢిల్లీకి గులాంగిరీ చేసేందుకు కాదని ప్రజలకు మంచి చేసేందుకనే విషయాన్ని సీఎం గుర్తించాలని హితవుపలికారు.

జనం కండ్లు 'మూసీ'..

మొదటిపేజీ తరువాయి...

చంద్రబాబు ఇప్పుడు రేవంత్ పేదల్ని బలవంతగా తరలించడం షరా మామూలే! అప్పుడూ అవినీతి ఆరోపణలు గుప్పుమనడమే కాదు ; ఏకంగా రుజువయ్యాయి. ఇప్పుడూ మూసీ భారీ స్కామ్ ముక్కుపుటాలు అదిరేలా కంపు కొడుతున్నది. ఈ పోలికలన్నీ ఇట్లా ఉంటే తాజాగా మరో అద్భుతమైన పోలిక వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే ఐదేండ్ల కింద అమరావతి ప్రాజెక్టును చేపట్టి, గ్రాఫిక్‌లతో రంగుల కలలు చూపించి, సగంలో వదిలేసిపోయిన సింగపూర్‌కు చెందిన 'మెయిన్ హార్ట్' కంపెనీయే ఇప్పుడు మూసీ కథకు అసలు కన్సల్టెంట్. ఈ మేరకు శుక్రవారమే రహస్యంగా జీవో కూడా జారీఅయ్యింది. పార్టీలేవైతేనేం? మనుషులు ఎక్కడుంటేనేం? మనసులు కలిస్తే సరిపోదా! 'బంధాల'వే కుదురుకుంటాయి. మూసీ ప్రాజెక్టు 25 ఏండ్ల తర్వాత కూడా బాబుగారు చూపిన బాటలోనే తెరమీదకు రావడం, ఐదేండ్ల క్రితం ఆయనతో సన్నిహిత సంబంధాలు నెరపిన మెయిన్ హార్ట్ కంపెనీకే ప్రాజెక్టు కన్సల్టెన్సీ బాధ్యత కూడా దక్కడం కాకతాళీయం కాదు కదా?

ఈ కుంట ఎవరి 'హస్త'గతం!



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం గ్రామంలో వడ్డర్‌వాణి కుంట ఉన్నదని ప్రస్తుతం ఈ కుంట పూర్తిగా కబ్జాకు గురైందని భట్టి చూపిన మ్యాప్ ఇది. అయితే 2014 మ్యాప్‌లో కుంటలో ఎక్కడా చుక్క నీరు కనిపించలేదు. అంటే 2014కు ముందే కుంట కబ్జాకు గురైనట్టేనని, అప్పుడు కాంగ్రెస్ పాలనే ఉండేనని నెటిజన్లు అనుకుంటున్నరు.

లేనిది ఉన్నట్టు.. భట్టి కనికట్టు!

- నీళ్లు లేని చోట చెరువులున్నట్టు ప్రజెంటేషన్
- 2014 తర్వాత 20, 1956-2014 మధ్య 225 చెరువులు కబ్జా అయినట్టు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : 'ఆల్ జీబ్రా.. అబ్రక దబ్రా' అన్నట్టు ఉన్నది సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన చెరువుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్! లేని చెరువులను ఉన్నట్టు చూపి.. అవీ కాంగ్రెస్ హయాంలోనే కబ్జాకు గురైనట్టు పరోక్షంగా చూపి అభాసుపాలయ్యారు. బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువులు ఎక్కువ కబ్జా అయ్యాయనే నెపం వేసే క్రమంలో 2014 కంటే ముందు, ఎక్కువ సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతల కబ్జాలనే తాను విడుదల చేసిన రిపోర్టు ద్వారా బహిర్గతం చేశారు. దీంతో సోషల్ మీడియాలో 'కబ్జాల కాంగ్రెస్' అంటూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల కబ్జా గురించి భట్టి మాట్లాడుతూ 2014 తర్వాత 20 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, 1956 నుంచి 2014 వరకూ హైదరాబాద్‌లో 225 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని చెప్పారు. 1956 నుంచి 2014 వరకు ఎక్కువ కాలం అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే కదా? అని విశ్లేషకులు నొక్కిచెప్తున్నారు.

కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే..

భట్టి విడుదల చేసిన రిపోర్ట్ చూస్తుంటే కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ఎక్కువశాతం చెరువులు కబ్జా అయినట్టు స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఆ రెండు పార్టీల పాలనలోనే సుమారు 10 రెట్ల ఆక్రమణలు జరిగినట్టు భట్టి రిపోర్టు ద్వారా తెలుస్తున్నదని అంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆక్రమణకు గురైనట్టు చెప్తున్న చిత్రాల్లో కొన్నింట్లో చెరువుల ఉనికే లేదని అంటున్నారు. చిన్న నీటి కుంటలను కూడా పెద్ద సరస్సులుగా చూపినట్టు స్పష్టంగా అర్థమవుతున్నదని అంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ సెల్ఫ్‌డబ్బా కొట్టుకోవడంలోనే నిమగ్నమైందని, లేని చెరువులను చూపి అవి కబ్జా అయ్యాయని చెప్పే ప్రయత్నం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేస్తున్నారు.

భట్టి 'సినిమా' అట్టర్ ఫ్లాప్!

- హైడ్రా, మూసీపై మంత్రి భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- లండన్, జపాన్ నదుల వీడియోల ప్రదర్శన
- విలేకరుల ప్రశ్నలకు ఎదురు ప్రశ్నే సమాధానం



హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): హైడ్రా, మూసీ నది వివాదంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సచివాలయంలో సినిమా స్టైల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా నగరంలో ఎన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయి, లండన్, జపాన్ నగరాల్లోని నదులు ఏ విధంగా ఉన్నాయో చూపించారు. అయితే, ఈ సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన ఈ సమావేశం ఎందుకు పెట్టారు. సినిమా ఎందుకు ప్రదర్శించారు. జనాలకు ఏం చెప్పదలుచుకున్నారనే సందేహాలు సమావేశానికి హాజరైన విలేకరులను పీడించాయి. కొద్ది రోజులుగా డిప్యూటీ సీఎం విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా మూసీ, హైడ్రాపై మాట్లాడలేకపోయారు. ఇప్పుడు స్వదేశానికి వచ్చిన ఆయన.. తాను కూడా ఏదో ఒకటి మాట్లాడాలనే ఉద్దేశంతో విలేకరుల సమావేశం నిర్వహించినట్టుగా ఉంది తప్ప, ఎలాంటి కొత్త విషయం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు విలేకరులు సంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానం దాటవేశారు.

ప్రశ్న: మీరు చూపించిన లండన్‌లోని థేమ్స్, జపాన్‌లోని యోడా, సుమిధ నదులకు అనుకునే పెద్ద పెద్ద బిల్డింగ్‌లు ఉన్నాయి. మరి అక్కడ ఇండ్లను కూల్చనప్పుడు ఇక్కడ మూసీ నది కోసం ఎందుకు ఇండ్లను కూల్చుతున్నారు.

మంత్రి: కాలక్రమంలో అలా జరుగుతుంటాయి.

హైడ్రా కూల్చివేతలు ఆగుతాయా? కొనసాగుతాయా?

ఏం చేస్తే బాగుంటుందో మీరే చెప్పండి.

మీరు చూపించిన శాటిలైట్ మ్యాప్‌ల ప్రకారం కబ్జా అయిన చెరువుల్లోని మొత్తం నిర్మాణాలను కూల్చివేస్తారా..?

ఏం చేయాలో మీరే చెప్పండి.

మీరు ప్రదర్శించిన చెరువుల మ్యాప్‌ను అధికారికంగా పరిగణించవచ్చా?

సమాధానం కరువు

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లను కూల్చివేస్తామని హైడ్రా చెప్తున్నది. మీరేమో బఫర్ జోన్ జోలికి వెళ్లడం లేదంటున్నారు. ఏది నిజం.

సమాధానం దాటవేత

పెద్ద పెద్ద వాళ్లు బఫర్ జోన్‌లో ఇండ్లు నిర్మించుకున్నట్టు ఆరోపణలున్న గండిపేట, హిమాయత్‌సాగర్, సకాలం చెరువుల్లోనూ ఆక్రమణలు గుర్తించారా?

అన్ని చెరువుల్లోని ఆక్రమణలను గుర్తించాం.

మీరేమో అసలు అంచనాలే సిద్ధం చేయనప్పుడు మూసీ ప్రాజెక్టుకు రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అని ఎవరు చెప్పారని అంటున్నారు. కానీ, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో ఎవరి మాట నిజం?

ఏదో ఓరల్‌గా చెప్పినవి కుదరవు. ఆధారాలు లేకుండా మాట్లాడొద్దు. ఇంకా మేం అంచనాలనే సిద్ధం చేయలేదు.

మూసీ సుందరీకరణకు టెండర్లు ఖరారు కాలేదని మీరంటున్నారు. కానీ ఎంఏయూడీ కార్యదర్శి టెండర్లు పూర్తయ్యాయని, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని చెప్తున్నారు.

అధికారులు చెప్పింది వేరే అంశం గురించి కావొచ్చు. మూసీ సుందరీకరణను ఎలా చేయాలనే దానిపైనే ఇంకా టెండర్ వేయలేదు. అప్పుడే పనులు ఎలా ప్రారంభిస్తారు.

కాంగ్రెస్ పాలనలోనూ చెరువుల ఆక్రమణలు

- 2014కు ముందు కూడా ఆక్రమణలు
- ప్రస్తుతానికి ఎఫ్టీఎల్‌పైనే దృష్టి
- 'మూసీ' బడ్జెట్1.5 లక్షల కోట్లు కాదు
- ఇప్పటి వరకు టెండర్లే పిలవలేదు
- డిప్యూటీ సీఎం భట్టి స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): 2014కు ముందు కూడా హైదరాబాద్‌లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ పాలనలో చెరువులు ఆక్రమణకు గురైనట్టుగా ఆయన పరోక్షంగా అంగీకరించారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైడ్రా, మూసీ వివాదంపై స్పందించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ట్రాక్ సెంటర్‌తో కలిసి నగరంలో చెరువులు ఏ విధంగా కబ్జా అయ్యాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్‌లో 920 చెరువులు ఉండగా రాష్ట్ర ఏర్పాటు తర్వాత 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, 196 చెరువులు కొంత వరకు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. మిగిలిన 499 చెరువులు సురక్షితంగా ఉన్నట్టు చెప్పారు. 2014కు ముందు రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. అందుకే కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చెరువులన్నీ కబ్జా అవుతున్నాయని, వీటిని కాపాడుకోకుంటే అందరికీ నష్టమని వివరించారు. ప్రస్తుతానికి తమ ప్రభుత్వం కేవలం చెరువుల ఎఫ్‌టీఎల్‌పైనే దృష్టి పెట్టిందని, ఇంకా బఫర్ జోన్ జోలికి పోవడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ బఫర్ జోన్ జోలికి వెళితే ఇంకా ఎక్కువ కూల్చివేతలు ఉంటాయనే సంకేతాలు ఇచ్చారు. మూసీ సుందరీకరణకు రూ. 1.5 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అంత బడ్జెట్ అని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు మూసీ సుందరీకరణకు టెండర్లే పిలవలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మూసీ బాధితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయబోమని, వారికి అక్కడే ఇండ్లు కట్టించే ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. తమది ప్రజల ప్రభుత్వమని, కూల్చివేతలు ఎవరికీ ఇష్టం ఉండవని అన్నారు. మూసీ ప్రాజెక్టు సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఎజెండా కాదని భట్టి స్పష్టం చేశారు.

మూసీ పరీవాహక ఎమ్మెల్యేలతో దక్షిణ కొరియాకు మంత్రులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబరు 7 (నమస్తే తెలంగాణ) : మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లతో కూడిన నగర ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, అధికారుల బృందం దక్షిణ కొరియాకు వెళ్లనున్నది. మూసీ పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, ఇతర అధికారులతో మంత్రులు దక్షిణ కొరియాలోని చియోంగేచియోన్ స్ట్రీమ్ పునరుద్ధరణ ప్రాజెక్టును సందర్శించనున్నారు. దక్షిణ కొరియాలోని సియోల్ మధ్యలో 5.84 కిలోమీటర్ల మేర చియోంగేచియోన్ స్ట్రీమ్ ప్రాజెక్టును తీర్చిదిద్దారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు 15 మందితో కూడిన బృందం ఈ నెల 21 నుంచి 26 వరకు దక్షిణ కొరియాలో పర్యటించనున్నది.

కూల్చివేతలు తక్షణం ఆపాలి

సీఎంకు దాసోజు శ్రవణ్ లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులందరికీ సోమవారం ఆయన లేఖ రాశారు. సరైన పరిహారం, కనీస సంప్రదింపులు లేకుండా బలవంతంగా ఖాళీ చేయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. కూల్చివేతలు సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వానికి పరాకాష్టగా అని అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌ను అనుసరించి బుల్డోజర్‌రాజ్‌ను తెలంగాణలోకి తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. కూల్చివేతలను ఆపాలని, జీవో 477ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంది ఓ మాట.. డిప్యూటీ సీఎందీ మరో మాట

హైడ్రా, మూసీపై తలో మాట

ఇద్దరి మధ్య సమన్వయం కరువు?

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ, హైడ్రాపై సీఎం రేవంత్‌రెడ్డిది ఒక మాటైతే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో మాట మాట్లాడుతున్నారు. ఒకే అంశంపై వీరిద్దరు తలో మాట మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మధ్య సమన్వయం కరువైందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం హైడ్రా, మూసీపై మీడియా సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు భిన్నంగా చెప్పడం గమనార్హం.

రేవంత్‌రెడ్డి: జూలై 20న గోపాన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రూ. 1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణను చేపట్టనున్నాం. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీని ప్రక్షాళన చేస్తాం' అని తెలిపారు.

> **భట్టి విక్రమార్క:** మూసీ సుందరీకరణకు అసలు డీపీఆర్ సిద్ధం కాకుండా, అంచనాలు వేయకుండా రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. అసలు మూసీ సుందరీకరణ బడ్జెట్ రూ.1.5 లక్షల కోట్లు అని ఎవరు చెప్పారు?

రేవంత్‌రెడ్డి: హైడ్రా కూల్చివేతలు కొనసాగుతాయి.

> **భట్టి విక్రమార్క:** బఫర్ జోన్‌లోని ఇండ్ల జోలికి మేం వెళ్లడం లేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వాటిపై మాత్రమే దృష్టిపెట్టినం.

రేవంత్‌రెడ్డి: మూసీ నిర్వాసితులను అక్కడి నుంచి తరలించి వేరే చోట డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తాం.

> **భట్టి విక్రమార్క:** మూసీ నిర్వాసితులకు అక్కడే సొంతంగా ఇండ్లు కట్టించే ఆలోచన చేస్తున్నాం.

రేవంత్‌రెడ్డి: మూసీ నిర్వాసితులపై ఇప్పటికే సర్వే చేశాం. వారిని తరలిస్తున్నాం.

> **భట్టి విక్రమార్క:** మూసీ నిర్వాసితులకు సంబంధించి ఇంకా సర్వే చేస్తున్నాం. ఇప్పుడే ఎవర్నీ తరలించడం లేదు.

సూర్య ఇంటెన్స్ అవతార్..



తమిళ హీరో సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతోన్న 'సూర్య44'(వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ పూర్తి చేసుకున్నది. సూర్య పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూర్య ఫ్రెంచ్ గడ్డంతో, ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ఇది మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ అని ఈ గ్లింప్స్ చెబుతున్నది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నవి. త్వరలో ప్రమోషన్స్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. సూర్య, జ్యోతిక ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మాస్ ఎంటర్టైనర్‌లో పూజా హెగ్డే కథానాయిక. జయరామ్, కరుణాకరన్, జోజు జార్జ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్ కృష్ణ, సంగీతం: సంతోష్ నారాయణన్, సహనిర్మాతలు: రాజశేఖర్ కర్పూర సుందరపాండియన్, కార్తికేయ సంతానం, నిర్మాణం: 2డి ఎంటర్టైన్మెంట్స్.

అమ్మ దాన్ని డీయాక్టివేట్ చేసింది



'కంట్రోల్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీబిజీగా గడుపుతున్నది బాలీవుడ్ భామ అనన్య పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నటిగా తన మనసులోని కోరికలను బయటపెట్టింది అనన్య. 'కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకూ చాలా జానర్లలో నటించాను. కానీ రొమాంటిక్ సినిమాలు, హారర్ సినిమాలు, బయోపిక్‌లు ఇప్పటివరకూ చేయలేదు. ఆ తరహా కథలు వస్తే మాత్రం వదులుకోను. అలాగే.. కరణ్‌జోహార్ 'రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ' సినిమాలో ఓ చిన్న పాత్ర చేశాను. అలా కాకుండా ఆయన దర్శకత్వంలో పూర్తిస్థాయి హీరోయిన్‌గా నటించాలని ఉంది. బాలీవుడ్‌లో నాకిష్టమైన డైరెక్టర్ సంజయ్‌లీలా బన్సాలీ. ఆయన సినిమాలో ఛాన్స్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నా. మరి ఈ కోరికలన్నీ ఎప్పటికి తీరతాయో చూడాలి. ప్రస్తుతానికైతే కెరీర్ పరంగా బిజీగా ఉన్నా.' అని చెప్పింది అనన్య. ఇంకా తన సోషల్ మీడియా అకౌంట్ గురించి కూడా మాట్లాడుతూ 'చిన్నప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్ ఓపెన్ చేస్తే మా అమ్మ దాన్ని డీయాక్టివేట్ చేసింది. 18ఏండ్లు నిండాక మళ్లీ సోషల్‌మీడియాలోకి వచ్చాను. సమయం దొరికినప్పుడు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో అభిప్రాయాలు పంచుకుంటూ ఉంటా.' అని చెప్పింది

పరశురామ్ దర్శకత్వంలో?



టిల్లూ ఫ్రాంచైజీతో ఒక్కసారిగా స్టార్ హీరోల జాబితాలో చేరిపోయాడు సిద్ధూ జొన్నలగడ్డ. ముఖ్యంగా 'టిల్లూ స్క్వేర్' చిత్రంతో వందకోట్ల హీరోగా అవతరించాడు తను. ప్రస్తుతం బొమ్మరిల్లు భాస్కర్ సినిమాతోపాటు నీరజ కోన దర్శకత్వంలో 'తెలుసుకదా' అనే సినిమా చేస్తున్నాడు సిద్ధు.వీటి తర్వాత 'టిల్లూ క్యూబ్' కూడా ఉంటుందని ఆయన ఇండైరెక్ట్‌గా మీడియాకు హింట్ కూడా ఇచ్చారు. ఇది లావుంటే.. సిద్ధూ కథానాయకుడిగా ఓ క్రేజీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనున్నట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్త బలంగా వినిపిస్తున్నది. ఈ సినిమాకు పరశురామ్ దర్శకత్వం వహిస్తారట. దిల్‌రాజు బ్యానర్‌లో ఈ సినిమా రూపొందే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. సిద్ధుతో ఓ సినిమా చేస్తానని దిల్‌రాజు ఇప్పటికే ప్రకటించి ఉన్నారు. ఆ సినిమా ఇదేనని టాక్. ప్రస్తుతం సిద్ధు చేస్తున్న రెండు సినిమాల షూటింగులు పూర్తయ్యాక, ఈ సినిమా సెట్స్‌కి వెళ్తుందట. ఈ సినిమా తర్వాత 'టిల్లూ క్యూబ్' ఉంటుందని తెలుస్తున్నది.



మనసారా నవ్వించే సినిమా

'సుహాస్ ఒకప్పుడు మీలో ఒకడు. ఇప్పుడు ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగాడు. యంగ్‌స్టర్స్ పని చేసిన ఈ సినిమా పెద్ద హిట్ కాబోతున్నది. మనసారా నవ్వుకునేలా సినిమా ఉంటుంది.' అని దిల్‌రాజు అన్నారు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై శిరీష్ సమర్పణలో సుహాస్, సంగీర్తన జంటగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, హన్షితరెడ్డి నిర్మాతలు. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దిల్‌రాజు మాట్లాడారు. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. అవకాశం ఇచ్చిన దిల్‌రాజుకూ, హీరో సుహాస్‌కు దర్శకుడు సందీప్‌రెడ్డి బండ్ల కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ సినిమాపై నమ్మకంతో డిస్ట్రిబ్యూటర్‌గా మారాను. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నా. ఇంతమంచి సినిమాలో, అద్భుతమైన పాత్ర ఇచ్చి పోత్సహించిన దర్శక,నిర్మాతలకు థ్యాంక్స్.' అని సుహాస్ చెప్పారు. ఇంకా కథానాయిక సంగీర్తన కూడా మాట్లాడారు.

మనందరి సూపర్‌హీరో నాన్న!



'ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం సహజంగా అనిపిస్తుంది. కథ మొత్తం ఫాదర్ సెంటిమెంట్‌తో ముడిపడి ఉంటుంది. నా కెరీర్‌లో బాగా సంతృప్తినిచ్చిన చిత్రమిది' అన్నారు సుధీర్ బాబు. ఆయన హీరోగా అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మించిన 'మా నాన్న సూపర్‌హీరో' చిత్రం ఈ నెల 11న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ 'కన్న తండ్రి, పెంపుడు తండ్రి, ఒక కొడుకు చుట్టూ భావోద్వేగభరితంగా నడిచే కథ ఇది. యూనివర్సల్ పాయింట్ కాబట్టి అందరికి కనెక్ట్ అవుతుంది. మానవ సంబంధాల్లోని గాఢతను ఆవిష్కరిస్తుంది. మనందరి జీవితాల్లో సూపర్ హీరో నాన్నే. ఈ కథలో హీరో తండ్రిని ఎంతగానో ప్రేమిస్తుంటాడు. అతనే సర్వస్వంగా బతుకుతుంటాడు. ఈ క్రమంలో అతని జీవిత ప్రయాణం ఎలా సాగిందన్నది కథలో ఆసక్తిని పంచుతుంది. ఈ సినిమాలోని ఎమోషన్స్ ప్రతి ఒక్కరిని కదిలిస్తాయి' అన్నారు. మహేష్‌బాబు ఈ సినిమా టీజర్ చూసి ఎంతగానో ప్రశంసించారని, హార్ట్‌టచింగ్‌గా ఉందన్నారని సుధీర్‌బాబు తెలిపారు.మనసుకు నచ్చిన కథలతో సినిమాలు చేస్తున్నానని, ప్రస్తుతం 'జటాధరా' షూటింగ్ జరుగుతున్నదని, రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుందని సుధీర్‌బాబు పేర్కొన్నారు.



ఎర్రగుడి నేపథ్యంలో..

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకుడు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం మంచు లక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ '1974-90 మధ్యకాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఎర్రగుడి నేపథ్యంలో దైవానికి, దుష్టశక్తికి మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా. గ్రాఫిక్స్ ప్రధానాకర్షణగా నిలుస్తాయి. మంచు లక్ష్మి పాత్ర సరికొత్త పంథాలో ఉంటుంది' అన్నారు. ఆదిత్య ఓం, ఎస్తేర్, సుహాసిని, శ్రీజిత ఘోష్, శివ కంఠమనేని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాణం: అన్వికా ఆర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్, రచన-దర్శకత్వం: సంజీవ్ మేగోటి.



హే రంగులే..

శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకుడు. కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మాతలు. ఈ సినిమాలోని 'హే రంగులే..' అనే గీతాన్ని సోమవారం హీరో నితిన్ విడుదల చేశారు. జీవీ ప్రకాష్ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రచించారు. అనురాగ్ కులకర్ణి, రమ్య బెహరా ఆలపించారు. ఈ పాటలో నాయకనాయికల మధ్య ఉన్న ప్రణయబంధాన్ని, వారి జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరించారు. విజువల్స్ కట్టిపడేసేలా ఉన్నాయి. 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దేశభక్తి, ప్రేమ, త్యాగం అంశాల నేపథ్యంలో ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే చిత్రమిదని, దీపావళి సందర్భంగా ఈ నెల 31న విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని శ్రేష్ట్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి విడుదల చేస్తున్నారు.

పొట్టేల్ నేపథ్యంలో



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్ చేస్తున్న చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్ఖూరి దర్శకుడు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్‌కుమార్ సడిగె నిర్మాతలు. ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని సోమవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా రిలీజ్‌డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల, వారితోపాటు ఓ పాప ఉన్నారు. మరో పార్ట్‌లో హీరోని గ్రామస్తులు వెంబడిస్తున్నట్టు కనిపిస్తున్నది. మొత్తంగా కథలోని ఉద్వేగాన్ని పోస్టర్ ఆవిష్కరించిందని చెప్పొచ్చు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు, సంగీతం: శేఖర్ చంద్ర, నిర్మాణం: నిసా ఎంటర్టైన్మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్.

నిలువెల్లా పూనకమై ఆడు..

కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీరామ్ హీరోయిన్లు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌ని సుజీత్, సందీప్ కలిసి దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాణం తుదిదశకు చేరుకుంది. త్వరలోనే తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలో సినిమా విడుదల కానుంది. ఈ సినిమా మలయాళ వెర్షన్‌ని హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిల్మ్స్ సంస్థ ద్వారా విడుదల చేయబోతుండటం విశేషం. సోమవారం ఈ సినిమా నుంచి జాతర నేపథ్యంలో సాగే మాస్ పాటను మేకర్స్ విడుదల చేశారు. ' ఆడు ఆడు ఆడు ఆడు నిలువెల్లా పునకమై ఆడు..' అంటూ సాగే ఈ పాటను సనాపాటి భరద్వాజ్ రాయగా, సామ్ సీఎస్ స్వరపరచి, దివాకర్, అభిషేక్ ఏఆర్‌తో కలిసి ఆలపించారు. పొలాకి విజయ్ కొరియోగ్రఫీ అందించారు. ఈ పాటలో కిరణ్ అబ్బవరం స్టెప్పులు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. కథానాయికలు తన్వీరామ్, నయన్ సారిక కూడా ఈ పాటలో నర్తించారని, ఈ పాటతో థియేటర్లన్నీ జాతరని తలపిస్తాయని మేకర్స్ నమ్మకంగా చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: విశ్వాస్ డానియేల్, సతీష్‌రెడ్డి మాసం, సమర్పణ: చింతా వరలక్ష్మి, నిర్మాణం: శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్.





వాస్తవ ఘటనల యుఫోరియా

గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'యుఫోరియా'. విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన తారాగణం. భూమిక ముఖ్య పాత్రను పోషించింది. నీలిమ గుణ నిర్మాత. సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాతలు దిల్‌రాజు, కె.ఎల్.దామోదరప్రసాద్ రిలీజ్ చేశారు. నేటి యువతకు కనెక్ట్ అయ్యేలా గ్లింప్స్ అదిరిపోయిందని దిల్‌రాజు అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ 'అంతా కొత్తవారితో ఈ సినిమా తీశా. రెండు సంఘటనలు నన్ను బాగా కదలించాయి. వాటి ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. అలాంటి ఘటనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటి ట్రెండ్ తగినట్లుగా కథ నడుస్తుంది. ప్రతీ సన్నివేశం రియలిస్టిక్‌గా ఉంటుంది. నేటి యువతకు, వారి పేరెంట్స్‌కు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో కథ నడుస్తుంది' అన్నారు. థియేటర్ ఆర్టిస్టుల్ని ఈ సినిమా కోసం తీసుకున్నామని నిర్మాత నీలిమ గుణ పేర్కొంది.

రామాయణ స్ఫూర్తితో 'సింగమ్ ఎగైన్'



బాలీవుడ్ కాప్ యాక్షన్ 'సింగమ్' ఫ్రాంఛైజీకి దేశవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ సిరీస్ నుంచి వస్తున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. రోహిత్‌శెట్టి దర్శకత్వంలో అజయ్ దేవ్‌గణ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో అక్షయ్‌కుమార్, రణ్‌వీర్‌సింగ్, టైగర్‌ష్రాఫ్, దీపికా పడుకోన్, కరీనాకపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. నవంబర్ 1న విడుదలకానుంది. సోమవారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. భారీ ఛేజింగ్, యాక్షన్ హంగులతో ట్రైలర్ ఆద్యంతం రోమాంచితంగా సాగింది. ఈ యాక్షన్ ప్యాక్ట్ ఎంటర్‌టైనర్‌లో అజయ్‌దేవ్‌గణ్ పోలీసాఫీసర్ బాజీరావ్ సింగమ్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. అర్జున్ కపూర్ ప్రతినాయకుడు డేంజర్ లంకగా కనిపించారు. రామాయణం స్ఫూర్తితో ఈ ఫ్రాంఛైజీలోని రణ్‌వీర్‌సింగ్ , టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్ పాత్రలను డిజైన్ చేసిన విధానం ఆకట్టుకుంది. లేడీ సింగమ్ పాత్రలో దీపికా పడుకోన్ కనిపించింది. ఇప్పటికే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



మహాలక్ష్మీదేవి

నేటి అలంకారం

సరసిజ నయనే సరోజహస్తే ధవళ తరాంశుక గంధమాల్య శోభే।
భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువన భూతికరి ప్రసీదమహ్యామ్॥

సిరిసంపదలు, సంతానం, సౌభాగ్యం, ధైర్య సాహసాలు, విజయాలు ప్రసాదించే దేవత శ్రీమహాలక్ష్మి. సకల లోకాలకు ఈమె ఐశ్వర్య ప్రదాత. ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా, రెండు చేతుల్లో కమలాలు ధరించి, అభయ, వరద ముద్రలతో భక్తులకు దర్శనమిస్తుంది. త్రిపురాత్రయంలో ఈమె మధ్యశక్తి. శ్రీసూక్తం లక్ష్మీదేవి వైభవాన్ని ఎంతగానో ప్రకటిస్తుంది. అగ్ని, మత్స్య పురాణాలు లక్ష్మీదేవి ఆకృతి, శిల్ప నిర్మాణ నియమాలను వివరంగా చెబుతున్నాయి. అష్టలక్ష్ములకూ అధిష్ఠాన దేవత ఈమె. మహాలక్ష్మి ఉపాసనతో లౌకిక సంపదతోపాటు అలౌకికమైన మోక్షసంపద కూడా లభిస్తుంది. శ్రీసూక్త విధానంగా ఎర్రని పుష్పాలతో, లక్ష్మీ అష్టోత్తర నామాలతో అర్చించి, పూర్ణాలు నివేదన చేయాలి. అమ్మకు ప్రీతిగా సువాసినీ పూజ చేయాలి.

వేపకాయల బతుకమ్మ

ఇవాళ్టి బతుకమ్మ

తెలంగాణ పిండివంటల్లో సకినాలు ప్రత్యేకమైనవి. వేర్వేరు ప్రాంతాల్లో వీటిని వండుకున్నా.. ఇక్కడ చేసినంత రుచిగా మరెక్కడా కుదరవు. కొన్ని ప్రాంతాల్లో అయితే ఈ పిండి వంటకం గురించి తెలియదన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. బియ్యం పిండి, నువ్వులు, ఓమ, ఉప్పు వేసి తగిన మోతాదులో నీళ్లు కలిపి పిండిని తయారుచేస్తారు. పిండిని చేతుల్లోకి తీసుకొని అందంగా చుడతారు. సకినాలు చుట్టడం ఒక కళ. అది అందరికీ సాధ్యమయ్యేది కాదు. సకినాలు చుట్టడం వచ్చిన వారికి చుట్టాలు, పక్కాలు తెగ మర్యాదలు చేస్తుంటారు. 'సకినాలు చేస్తున్నాం వదినా! మీరు వస్తేనే అవుతుంది' అంటూ సగౌరవంగా ఆహ్వానిస్తారు. సకినాల మూకుడు రోజు పిల్లల సంబురం అంతా ఇంతా కాదు. పిల్లలంతా గుమిగూడి పిండి ముద్ద తీసుకొని, చిట్టి చేతులతో పాలకాయలు లేదా వేపకాయలుగా చేస్తారు. అందుకే ఇవాళ్టి బతుకమ్మను వేప (పాల)కాయల బతుకమ్మగా పిలుస్తారు. సకినాల బతుకమ్మగానూ ఆరాధిస్తారు. నూనెలో గోలించినా సకినాలకు చమురు ఎక్కువగా ఉండదు. బురబురలాడే ఈ పిండివంటకాన్ని కరకర నములుతూ ఆరగిస్తారు. ఇందులో వాడే నువ్వులు, ఓమ ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. సాయంత్రం బతుకమ్మ ఆడిన తర్వాత సకినాలను అందరూ పంచుకొని ఆ రోజుకు కమ్మని ముగింపునిస్తారు.

• డా॥ ఆర్.కమల



జిందగీ

ఊపిరి

నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 8 అక్టోబర్ 2024
www.ntnews.com



పుట్టుకతో థైరాయిడ్ సమస్య

పిల్లల పెంపకం

మా పాపకు పుట్టిన రోజే జాండిస్ ఉంది. చికిత్స చేయించాం. మూడు వారాలు గడిచినా తగ్గలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే కొన్ని పరీక్షలు చేశారు. థైరాయిడ్ సమస్య ఉందని నిర్ధారించారు. పాపకు జీవితాంతం థైరాయిడ్ మందు వాడాలని చెప్పారు. నెల వయసు బిడ్డకు థైరాయిడ్ సమస్య వస్తుందా? జీవితాంతం మందులు వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా ఉంటాయా?



మీరు చెప్పినదాన్ని బట్టి మీ బిడ్డకు పుట్టుకతోనే థైరాయిడ్ హార్మోన్‌లో లోపం ఉంది. దీనిని హైపోథైరాయిడిజం అంటారు. వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఈ సమస్య బారినపడుతుంటారు. థైరాయిడ్ సమస్యను తొందరగా గుర్తించిన వైద్యుడిని అభినందించాలి.

కామెర్ల వ్యాధి రెండు, మూడు వారాలు గడిచినా తగ్గనప్పుడు.. అది పుట్టుకతో సాధారణంగా వచ్చిన కామెర్ల వ్యాధా? లేక వేరే ఇబ్బందులు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు పరీక్షలు చేస్తారు. వాటిలో ముఖ్యమైంది థైరాయిడ్ పరీక్ష. హైపోథైరాయిడిజంతో బాధపడే పిల్లల్లో థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉండటం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల పూర్తిగా జరగదు. కాబట్టి భవిష్యత్‌లో మీ బిడ్డకు ఇబ్బందులు రావొచ్చు. కానీ, సకాలంలో వైద్యుడు ఆ సమస్యను గుర్తించడం, సరైన చికిత్స జరగడం వల్ల మీ బిడ్డకు శారీరక, మానసిక వైకల్యం కలగదు. ఈ సమస్య జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ మందులు వాడుతూ ఉండాలి. శరీరంలో ఉండాల్సిన హార్మోన్ లేకపోవడం వల్ల దానిని మందుల రూపంలో అందిస్తున్నారు. కాబట్టి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

రోజూ పెరుగు ఆరోగ్యం మెరుగు

మన రోజువారీ ఆహారంలో అనాదిగా వాడుకలో ఉన్న పాల ఉత్పత్తి పెరుగు. ఇంట్లో తోడుపెట్టుకుని తయారు చేసుకున్న పెరుగుతో శరీరానికి ఒనగూరే ప్రయోజనాలు ఎన్నో. అంతేకాదు, చర్మం, వెంట్రుకల ఆరోగ్యానికి పెరుగు గొప్ప ఉపకారి. పెరుగు రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. ఎముకలు, దంతాలను పటిష్ఠం చేస్తుంది. శరీర బరువు సమతూకంలో ఉండటానికి రోజువారీ ఆహారంలో పెరుగును భాగం చేసుకుంటే మంచిది.

పాల నుంచి వచ్చే ఉప ఉత్పత్తి పెరుగు. కాబట్టి, ఇందులో కాల్షియం, విటమిన్ బి-2, విటమిన్ బి-12, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఎన్నో అత్యవసరమైన పోషకాలు ఉంటాయి. పైగా పాలకంటే కూడా సులువుగా అరిగిపోతుంది.



సజీవ బ్యాక్టీరియా సమృద్ధంగా ఉండే పెరుగు గొప్ప ప్రొబయోటిక్ ఆహారం. ఇది మంచి బ్యాక్టీరియా కావడంతో పేగుల పనితీరు మెరుగుపడటానికి, మంటగా ఉన్న జీర్ణవ్యవస్థ చల్లబడటానికి, గడబిడగా ఉన్న కడుపును శాంతపరచడానికి ఎంతో ఉపకరిస్తుంది. పెరుగులో ఉండే సజీవ బ్యాక్టీరియా వ్యాధికారక క్రిములతో పోరాడుతుంది. అలా పొట్ట ఆరోగ్యానికి హామీగా ఉంటుంది.

పెరుగు చర్మంపై మాయిశ్చరైజింగ్ ప్రభావాన్ని చూపిస్తుంది. పొడిబారిన చర్మానికి సహజసిద్ధంగా తేమనిస్తుంది.



పొటాషియం, మెగ్నీషియం లాంటి పోషకాలు సహా పెరుగులో ఉండే ప్రత్యేకమైన ప్రొటీన్లు అధిక రక్తపోటును తగ్గించడంలో సాయపడతాయి. గుండె ఆరోగ్యానికి భరోసాను ఇస్తాయి.

శరీర బరువును తగ్గించుకునేందుకు పెరుగు రెండు విధాలుగా ఉపకరిస్తుంది. ఒకటి, రక్తంలో పేరుకుపోయిన కార్టిసోల్ స్థాయిని తగ్గిస్తుంది. మన శరీరంలో పొట్ట, గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోయేలా చేసే హార్మోన్ కార్టిసోల్. రెండోది, మనకు జంక్ ఫుడ్ అంటే ఉవ్విళ్లూరడాన్ని తగ్గిస్తుంది. అలా మన డైట్‌పై దృష్టి సారించేలా చేస్తుంది.

పెరుగులో కాల్షియం, ఫాస్ఫరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన దంతాలు, ఎముకలు దృఢంగా ఉండటానికి దోహదపడతాయి.

పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది ఫంగస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. కాబట్టి, పెరుగును హెన్నాతో కలిపి మాడుకు పట్టిస్తే చుండ్రును అరికట్టవచ్చు. అంతేకాదు పెరుగు హెయిర్ కండిషనర్‌గా కూడా పనిచేస్తుంది.

విటమిన్లు, ఖనిజ లవణాలు పెరుగులో పుష్కలం. అలా ఇది మనకు తేలిగ్గా దొరికే మంచి శక్తి వనరు. పైగా యాంటి ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోజువారీ పనిభారం నుంచి త్వరగా తేరుకునేందుకు ఉపకరిస్తుంది.

తాజా పండ్లు, లేదంటే అవిసె గింజలు, పొద్దుతిరుగుడు గింజలను కలిపిన ఒక కప్పు పెరుగు మనకు మరింత ఫైబర్, ఇతర పోషకాలను అందిస్తుంది.

పండ్లు, తరిగిన ఉల్లిపాయలు, టమాటాలు, స్మూతీలలో కలపడం, కూరలకు మంచి రంగు వచ్చేలా చేయడానికి, రోజువారీ ఉపాహారాన్ని సంపూర్ణం చేసుకోవడానికి పెరుగు మంచి ఆహార పదార్థం.

ఒళ్లు గుల్ల చేసే కీళ్లనొప్పులు

ఈ మధ్య కాలంలో కీళ్ల నొప్పులు అనే పదం చాలా మంది నోట సాధారణంగా వింటున్నాం. అదే ఓ పది పదిహేనేండ్ల కిందటైతే కేవలం 60 ఏండ్లు దాటినవారిలో మాత్రమే ఈ సమస్య కనిపించేది. కానీ అభివృద్ధికి, పెరుగుతున్న పరిజ్ఞానానికి సమాంతరంగా మనుషుల్లో అనారోగ్య సమస్యలు కూడా అధికమవుతున్నాయి. ఈ క్రమంలో ఒకప్పుడు వయసు పైబడినవారిలో కనిపించే కీళ్ల నొప్పుల సమస్య (ఆర్థరైటిస్) ఇప్పుడు 20- 40 ఏండ్లవారిలోనూ చూస్తున్నాం. అయితే, నిజానికి ఆర్థరైటిస్‌కు వయసుతో సంబంధం లేదు. ఏ వయసువారికైనా వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీన్ని దీర్ఘకాలిక వ్యాధిగా చెప్పవచ్చు. అలానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అంటూ లేదు. కానీ, సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చు.

ఒకప్పుడు ఆర్థరైటిస్‌కు చికిత్స అంతగా అందుబాటులో లేదు. అయితే, దశాబ్ద కాలం నుంచి ఆర్థరైటిస్ సమస్యలకు ప్రత్యేక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఇక మనలో చాలా మందికి కీళ్లనొప్పులను చాలా తేలిగ్గా తీసుకుంటారు. సమస్యపై అవగాహన లేక తీవ్ర అనారోగ్యాలకు గురవుతారు. అందుకని కీళ్లనొప్పుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది అక్టోబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా 'వరల్డ్ ఆర్థరైటిస్ డే'ను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ నేపథ్యంలో కీళ్లనొప్పులు ఎందుకు వస్తాయి, వాటి వల్ల కలిగే అనర్థాలేంటి, వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పద్ధతులు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాలు తదితర అంశాలను గురించి తెలుసుకుందాం.



ఆర్థరైటిస్ అంటే...

కీళ్లకు సంబంధించిన వ్యాధులను ఆర్థరైటిస్ డిసీజెస్ అంటారు. వీటిలో చాలా రకాలు ఉంటాయి. కానీ ప్రధానంగా మూడు రకాలు... సెప్టిక్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్ ఎక్కువమందిలో కనిపిస్తుంటాయి. ఇక ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్ అనేది ఈ మధ్యకాలంలో సర్వసాధారణంగా కనిపించే సమస్యగా చెప్పవచ్చు.

సెప్టిక్ ఆర్థరైటిస్

ఇన్ఫెక్షన్స్ వల్ల వచ్చే ఆర్థరైటిస్‌ను సెప్టిక్ ఆర్థరైటిస్ అంటారు. కీళ్లలో ఇన్ఫెక్షన్స్ వచ్చినప్పుడు లేదా శరీరంలో వచ్చిన ఇన్ఫెక్షన్స్ కీళ్లకు వ్యాప్తి చెందినప్పుడు సెప్టిక్ ఆర్థరైటిస్ వచ్చే అవకాశాలుంటాయి. దీని వల్ల తీవ్రమైన కీళ్లనొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఆస్టియో ఆర్థరైటిస్

వయసు రీత్యా వచ్చే కీళ్లనొప్పులను ఆస్టియో ఆర్థరైటిస్ అంటారు. ఈ సమస్య కీళ్ల అరుగుదల వల్ల తలెత్తుతుంది. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ ఎముకలు, కీళ్లు అరుగుదలకు గురవుతాయి. ఈ విధంగా కీళ్లలో అరుగుదల ఏర్పడినప్పుడు మోకాళ్ల నొప్పులు, తుంటినొప్పి, నడుం నొప్పి వంటివి బాధిస్తాయి.

ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్

కీళ్లలో వాపు వల్ల వచ్చే నొప్పులను ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్ అంటారు. ఇది స్త్రీ, పురుషులు ఇద్దరిలో వచ్చినప్పటికీ పురుషుల కంటే స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాకుండా ప్రస్తుతం వెలుగు చూస్తున్న ఆర్థరైటిస్ సమస్యల్లో ఇది సర్వ సాధారణం. ప్రతి 100 మందిలో కనీసం ఒకరు ఈ వ్యాధికి గురవుతున్నారు.

ఎందుకు వస్తాయి?

ఆటో ఇమ్యూన్ కండిషన్ వల్ల కీళ్ల వ్యాధులు వస్తాయి. అంటే శరీరంలో వ్యాధి నిరోధక శక్తికి సంబంధించిన కణాలు వ్యాధి కారకాలపై దాడి చేయడంతోపాటు మన శరీరంపై కూడా దాడి చేస్తాయి. ఎప్పుడైతే శరీరంలో ఆటో ఇమ్యూన్ కండిషన్ ఏర్పడుతుందో అప్పుడు వివిధ రకాల కీళ్ల వ్యాధులు తలెత్తుతాయి. ఇవి బయటి కారణాల వల్ల వచ్చిన వ్యాధులు కాదు. మన శరీరంలోనే పుట్టిన రుగ్మతలు. ఇందులో చాలా రకాలు ఉంటాయి. ప్రధానంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది సర్వసాధారణంగా వస్తుంది. ఆటో ఇమ్యూన్ కండిషన్‌లో ఇది కనిపిస్తుంది. ఇది కాకుండా లూపస్, స్క్లీరోడెర్మా, మయోసైటిస్, యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ కూడా ఆటో ఇమ్యూన్ వ్యాధులే. వీటి కారణంగా కూడా కీళ్లనొప్పులు రావచ్చు. కీళ్లనొప్పులు ఉన్నవారిలో ఈ కండిషన్స్ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఇవీ లక్షణాలు..

- కీళ్లనొప్పులు.
- కీళ్లలో వాపు.
- కీళ్లు బిగుసుకుపోవడం.
- కీళ్ల దగ్గర పట్టు లేకపోవడం.
- జ్వరం.
- నీరసం.
- బరువు తగ్గడం.

నిర్లక్ష్యం వద్దు

కీళ్లనొప్పులను నిర్లక్ష్యం చేయకూడదు. వాటిని పట్టించుకోకపోతే సమస్య ప్రధాన అవయవాలపైనా ప్రభావం చూపవచ్చు. ముఖ్యంగా ఆర్థరైటిస్‌ను నిర్లక్ష్యం చేస్తే కొందరిలో చర్మవ్యాధులు, రక్తకణాలు తగ్గిపోవడం జరుగుతుంది. మరికొందరిలో కిడ్నీలు దెబ్బతినే అవకాశాలు ఉంటాయి. నరాల సమస్యలు కూడా తలెత్తవచ్చు. గుండె సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడే అవకాశం లేకపోలేదు. పురుషుల్లో అయితే యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ సమస్య ఉత్పన్నమవుతుంది. హెచ్‌ఎల్‌ఏ బి-27 జీన్ వల్ల పురుషుల్లో దీని రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అందుకని కీళ్లనొప్పులు బాధిస్తున్నప్పుడు ప్రత్యేక చికిత్స విధానాలు తెలిసిన రుమటాలజిస్టును సంప్రదించడం ఉత్తమం.



గర్భిణులు జాగ్రత్త!

గర్భధారణ సమయంలో ఆర్థరైటిస్ వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకని గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి. ఆర్థరైటిస్ ఉన్న స్త్రీలు గర్భం దాల్చితే సమస్య పెరిగే అవకాశాలు ఉంటాయి. లేదా ప్రసవం తర్వాత కూడా ఆర్థరైటిస్ రావచ్చు. ఒకవేళ గర్భధారణకు ముందే వ్యాధి ఉంటే, వైద్యుల పర్యవేక్షణలో వ్యాధిని నియంత్రణలో ఉంచిన తర్వాత గర్భధారణకు వెళ్లడం ఉత్తమం. అంతేకాకుండా సురక్షిత ప్రసవం కోసం మందులు మార్చించుకోవాలి.

నిర్ధారణ పరీక్షలు

కుటుంబ నేపథ్యం ఉంటే ఆర్థరైటిస్‌కు 5 శాతం ముప్పు ఎక్కువగా ఉంటుంది. అంటే కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఆర్థరైటిస్ సమస్య ఉండి ఉంటే వారికి ఈ సమస్యలు వచ్చే అవకాశాలు సాధారణ రోగుల కంటే ఎక్కువగా ఉంటాయి. కొన్ని రకాల మందుల వల్ల కూడా గౌట్ ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ఆర్థరైటిస్‌ను నిర్ధారించడానికి ముందుగా రోగి లక్షణాలు, ఆరోగ్య చరిత్రను పరిశీలించిన తర్వాత రుమటాయిడ్ ఫ్యాక్టర్, యాంటి సీసీపీ, యాంటి న్యూక్లియర్ యాంటిబాడీ (ఏఎన్ఏ) తదితర పరీక్షలు జరిపి వ్యాధిని నిర్ధారిస్తారు.

వైద్యుల పర్యవేక్షణలో...

ఆర్థరైటిస్ వ్యాధులకు పూర్తి స్థాయి చికిత్స లేదు. ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చు. జీవనశైలి, ఆహార నియమాలు, రోజువారీ వ్యాయామం, ధూమపానం, మద్యపానం లాంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండటం, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ తదితర నియమాలు పాటించాలి. ప్రస్తుతం బయలాజిక్స్ అనే ఇంజెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. సకాలంలో సరైన పద్ధతిలో మందులు వాడాలి. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే మందులు తీసుకోవాలి. రుమటాయిడ్ వ్యాధుల్లో ఎక్కువగా స్టిరాయిడ్స్, ఇమ్యునో సప్రెసెంట్స్ వాడుతారు. ఎక్కువగా మెథోట్రెక్సేట్, ఎజాథయోప్రిన్, సల్ఫాసాలజిన్, మైకోఫినోలేట్ తదితర ఇమ్యునో సప్రెసెంట్స్ వినియోగించడం జరుగుతుంది. అయితే ఈ మందులను అనుభవజ్ఞులైన రుమటాలజీ వైద్యులు పర్యవేక్షణలో సరైన పద్ధతిలో వినియోగిస్తే ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు.

మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ మాధురి
రుమటాలజిస్ట్
స్టార్ హాస్పిటల్, హైదరాబాద్

కిడ్నీలో రాళ్లు రాకుండా

మూత్రపిండాలు, మూత్రనాళంలో పేరుకుపోయి మూత్ర వ్యవస్థలో తీవ్రమైన నొప్పి కలిగించే స్ఫటికాలే కిడ్నీలో రాళ్లు. వీటిలో కాల్షియం ఆగ్జలేట్ స్ఫటికాలు ప్రధానమైనవి. యూరిక్ ఆమ్లం, స్ట్రువైట్, సిస్టయిన్ రాళ్లు కూడా విస్మరించదగనివే. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడకుండా నివారించేందుకు ప్రత్యేకమైన ఆహార విధానాన్ని అనుసరించాలి.



నీళ్లు తగినన్ని...

తగినన్ని నీళ్లు తాగితే మూత్రంలో లవణాలు పలుచబడతాయి. అలా రాళ్లు ఏర్పడే ప్రమాదం తగ్గిపోతుంది. రోజుకు ఎనిమిది నుంచి పన్నెండు గ్లాసుల నీళ్లు తాగాలి.

ప్రొటీన్ల శక్తి

నీళ్లు తగినన్ని తాగడంతోపాటు ప్రొటీన్లు కూడా అవసరమైనన్ని తీసుకోవాలి. అయితే, ప్రొటీన్లు మోతాదు మించితే కూడా కిడ్నీలో రాళ్ల ముప్పు పెరుగుతుంది. మొక్కల నుంచి వచ్చే ప్రొటీన్లు ఎక్కువగా, జంతు ఆధారితమైనవి తక్కువగా తీసుకోవాలి.

ఉప్పు తక్కువగా

సోడియం ఎక్కువగా ఉన్న పదార్థాలను తింటే శరీరంలో కాల్షియం స్థాయులు పెరుగుతాయి. అలా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ముప్పు కూడా పెరుగుతుంది. ఉప్పు రోజుకు 2,300 మిల్లీగ్రాముల మోతాదు మించకుండా చూసుకోవాలి. ప్రాసెస్డ్, ప్యాక్డ్ ఆహారం తీసుకుంటున్నప్పుడు వాటిలో సోడియం తక్కువగా ఉన్నవాటినే ఎంచుకోవాలి.

కాల్షియం తప్పనిసరి

కిడ్నీల్లో రాళ్లు ఏర్పడకుండా కాల్షియం ప్రధాన పాత్ర పోషిస్తుంది. పాల ఉత్పత్తులు, కూరగాయలు, ఆకుకూరలు, కాల్షియం ఉన్న ఆహార పదార్థాల నుంచి రోజుకు 1,000 నుంచి 1,200 మిల్లీగ్రాముల కాల్షియం శరీరానికి అందివ్వాలి. కాకపోతే, కాల్షియం తక్కువైనా, ఎక్కువైనా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడవచ్చు. కాబట్టి, కాల్షియం సప్లిమెంట్లు డాక్టర్ల సలహా మేరకు మాత్రమే వాడాలి.

ఆగ్జలేట్ ఎక్కువ వద్దు

పాలకూర, రుబార్బ్, బీట్ దుంపలు, గింజలు, చాక్లెట్ లాంటి ఆగ్జలేట్ ఉన్న ఆహార పదార్థాలను మితంగా తీసుకోవాలి. ఎక్కువగా తింటే కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. నారింజ, బత్తాయి, నిమ్మ, ద్రాక్ష మొదలైన వాటిలో సిట్రేట్ ఉంటుంది. ఇవి కిడ్నీల్లో రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయి.

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు

- లాంగ్‌జంప్‌లో అంజి, హైజంప్‌లో సిద్ధి వినయ్‌కి స్వర్ణం
- తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల తొలి రోజు సోమవారం జరిగిన బాలుర, బాలికల అండర్-16, 18, 20 విభాగాల్లో అథ్లెట్లు డిస్కస్‌త్రో, హైజంప్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, 800మీ, 1000మీ, 5000మీ, 10వేల మీ రేస్‌వాక్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. బాలుర అండర్-18 డిస్కస్‌త్రోలో సునీత్ కుమార్, హైజంప్‌లో సిద్ధివినయ్, 5వేల మీ రేస్‌వాక్‌లో సాయిచరణ్‌రెడ్డి పసిడి పతకాలతో మెరిశారు. బాలికల అండర్-18 కేటగిరీ షాట్‌పుట్‌లో రాజరాజేశ్వరి, 1000మీ పరుగులో అఖిల స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. మిగతా విభాగాల్లో ఈశ్వర్, సాయికిరణ్, విదిత్‌రెడ్డి, పవన్, విష్ణువర్ధన్, అంజి, శ్రీకాంత్, రాజేశ్, అమ్రీన్, కల్యాణి, బుచ్చమ్మ, ప్రవళిక స్వర్ణాలు దక్కించుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే ప్లేయర్లు ఈనెల 25 నుంచి 29 వరకు భువనేశ్వర్‌లో జరిగే జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీకి ఎంపిక చేస్తారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్,



కార్యదర్శి సారంగపాణి, కోశాధికారి రాజేశ్ కుమార్, రాజేశ్వర్‌రావు, కుమార్‌యాదవ్, మురళీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి..విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.

నేటి నుంచే ఆర్కిటిక్ ఓపెన్

సింధు, లక్ష్యసేన్ పునరాగమనం

ఫిన్‌లాండ్: పారిస్ ఒలింపిక్స్ తర్వాత కొద్దిరోజులు విరామం తీసుకున్న భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ తిరిగి బ్యాడ్మింటన్ కోర్టులో అడుగు పెట్టనున్నారు. మంగళవారం (అక్టోబర్ 8) నుంచి ఫిన్‌లాండ్‌లోని వాంటా వేదికగా జరిగే ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ఈ ఇద్దరూ పునరాగమనం చేయనున్నారు. కొత్త కోచ్‌లు అనూప్ శ్రీధర్, కొరియా దిగ్గజం లి స్యూన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న సింధు.. తొలి రౌండ్‌లో కెనడా అమ్మాయి మిచెల్లె లి తో తలపడనుంది. మరోవైపు సేన్ గతేడాది ఇండియా ఓపెన్‌లో తనను ఓడించిన రస్మస్ జెమ్కె (డెన్మార్క్)ను ఢీకొననున్నాడు. ఈ ఇద్దరితో పాటు కిడాంబి శ్రీకాంత్, మాళవిక బన్సోద్, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్ వంటి స్టార్ షట్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

దీపా కర్మాకర్ రిటైర్మెంట్



ఢిల్లీ: భారత స్టార్ జిమ్నాస్టిక్ క్రీడాకారిణి దీపా కర్మాకర్ సోమవారం ఈ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించింది. ఈ క్రీడలో భారత్ తరపున ఒలింపిక్స్ (రియో, 2016)లో పాల్గొన్న తొలి జిమ్నాస్ట్‌గా గుర్తింపు దక్కించుకున్న 31 ఏండ్ల దీపా.. సోమవారం ఎక్స్ వేదికగా తన నిర్ణయాన్ని వెల్లడించింది. 'సుదీర్ఘ ఆలోచన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా. ఇది తేలికైనది కాదని తెలుసు. కానీ సరైన సమయంలోనే రిటైర్మెంట్ తీసుకున్నానని భావిస్తున్నా. నా జీవితంలో జిమ్నాస్టిక్స్ ఓ భాగం. ఈ ఆటలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. కానీ ప్రతి క్షణానికి నేను ఎంతో కృతజ్ఞతతో ఉంటాను' అని పేర్కొంది. 2018లో జరిగిన ఎఫ్ఐజీ వరల్డ్ చాలెంజ్ కప్‌లో స్వర్ణం సాధించిన దీపా ఈ పతకం గెలిచిన తొలి భారత జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించింది. రియో ఒలింపిక్స్‌లో 0.15 పాయింట్ల తేడాతో తృటిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది.



దంచికొట్టిన పాక్

మసూద్, షఫీక్ శతకాలు

ముల్తాన్ : స్వదేశంలో ఇంగ్లండ్‌తో ముల్తాన్ వేదికగా సోమవారం ఆరంభమైన తొలి టెస్టులో మొదట బ్యాటింగ్ చేస్తున్న పాకిస్థాన్ దంచికొట్టింది. కెప్టెన్ షాన్ మసూద్ (151), ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (105) శతకాల మోత మోగించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 86 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. కొద్దిరోజుల క్రితమే బంగ్లాదేశ్‌తో సొంతగడ్డపై టెస్టు సిరీస్‌ను కోల్పోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాక్.. ఇంగ్లండ్‌తో తొలి రోజు సంపూర్ణ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఓపెనర్ సమీ అయూబ్ (4) వికెట్‌ను 4వ ఓవర్లోనే కోల్పోయినా అబ్దుల్లా, మసూద్ కలిసి భారీ ఇన్నింగ్స్ ఆడారు. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ముల్తాన్‌లో రెండో వికెట్‌కు ఈ ఇద్దరూ 253 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా మసూద్.. వన్డే తరహా ఆట ఆడటంతో పాక్ భారీ స్కోరు సాధించింది.



ఇరానీ కప్‌లో చారిత్రక విజయం సాధించిన ముంబై క్రికెట్ జట్టు సోమవారం సంబురాలు చేసుకుంది. జట్టుకు ఎంసీఏ కోటి రూపాయల నజరానా అందజేసింది

ఇంగ్లండ్ దూకుడు

దక్షిణాఫ్రికాపై ఘన విజయం • సఫారీలను కట్టడి చేసిన ఇంగ్లీష్ స్పిన్నర్లు • రాణించిన వ్యాట్ హాడ్జ్, సీవర్

షార్జా: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. గ్రూప్-బీలో షార్జా వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లీష్ జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకుంది. సౌతాఫ్రికా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ విఫలమై ఈ టోర్నీలో తొలి అపజయాన్ని మూటగట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి లారా వోల్వార్డ్ట (39 బంతుల్లో 42, 3 ఫోర్లు) మరోసారి కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడగా ఆల్‌రౌండర్ మరిజన్నె కాప్ (26) ఆఖర్లో వేగంగా ఆడింది. స్వల్ప ఛేదనను ఇంగ్లండ్.. 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆల్‌రౌండర్ సీవర్ బ్రంట్ (36 బంతుల్లో 48 నాటౌట్, 6 ఫోర్లు) రాణించగా గత మ్యాచ్‌లో మాదిరిగానే ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ (43 బంతుల్లో 43, 4 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడింది. రెండు వికెట్లు తీసిన సోఫీ ఎకిల్‌స్టోన్ (2/15)కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

నత్తనడకన సఫారీ ఇన్నింగ్స్..

స్పిన్‌కు అనుకూలిస్తున్న షార్జాపై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లారా వోల్వార్డ్ట ఎంత తప్పు చేసిందో అర్థం కావడానికి ఆ జట్టుకు పెద్దగా టైమ్ పట్టలేదు. సోఫీ ఎకిల్‌స్టోన్, చార్లీ డీన్, అలీస్ క్యాప్సీ వంటి నాణ్యమైన స్పిన్నర్లు కలిగిన ఇంగ్లండ్ ఆది నుంచే సఫారీలను కట్టడి చేశారు. బంతికో పరుగు చొప్పున ఆ జట్టు ఇన్నింగ్స్ సాగింది. ఓపెనర్ బ్రిట్స్ (13) డేనియల్ గిబ్సన్‌కు క్యాచ్ ఇచ్చింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో సౌతాఫ్రికాకు పరుగుల రాక కష్టమైంది. 7 నుంచి 12వ ఓవర్ మధ్య సౌతాఫ్రికా 5 ఓవర్లలో 23 రన్స్ మాత్రమే చేయగలిగింది. 15 ఓవర్లలో ఆ జట్టు స్కోరు 85/2గా ఉన్నప్పటికీ చివరి ఓవర్లలో కూడా పరుగుల రాక గగనమవడంతో సౌతాఫ్రికా తక్కువ స్కోరుకే పరిమితమైంది.

ఇంగ్లండ్‌దీ అదే కథ..

స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ ఛేదనలో ఇంగ్లండ్ సైతం తడబడింది. కాప్ వేసిన తొలి ఓవరే మెయిడిన్ అయింది. తనే వేసిన 5వ ఓవర్లో కాప్.. బౌచర్ (5)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపింది. 5 ఓవర్లలో ఇంగ్లండ్ చేసిన స్కోరు 16 పరుగులే. కానీ అలీస్ క్యాప్సీ (19) మూడు ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చింది. కానీ క్యాప్సీ.. డి క్లర్క్ బౌలింగ్‌లో ఆమెకు రిటర్న్ క్యాచ్ ఇచ్చింది. వికెట్లు కోల్పోయినా.. సీవర్, వ్యాట్ హాడ్జ్ మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించి ఇంగ్లండ్‌ను గెలుపు తీరాలకు చేర్చారు.



ఎకిల్‌స్టోన్ (2/15)

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 124/6 (లారా 42, కాప్ 26, ఎకిల్‌స్టోన్ 2/15, సారా 1/18)
ఇంగ్లండ్: 19.2 ఓవర్లలో 125/3 (సీవర్ 48 నాటౌట్, వ్యాట్ హాడ్జ్ 43, కాప్ 1/17, లబ 1/22)

లంక చీఫ్ కోచ్‌గా జయసూర్య

కొలంబో: శ్రీలంక దిగ్గజ ఆటగాడు సనత్ జయసూర్య ఆ జట్టుకు ఫుల్ టైమ్ హెడ్‌కోచ్‌గా నియమితుడయ్యాడు. గత జూలై నుంచి ఆ జట్టుకు తాత్కాలిక హెడ్‌కోచ్‌గా వ్యవహరిస్తున్న జయసూర్యకు రెండేండ్ల పాటు (2026 టీ20 వరల్డ్ కప్ దాకా) పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగిస్తున్నట్టు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) నిర్ణయం తీసుకుంది. జయసూర్య కోచింగ్‌లో లంక.. ఈ ఏడాది ఆగస్టులో భారత్‌ను వన్డేలలో ఓడించడమే గాక ఇటీవలే న్యూజిలాండ్‌తో ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌నూ క్లీన్‌స్వీప్ చేసింది.

తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ వేదికగా జరిగిన 34వ జాతీయ జూనియర్ త్రోబాల్ టోర్నీలో తెలంగాణకు రెండు కాంస్య పతకాలు దక్కాయి. సోమవారం జరిగిన బాలికల సెమీఫైనల్లో తెలంగాణ 13-15, 9-15తో ఢిల్లీ చేతిలో ఓడింది. మరోవైపు బాలుర సెమీస్‌లో తెలంగాణ 12-15, 13-15తో ఢిల్లీపై పరాజయం పాలైంది. ఢిల్లీ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

భారత్‌కు అగ్రస్థానం

ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్లు పతకాల పంట పండించడంతో పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ టోర్నీ ఆఖరి రోజైన సోమవారం.. పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో దీపక్ దలాల్, కమల్‌జీత్, రాజ్ చంద్రతో కూడిన భారత త్రయం స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్‌లో ఈ ముగ్గురూ 1,616 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచారు. మహిళల 50 మీటర్ల పిస్టల్ ఫైనల్‌లో పరిషా గుప్తా రజతం దక్కించుకోగా టీమ్ ఈవెంట్‌లో సెజల్ కాంబ్లీ, కేతన్, కనిష్క దాగర్ సైతం రజతం నెగ్గింది. మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ కాంపిటీషన్‌లో శార్దూల్, సబీర



కాంస్యం సాధించారు. ఈ టోర్నీలో భారత్ 13 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో మొత్తంగా 24 పతకాలు నెగ్గింది. ఇటలీ (13), నార్వే (10) తదుపరి స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రా కుర్రాడు ముకేశ్ నెలవెల్లి పలు ఈవెంట్లలో పాల్గొని ఏకంగా 8 పతకాలు సాధించడం విశేషం.



ప్రీతి జింటా జట్టు టైటిల్ గెలిచిందోచ్

గయానా: ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి ఆడుతున్నా ఇప్పటివరకూ ట్రోఫీ నెగ్గని జట్లలో పంజాబ్ కింగ్స్ ఒకటి. ఐపీఎల్‌తో పాటు కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లోనూ పంజాబ్‌కు ఫ్రాంచైజీ ఉన్నా ఈ రెండు లీగ్‌లలో ఇప్పటిదాకా ఆ జట్టు టైటిల్ నెగ్గలేదు. కానీ ఎట్టకేలకు ఆ ఫ్రాంచైజీ కోరిక నెరవేరింది. ఆదివారం ముగిసిన సీపీఎల్ ఫైనల్‌లో సెయింట్ లూసియా కింగ్స్.. 6 వికెట్ల తేడాతో గయానా అమెజాన్ వారియర్స్‌పై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. సెయింట్ లూసియాకు బాలీవుడ్ సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింటా సహ యజమానిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గయానా.. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ సారథ్యంలోని సెయింట్ లూసియా.. 18.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. ఆరోన్ జోన్స్ (48 నాటౌట్), రోస్టన్ చేజ్ (39 నాటౌట్) రాణించారు. చేజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, నూర్ అహ్మద్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పాదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద కష్టమే వచ్చిపడింది. డిపాజిట్లు లేక ద్రవ్యలభ్యత కరువైపోయింది మరి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన పరిశోధనాత్మక నివేదిక.. భారతీయ బ్యాంకులు ఎదుర్కొంటున్న నగదు కొరత, పడిపోతున్న డిపాజిట్లకు అద్దం పడుతున్నది.

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌ల్లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!



సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.



ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

గడిచిన ఆరు రోజుల్లో మదుపరులు కోల్పోయింది..

ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.



బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లలో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్రాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఒప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.



ఆర్టీసీకి అద్దె బస్సుల గండం!

- తగ్గుతున్న సొంత బస్సులు, కార్మికులు
- త్వరలో వెయ్యి ప్రైవేట్ ఈవీ బస్సులు
- మహాలక్ష్మి పథకం బస్సులపై చిన్నచూపు
- సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులపైనే ఆసక్తి
- ప్రైవేటీకరణ వైపే ఆర్టీసీ అడుగులు?



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీకి అద్దె బస్సులతో ప్రమాదం పొంచి ఉన్నదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక సొంత బస్సులను కొనుగోలు చేయకుండా అద్దె బస్సులను ప్రవేశపెట్టడం వారి అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. తెలంగాణ ఏర్పడినప్పుడు ఆర్టీసీకి 10,450 బస్సులు, 57,254మంది కార్మికులు ఉండేవారు. ఈ ఏడాది జూన్‌నాటికి బస్సుల సంఖ్య 9,149, సిబ్బంది సంఖ్య 40,415 మందికి పడిపోయింది. గతంలో అద్దె బస్సులు 1,431 మాత్రమే ఉండగా, ఇప్పుడవి 2,750కి పెరగడం ఆందోళనకర పరిణామమని కార్మికులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్క్రాప్ బస్సుల స్థానంలో కొత్తవి తెచ్చారు కానీ, అదనపు బస్సులను తేలేదని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం బస్సులైన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రవేశపెట్టకుండా యాజమాన్యం ఈవీ బస్సుల పేరిట ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ సూపర్‌లగ్జరీ బస్సులను ప్రవేశపెడుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఎలక్ట్రిక్ బస్సుల పేరిట చేస్తున్న హంగామా చూస్తుంటే, సంస్థకు పొగబెట్టేలా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీలో దశలవారీగా 2,400 ఈవీ బస్సులు రానున్నాయని, వీటిని అన్ని జిల్లాల్లోనూ ప్రవేశపెట్టనున్నట్టు కరీంనగర్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. అయితే, వాటిని ప్రైవేటు ఆపరేటర్ల ద్వారానే ప్రవేశపెడతారని సమాచారం. జీహెచ్ఎంసీ పరిధిలోనే 800 ఈవీ బస్సులు వస్తున్నాయి. జిల్లాల్లో కూడా 200 బస్సులు తీసుకొస్తున్నారు. ఈవీ బస్సుల కాంట్రాక్టు విధానం బయటకు చెప్పడం లేదని, యాజమాన్యం దృష్టి ప్రైవేటీకరణ వైపే సాగుతున్నదని కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇంకా నెరవేరలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వెయ్యి బస్సులు ఇన్.. 4వేల మంది ఔట్

ఆర్టీసీ నిబంధనల మేరకు ఒక బస్సుకు ఆరుగురు కార్మికులు సేవలు అందించాలి. ప్రైవేట్ బస్సులు పెరిగితే క్రమంగా ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని కార్మికులు చెప్తున్నారు. వెయ్యి బస్సులు ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా వస్తున్నాయంటే, రెండు వేల మంది డ్రైవర్లు, వెయ్యి మంది శ్రామిక్‌లు, మరో వెయ్యి మంది హెల్పర్లను ఆర్టీసీ కోల్పోయినట్టేనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎట్టకేలకు ఫార్మసీ ప్రవేశాల షెడ్యూల్

రెండు విడతల్లో సీట్లు భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ఎప్‌సెట్ బైపీసీ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఎట్టకేలకు నాలుగు నెలలు ఆలస్యంగా కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఫార్మసీ కౌన్సిల్ అనుమతులివ్వడంలో తీవ్ర జాప్యం చేయడంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది. మొత్తం రెండు విడతల్లో సీట్లు భర్తీచేస్తారు. మొదటి విడత షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 19 నుంచి 22లోపు ప్రాసెసింగ్ ఫీజు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుకింగ్, 21 నుంచి 23లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 28న సీట్ల కేటాయింపు, 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుని, ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తుది విడత షెడ్యూల్‌లో భాగంగా నవంబర్ 4న ప్రాసెసింగ్ ఫీజు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుక్ చేసుకోవాలి. 5న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 5, 6న వెబ్ ఆప్షన్ల నమోదు, 9న సీట్ల కేటాయింపు ఉంటుంది. 9 నుంచి 11లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్, ట్యూషన్ ఫీజు చెల్లింపు, 11, 12న రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 12న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలు విడుదల చేస్తారు.

మధ్యంతర బెయిల్ రద్దు చేయండి

కోర్టులో జానీ మాస్టర్ న్యాయవాది మెమో

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబర్ 7: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. జాతీయ ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డును అందుకునేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉన్నదని జానీ మాస్టర్ విన్నవించడంతో ఇటీవల కోర్టు ఆయనకు 4 రోజుల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. కానీ, అనుహ్యంగా నిర్వాహకులు ఆ అవార్డును రద్దు చేయడంతో జానీ మాస్టర్ ఢిల్లీ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది దాఖలు చేసిన మెమోను కోర్టు అనుమతించింది. కాగా, ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం జానీ మాస్టర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి

- 4 నెలల్లోగా ఆ కేటాయింపులను రద్దు చేయాలి
- 17 ఏండ్ల నాటి పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు
- ఇందూ టెక్, బ్రాహ్మణి తదితర కంపెనీలకు ఎదురుదెబ్బ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 2001-06 మధ్యకాలంలో ప్రభుత్వం నుంచి భూములను పొంది పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల నుంచి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల నుంచి భూమిని స్వాధీనం చేసుకోలేదన్న పిటిషనర్ వాదన సమర్థనీయమేనని పేర్కొంటూ.. ఇందూటెక్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్, స్టార్జ్ ప్రాపర్టీస్, అనంత టెక్నాలజీస్, జెటీ హోల్డింగ్స్ సంస్థలకు జరిపిన భూ కేటాయింపులను 4 నెలల్లోగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి ప్రకటన లేకుండా, వేలం నిర్వహించకుండా నామినేషన్ విధానంలో అమ్మకం, లీజు ప్రాతిపదికపై 4,156 ఎకరాల భూమిని పలు కంపెనీలు, వ్యక్తులకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ 2007లో చత్రి సంస్థ పిల్ దాఖలు చేయడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాస రావు ధర్మాసనం తీర్పు వెలువరించింది.

22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): పలు శాఖల్లోని ఇంజినీర్ ఉద్యోగాల భర్తీలకు ఈ నెల 22 నుంచి నవంబర్ 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారికి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: యూటీఎఫ్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బాకీపడ్డ పెండింగ్ డీఏలు, బిల్లులను తక్షణమే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధులు జంగయ్య, చావరవి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. కాగా, జీవో-317 బాధితుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి కోరారు.

'జీవో 28 అభ్యర్థులకు న్యాయం చేయాలి'

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ 2008లో జీవో-28తో నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ట్రైబల్ టీచర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఎంబీబీఎస్‌కు గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): నీట్ ఎంబీబీఎస్ అడ్మిషన్లలో 174 మంది సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ విద్యార్థులు సీట్లు కైవసం చేసుకున్నారు. 438 ర్యాంకుతో గాంధీ మెడికల్ కాలేజీలో సాయి వంశీ, 1,791 ర్యాంకుతో హేమంత్, 3,378 ర్యాంకుతో శృతి ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీట్లు దక్కించుకున్నారు. సీట్లు పొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సొసైటీ కార్యదర్శి వర్షిణి అభినందించారు.

కొత్త టీచర్లు 10వేలే..

- అడ్డంకిగా వివాదాలు, కోర్టు కేసులు
- పలు కారణాలతో నిలిచిన కొన్ని పోస్టుల భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 11వేల టీచర్ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసినా ప్రస్తుతం 10వేల మంది టీచర్లకు ప్రభుత్వం కొలువులివ్వనున్నది. మిగతా పోస్టుల భర్తీకి వివాదాలు, కోర్టుకేసులు అడ్డంకిగా నిలిచాయి. పలు కారణాలతో 13 జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పోస్టుల భర్తీకి బ్రేక్‌లు పడ్డాయి. 10 వేల మంది కొత్త టీచర్లకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు ఇవ్వనున్నారు. సోమవారం అర్ధరాత్రి 1:1 జాబితాను జిల్లాలకు పంపించారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగలకుండా అధికారులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఇంకా డీఎస్సీకి పలు వివాదాలు వెంటాడుతున్నాయి.

ప్రత్యేక టెట్‌పై కోర్టుకు..

డీఎస్సీ నియామకాలకు ముందు మరో వాదన బయటికొచ్చింది. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించకుండా, రెగ్యులర్ టెట్‌ను నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ కొంత మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. వాస్తవానికి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు 21 రకాల వైకల్యాలున్న వారికి బోధిస్తారు. సబ్జెక్టులు సైతం వేరుగా ఉంటాయి. కానీ వీరికి రెగ్యులర్ టెట్‌ను రాసుకునే అవకాశమిచ్చారు. అప్పట్లో దీనిపై అభ్యర్థులు అభ్యంతరాలు లేవనెత్తారు. కానీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. దీనిపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 13 జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీ నిలిచిపోయింది. మిగతా జిల్లాలతోపాటే తమకు పోస్టింగ్స్ ఇవ్వాలని మరికొందరు అభ్యర్థులు సైఫాబాద్‌లోని డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అభ్యర్థులు అధికారులను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

సైబర్ నేరగాళ్లపై 18 ఎల్‌వోసీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 18 మందిపై లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్వోసీ)జారీచేశారు. మిగతా నిందితుల వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. వివిధ రాష్ట్రాల్లో సీసీఎస్ సైబర్‌క్రైమ్ బృందాలు అరెస్ట్ చేస్తున్న వారిలో ఎక్కువగా బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు ఖాతాలను సేకరించేవారే ఉంటున్నారు. ఖాతాదారులు, ఖాతాదారుల నుంచి డబ్బు సేకరించి ఏజెంట్లు ఆపై ఉండే వాళ్లకు క్రిప్టో కరెన్సీలో డబ్బు పంపిస్తున్నారు. అది వివిధ కరెన్సీల్లోకి మారి ప్రధాన నిందితులకు చేరుతున్నది. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉంటున్న సైబర్ నేరగాళ్ల పాస్‌పోర్టు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పాత నేరస్థుల డాటాను సేకరించి ఎక్కడున్నారని తెలుసుకొనే పనిలో ఉన్నారు. గతంలో సైబర్ నేరగాళ్ల కోసం ఎల్వోసీ జారీ చేస్తే నేపాల్‌లోని ఖట్మాండ్ మీదుగా రోడ్డుమార్గంలో భారత్‌లోకి ప్రవేశిస్తుండగా, పోలీసులు పట్టుకొని సైబరాబాద్ పోలీసులకు అప్పగించారు.

విషజ్వరంతో చిన్నారి మృతి



వర్షిత(ఫైల్)

ములుగురూరల్, అక్టోబర్ 7: విషజ్వరం బారిన పడి ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా పత్తిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాటోత్ కవిత-జయపాల్ దంపతులకు కొడుకు హర్షవర్ధన్ 4వ తరగతి, 1వ తరగతి చదువుతున్న కుమార్తె వర్షిత(8) ఉన్నారు. వారం నుంచి వర్షిత విషజ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆదివారం వర్షిత కోమాలోకి వెళ్లడంతో మెరుగైన చికిత్స కోసం హనుమకొండకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని హనుమకొండలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

తాడ్వాయి, అక్టోబర్ 7: ఆర్‌ఎంపీ అందించిన వైద్యం వికటించి ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరిగింది. జంపంగవాయికి చెందిన రత్నకుమారి (43) ఊరట్టం పోస్టాఫీస్‌లో ఏబీపీగా పనిచేస్తున్నది. 4 రోజుల క్రితం ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో నార్లాపురంలోని ఆర్‌ఎంపీని సంప్రదించి వైద్యం పొందింది. ఆదివారం మళ్లీ జ్వరంతో అదే ఆర్‌ఎంపీ దగ్గరికి వెళ్లగా ఇంజెక్షన్లు కలిపిన సెలైన్ ఎక్కించాడు. గంట తర్వాత ఆమె ఆరోగ్యం విషమించడంతో ములుగు దవాఖానకు తీసుకువెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించాడు. ములుగు, అక్కడి నుంచి వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యంలో రత్నకుమారి మృతిచెందింది. ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్ నిర్లక్ష్యంమంతోనే తన తల్లి మృతి చెందిందని ఆమె కుమారుడు భాస్కర్ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశాడు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నకిలీ బ్యాంక్ అధికారుల అరెస్టు

నీలగిరి, అక్టోబర్ 7: తాము బ్యాంకు అధికారులమని చెప్పుకుంటూ.. తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని రైతులను మోసం చేస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేసిన ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్ట్ చేసినట్టు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం నల్లగొండలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీ లింగోటానికి చెందిన షేక్ వజీర్, వెలుగుగూడేనికి చెందిన కట్టెబోయిన పరమేశ్, వెంకటాద్రిపాలేనికి చెందిన మమ్ముల జ్యోతి స్వరూప్, చిరుమర్తికి చెందిన కొండా శ్రీను, మిర్యాలగూడకు చెందిన గోగుల సురేశ్, జప్తివీరప్పగూడేనికి చెందిన చిలుముల సైదులు, తెప్పలమడుగుకు చెందిన పల్లెబోయిన నాగరాజు, నార్కట్‌పల్లికి చెందిన ముప్పిడి సైదులుతో కలిసి టీమ్‌గా ఏర్పడి 28 మంది నుంచి సుమారు రూ.26 లక్షల వరకు వసూలు చేసినట్టు ఎస్పీ తెలిపారు.



ఐఎంపీసీఎల్ ప్రైవేటీకరణపై నిరసన జ్వాలలు

- లాభాల్లో ఉన్నప్పటికీ సంస్థను అమ్మేస్తున్నారు
- కేంద్రంపై ఉద్యోగుల ఆగ్రహం

అల్మోరా, అక్టోబర్ 7: ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాసూటికల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఎంపీసీఎల్) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన తీవ్ర మైంది. ఉత్తరాఖండ్‌లోని అల్మోరాలో గల ఆ కంపెనీ ఎదుట వందలాది మంది ఉద్యోగులు కొన్ని రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. లాభాల్లో ఉన్న ఈ ప్రభుత్వ రంగ సంస్థను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమతో సంప్రదించకుండా, తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తూ అమ్మేస్తున్నదని ఉద్యోగులు ఆరోపించారు. 'మా నిరసన ఓ కంపెనీని అమ్మడం గురించి కాదు. భారత ఆయుర్వేద పరిశ్రమ భవిష్యత్తును అమ్మడం గురించి' అని ఓ నిరసనకారుడు తెలిపారు. 500 మందికి పైగా ఉద్యోగులు, ఔషధాల తయారీకి ముడి సరుకులు సరఫరా చేసే వేలాది మంది సన్నకారు రైతులు ఈ కంపెనీపై ఆధారపడ్డారని.. ఇలాంటి విలువైన కంపెనీని ఎంపిక చేసిన స్నేహితులకు ఎందుకు కట్టబెడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ అధీనంలో ఆయుర్వేద, యునానీ మందులను ఉత్పత్తి చేస్తూ భారత సంప్రదాయ వైద్య విధానాన్ని ప్రచారం చేస్తున్న ఐఎంపీసీఎల్ ఏటా స్థిరంగా లాభాలు పొందుతున్నది.

ఎల్జీకి ఐదుగురు సభ్యుల్ని నామినేట్ చేసే అధికారం

- జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితాల వేళ వివాదం
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్న విపక్షాలు

న్యూఢిల్లీ: మరికొద్ది గంటల్లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర అసెంబ్లీకి ఐదుగురు సభ్యుల్ని నామినేట్ చేసే అధికారం ఎల్జీకి ఉండటం రాజకీయంగా కీలకంగా మారింది. ఎట్టి పరిస్థితిలో దీనిని అంగీకరించబోమని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు సోమవారం ప్రకటించాయి. సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపాయి. జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో మెజార్టీ మార్క్ 48 ఏ ఒక్క పార్టీకి రాకపోవచ్చని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. దీంతో ఎల్జీ తన అధికారాల్ని వినియోగిస్తారా? ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్యాబినెట్ సలహా మేరకు సభ్యుల్ని నామినేట్ చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఎల్జీ నామినేట్ చేసేవారు తమ పార్టీ నుంచే ఉంటారని బీజేపీ పేర్కొన్నది.

నేడు హర్యానా, జమ్ము కశ్మీర్ ఎన్నికల ఫలితాలు

చండీగఢ్, శ్రీనగర్: హర్యానా, జమ్ము కశ్మీర్ శాసనసభ ఎన్నికల ఫలితాలు నేడు వెల్లడి కానున్నాయి. రెండు చోట్లా కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల ప్రధానాధికారులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ రెండు చోట్ల బీజేపీ-కాంగ్రెస్ ముఖాముఖి తలపడుతున్నాయి. హర్యానాలో ఫలితాలపై రాజకీయ పార్టీలు, నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. హ్యాట్రిక్ విజయంపై బీజేపీ ధీమా వ్యక్తం చేస్తుండగా... పదేండ్ల తర్వాత అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ చెప్తున్నది. మరోవైపు 370 అధికరణ రద్దు తర్వాత తొలిసారి జమ్ము కశ్మీర్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయంపై బీజేపీ, పీడీపీ, కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటములు ధీమాగా ఉన్నాయి.


మైక్రో ఆర్‌ఎన్‌ఏ ఆవిష్కర్తలకు వైద్య నోబెల్

విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌కు అవార్డు • ఇద్దరూ అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలే



స్టాక్‌హోమ్: మైక్రోఆర్‌ఎన్‌ఏను కనుగొన్న అమెరికా శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌కు వైద్య శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. సోమవారం నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. జన్యు క్రియను క్రమబద్ధీకరించే ప్రాథమిక సూత్రం మైక్రో ఆర్‌ఎన్‌ఏనే అనే విషయాన్ని వీరు గుర్తించారు. జీవులు ఎలా అభివృద్ధి చెందుతాయి, ఎలా పని చేస్తాయనే ప్రాథమిక అంశాన్ని వీరి ఆవిష్కరణ నిరూపించిందని నోబెల్ అసెంబ్లీ ప్రకటించింది. విక్టర్ ఆంబ్రోస్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ మెడికల్ స్కూల్‌లో నాచురల్ సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. రవ్‌కున్ హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి 10 లక్షల డాలర్ల(రూ.84 కోట్లు) నగదు బహుమతి అందనుంది. డిసెంబర్ 10న ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా వీరు అవార్డు అందుకోనున్నారు. వీరితో వైద్యశాస్త్రంలో నోబెల్ పురస్కారం అందుకున్న వారి సంఖ్య 227కు చేరుకోనుంది. కాగా, కొవిడ్-19కు ఎంఆర్‌ఎన్‌ఏ వ్యాక్సిన్లు అభివృద్ధి చేసిన అమెరికన్ శాస్త్రవేత్త డ్రూ వెయిస్‌మెన్, హంగేరీ అమెరికన్ కటలిన్ కరికోకు గత ఏడాది మెడిసిన్‌లో నోబెల్ పురస్కారం దక్కిన సంగతి తెలిసిందే.

జన్యు నియంత్రణ గుట్టు విప్పిన మైక్రో ఆర్‌ఎన్‌ఏ



జన్యు క్రియను నియంత్రించడంతో కీలక పాత్ర పోషించే సూక్ష్మ ఆర్‌ఎన్‌ఏ అణువులను ఆంబ్రోస్, రవ్‌కున్ కనుగొన్నారు. వీరి ఆవిష్కరణ జన్యు నియంత్రణలో కొత్త సిద్ధాంతాన్ని తెలిపింది. ప్రొటీన్ల తయారీ సూచనలను కలిగి ఉండే మెసెంజర్ ఆర్‌ఎన్‌ఏకు మైక్రోఆర్‌ఎన్‌ఏ భిన్నమైనవి. నిర్దిష్ట ఎంఆర్‌ఎన్‌ఏ అణువులు ప్రొటీన్లుగా పరివర్తన చెందకుండా మైక్రో ఆర్‌ఎన్‌ఏ నియంత్రిస్తాయి. కణాల అభివృద్ధి, జీవక్రియలోనూ మైక్రోఆర్‌ఎన్‌ఏ కీలకపాత్ర పోషిస్తాయి. మైక్రోఆర్‌ఎన్‌ఏ పనితీరులో ఆటంకాలకు క్యాన్సర్ వంటి వ్యాధులతో సంబంధం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కణాల మధ్య భేదాన్ని కనుగొనడం, వాటి అభివృద్ధి, వ్యాధి ప్రక్రియలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడంలో మైక్రో ఆర్‌ఎన్‌ఏ ఉపయోగపడనుంది.

ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం

- దాడి చేసిన హమాస్, హెజ్బొల్లా, హౌతీ
- టెల్ అవివ్, హైఫా నగరాలపై దాడి
- దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు
- ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధానికి ఏడాది

జెరూసలేం, అక్టోబర్ 7: ఇజ్రాయెల్‌పై గాజా నుంచి హమాస్, లెబనాన్ నుంచి హెజ్బొల్లా, యెమెన్ నుంచి హౌతీ రాకెట్లవర్షం కురిపించాయి. టెల్ అవీవ్ నగరం లక్ష్యంగా హమాస్ రాకెట్లను ప్రయోగించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని మూడో పెద్ద నగరమైన హైఫాను లక్ష్యంగా చేసుకొని హెజ్బొల్లా భారీ ఎత్తున రాకెట్లతో దాడి చేసింది. దక్షిణ హైఫాలోని ఇజ్రాయెల్ మిలిటరీ బేస్‌ను లక్ష్యంగా చేసుకొని 'ఫది 1' మిసైళ్లను ప్రయోగించినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. తైబెరియాస్‌పై దాడి చేసినట్టు తెలిపింది. హెజ్బొల్లా ప్రయోగించిన రాకెట్లు హైఫాను తాకినట్టు ఇజ్రాయెల్ పోలీసులు ధ్రువీకరించారు. ఈ దాడిలో 10 మంది గాయపడ్డట్టు స్థానిక మీడియా తెలిపింది. అయితే, లెబనాన్ నుంచి హెజ్బొల్లా 135 రాకెట్లను ప్రయోగించగా, అడ్డుకున్నామని ఇజ్రాయెల్ మిలిటరీ తెలిపింది. మధ్య ఇజ్రాయెల్ లక్ష్యంగా యెమెన్ నుంచి పేల్చిన క్షిపణిని సైతం అడ్డుకున్నట్టు పేర్కొన్నది. మరోవైపు దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై బాంబులు వేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. గాజాలోని జబాలియా శరణార్థ శిబిరంతో పాటు పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ఘటనలో 12 మంది పాలస్తీనా వాసులు మరణించారు. కాగా, ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 10 మంది అగ్నిమాపక సిబ్బంది సహా 22 మంది మరణించినట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది.


హైఫాలో రాకెట్ దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

గాజా పునర్నిర్మాణానికి దశాబ్దాలు

గాజాలో హమాస్‌తో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమై ఏడాది గడిచింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిపి 1,200 మందిని హతమార్చడం, 251 మందిని బందీలుగా తీసుకెళ్లడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. హమాస్ దాడికి ప్రతీకారంగా వెంటనే గాజాపై ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులను ప్రారంభించింది. ఇవి ఏడాదికాలంగా కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో గాజాస్ట్రిప్ చిన్నాభిన్నమైంది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. లక్షల సంఖ్యలో ఇండ్లు నేలమట్టమయ్యాయి. తమ ఇండ్లు ఎక్కడున్నాయో కూడా ప్రజలు గుర్తుపట్టలేని స్థాయిలో విధ్వంసం జరిగింది. గాజా పునర్నిర్మాణానికి దశాబ్దాలు పట్టే అవకాశం ఉంది. మరోవైపు హమాస్‌తో పాటు హెజ్బొల్లా, హౌతీలు, ఇరాన్ చేస్తున్న వైమానిక దాడులతో ఇజ్రాయెల్ సైతం నష్టపోతున్నది.

ఇరాన్ అణు పరీక్షలు?

ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అణ్వాయుధ తయారీ దిశగా ఇరాన్ ప్రయత్నాలను ముమ్మరం చేసిందనే అనుమానాలు కలుగుతున్నాయి. తాజాగా అణు పరీక్షలు జరిపిందని నిపుణులు భావిస్తున్నారు. అక్టోబరు 5న ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో సంభవించిన భూకంపానికి అణుపరీక్షలే కారణమని అనుమానిస్తున్నారు. కాగా, ఊహించిన దాని కంటే వేగంగా ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయగలదని తాజాగా ది హెరిటేజ్ ఫౌండేషన్ పేర్కొన్నది. ఇరాన్ చాలా ఏండ్లుగా అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తున్నప్పటికీ పాశ్చాత్య దేశాలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

బందీలందరినీ వెనక్కు తీసుకొస్తాం: నెతన్యాహూ

అక్టోబర్ 7 దాడికి ఏడాది గడిచిన సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలు అందరినీ వెనక్కు తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. 'మన పిల్లలు, వారి భవిష్యత్తు కోసం అక్టోబర్ 7 లాంటి ఘటన మళ్లీ జరగకుండా చూసేందుకు మన ప్రాంతంలో భద్రత వాస్తవిక పరిస్థితులను మారుస్తున్నాం' అని ఆయన వ్యాఖ్యానించారు.

గుజరాత్‌లో 120 కోట్ల కొకైన్ పట్టివేత

ఒకే ప్రాంతంలో.. ఇది మూడోసారి

గాంధీధామ్, అక్టోబర్ 7: గుజరాత్‌లోని కచ్ తీర ప్రాంతంలో రూ.120 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. గాంధీధామ్‌కు సమీపంలోని క్రీక్ అనే చోట 12 కిలోల కొకైన్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. స్మగ్లర్లు పట్టుబడకుండా ఉండటం కోసం ఈ కొకైన్ ప్యాకెట్లను అత్యంత రహస్యంగా ఓ చోట దాచి ఉంచారని తాము భావిస్తున్నట్టు పోలీస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 'గాంధీధామ్‌కు సమీపంలో క్రీక్ అనే ప్రాంతంలో కొకైన్ పట్టుబడటం ఇది మూడోసారి. చిన్న ఉపాయంతో దీన్ని పట్టుకున్నాం. ఆదివారం రాత్రి ఇక్కడ సోదాలు నిర్వహించగా 10 కొకైన్ ప్యాకెట్లు బయటపడ్డాయి' అని అన్నారు. తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్టు చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్, ఈ ఏడాది జూన్‌లో క్రీక్ ప్రాంతంలో పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడింది.

కోల్‌కతా వైద్యురాలిపై సంజయ్‌రాయ్ హత్యాచారం

సీబీఐ చార్జిషీట్‌లో వెల్లడి

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతా డాక్టర్ హత్యాచార కేసులో సీబీఐ సోమవారం సీల్దాలోని ప్రత్యేక న్యాయస్థానంలో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. 200మందికి పైగా వ్యక్తుల నుంచి వాంగ్మూలం తీసుకున్న సీబీఐ, ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌గా తేల్చింది. రాత్రి విరామ సమయంలో దవాఖాన సెమినార్ హాల్‌లోకి వెళ్లిన వైద్యురాలిపై సివిక్ వలంటీర్‌గా పనిచేస్తున్న సంజయ్ రాయ్ ఘాతుకానికి పాల్పడ్డాడని సీబీఐ తెలిపింది. గ్యాంగ్ రేప్ జరిగిందా? లేదా? మరికొంత మంది ప్రమేయం ఇందులో ఉందా? అన్నది తేల్చేందుకు ఇంకా దర్యాప్తు చేస్తున్నామని సీబీఐ పేర్కొన్నది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, దవాఖానలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటన పశ్చిమ బెంగాల్‌ను తీవ్రంగా కుదిపేసింది. ఆగస్టు 9న వెలుగుచూసిన ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది.



నాణ్యమైన పరిశోధనలకు ప్రోత్సాహం

పీహెచ్‌డీ ఎక్సలెన్స్ పురస్కారాలు ఇవ్వనున్న యూజీసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: పీహెచ్‌డీ పరిశోధనల్లో నాణ్యతను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా పీహెచ్‌డీ ఎక్సలెన్స్ సైటేషన్ పురస్కారాలను అందించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిర్ణయించింది. పరిశోధనలకు అనుకూల వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు, నాణ్యమైన పరిశోధనలు చేసే యువ రిసెర్చ్ స్కాలర్‌లకు తగు గుర్తింపు ఇచ్చేందుకు ఈ పురస్కారాలను అందించనుంది. సైన్సెస్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, సోషల్ సైన్సెస్, భారతీయ భాషలు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో అవార్డులను అందించనుంది. దేశంలోని కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీలతో పాటు ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసిన వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేయొచ్చు. ప్రతియేటా ఒక్కో సబ్జెక్టు నుంచి రెండు చొప్పున 10 పురస్కారాలను అందించనున్నారు. ఇందుకోసం యూనివర్సిటీలే ఒక్కో సబ్జెక్ట్ నుంచి ఒక్కోటి చొప్పున ఐదు నామినేషన్లను పంపించవచ్చు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం రోజు పురస్కారాలను అందిస్తారు.

కెనడా పోస్ట్ స్టడీ వర్క్ ప్రోగ్రామ్‌లో మార్పులు

నవంబర్ నుంచి అమలు



ఒట్టావా, అక్టోబర్ 7: పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ (పీజీడబ్ల్యూపీ) ప్రోగ్రామ్‌లో నవంబర్ 1 నుంచి మార్పులు అమలు చేయనున్నట్టు కెనడా ప్రభుత్వ సంస్థ ఐఆర్‌సీసీ వెల్లడించింది. అభ్యర్థులు దరఖాస్తు చేసేటప్పుడు పీజీడబ్ల్యూపీకి అవసరమైన భాషా నైపుణ్యాలపై ఆధారాలు సమర్పించాలి. ఇంగ్లిష్ భాష కోసం కెనడియన్ లాంగ్వేజెస్ బెంచ్‌మార్క్(సీఎల్బీ)ను ఆధారంగా సమర్పించొచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా చదవడం, రాయడం, వినడం, మాట్లాడే విభాగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించాలి. ఇందుకు సంబంధించి రెండేండ్ల లోపు పాత పరీక్ష ఫలితాలను మాత్రమే దరఖాస్తుతో పాటు జత పరచాలి. అదనంగా అభ్యర్థి తాను చదవాలనుకుంటున్న స్టడీ ప్రోగ్రామ్ కోసం, అందుకు సంబంధించిన వృత్తికి సంబంధం ఉన్న రంగంలో గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలి. అభ్యర్థి చదవాలనుకున్న రంగాలను వ్యవసాయం & వ్యవసాయోత్పత్తి వాణిజ్యం(అగ్రి-ఫుడ్), స్టెమ్ సబ్జెక్టులు, వాణిజ్యం, రవాణా అనే అయిదు విభాగాలుగా విభజించారు. పీజీడబ్ల్యూపీ ప్రోగ్రామ్‌లో కొత్త నిబంధనలతో పాటు కొన్ని పాత నిబంధనలను కూడా అమల్లో ఉంటాయి. పీజీడబ్ల్యూపీకి అర్హత పొందేందుకు అభ్యర్థులు తప్పనిసరిగా జనరల్, ఫిజికల్ లొకేషన్ అర్హతలను సాధించాలి.

సమోసా, పకోడీతో మధుమేహం!

ఐసీఎంఆర్ తాజా అధ్యయనం



న్యూఢిల్లీ, అక్టోబర్ 7: భారతీయులు ఇష్టంగా తినే పలు ఆహార పదార్థాలు మధుమేహానికి కారణం అవుతున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. సమోసా, పకోడీ, ఫ్రైడ్ చికెన్, చిప్స్, బిస్కెట్లు, కేక్స్, రెడీమేడ్ మీల్స్, మయొనైజ్, గ్రిల్ చికెన్, బీఫ్, డ్రై నట్స్, వేయించిన వాల్‌నట్స్ వంటివి డయాబెటిస్ పెరిగేందుకు దోహదం చేస్తున్నాయని వెల్లడైంది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చ్, మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 38 మంది అధిక బరువు, స్థూలకాయంతో బాధపడుతున్న 25-45 ఏండ్ల వయస్కులను పరీక్షించగా వారిలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 23 కంటే అధికంగా ఉన్నదని తెలిసింది. దీనికి సంబంధించిన అధ్యయనం ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఫుడ్ సైన్సెస్ అండ్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది.

రైల్వే అధికారుల భర్తీకి యూపీఎస్సీ పరీక్ష

పాత పద్ధతిని పునరుద్ధరించిన కేంద్రం

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేలో అధికారుల పోస్టుల భర్తీకి పాత పద్ధతినే అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్సీ), ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష (ఈఎస్సీ)ల ద్వారా రైల్వే అధికారులను ఎంపిక చేయనున్నది. ఈ నిర్ణయానికి కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం ఆమోదం తెలిపింది. ఐదేండ్ల క్రితం ఎనిమిది రైల్వే సేవలను ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్)లో విలీనం చేసిన తరువాత అధికారుల పోస్టులన్నీ సీఎస్సీ పరీక్ష ద్వారానే భర్తీచేసేవారు. రైల్వేలో ప్రస్తుతం ఐఆర్ఎంఎస్‌లోని వివిధ విభాగాల్లో 225 ఖాళీలు ఉన్నాయి. సీఎస్సీ పరీక్ష ద్వారా జరిగే ఎంపికలో ఎక్కువ మంది సాంకేతికత లేని వారు భర్తీ అవుతుండటంతో సంస్థ అవసరాలు తీరడం లేదని తిరిగి పాత పద్ధతినే అనుసరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది.



జార్కిహోళితో విజయేంద్ర భేటీ

- డీకే శివకుమార్ సోదరుడు సైతం..
- కర్ణాటకలో కీలక పరిణామాలు
- సీఎం మార్పు ప్రచారంతో రెండు భేటీలకు ప్రాధాన్యం



బెంగళూరు: ముడా కుంభకోణం నేపథ్యంలో కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే ప్రచారంతో రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సిద్ధరామయ్యను తప్పిస్తే తనను ముఖ్యమంత్రిని చేయాలని పట్టుబడుతున్న మంత్రి సతీశ్ జార్కిహోళితో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర భేటీ అయ్యారు. మరోవైపు ముఖ్యమంత్రి పదవికి ప్రధానంగా పోటీ పడుతున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ సైతం జార్కిహోళిని కలిశారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ఊహాగానాలకు తెరలేశాయి. ప్రజా సమస్యలపై మాట్లాడటానికి మంత్రిని కలిసినట్టు ఇద్దరు నేతలు చెప్పినప్పటికీ అంతర్గతంగా ముఖ్యమంత్రి మార్పుపైనే చర్చ జరిగిందనే ప్రచారం జరుగుతున్నది. కాగా, ఇటీవల సతీశ్ జార్కిహోళి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసొచ్చారు. సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తప్పిస్తే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. డీకే శివకుమార్ అభ్యర్థిత్వాన్ని సతీశ్ వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సయోధ్య కోసమే ఆయనతో డీకే సోదరుడు భేటీ అయ్యారనే ప్రచారం జరుగుతున్నది.

ముడా స్కామ్‌లో ఫైళ్లు మాయం!

మంత్రిపై ఫిర్యాదు చేసిన ఆర్టీఐ కార్యకర్త



బెంగళూరు, అక్టోబర్ 7: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న ముడా కుంభకోణానికి సంబంధించిన కీలక దస్త్రాలు మాయమైనట్టు ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. సోమవారం ఆయన డీజీపీ అలోక్ మోహన్‌ను కలిసి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బైరాతి సురేశ్, లోకాయుక్త మాజీ ఎస్పీ సుజీత్‌పై ఫిర్యాదు చేశారు. వీరిద్దరు కలిసి జూలైలో ముడా కుంభకోణానికి సంబంధించిన కీలక దస్త్రాలను తరలించారని ఆయన ఆరోపించారు. ఈ స్కామ్ గురించి బయటకు వచ్చిన తరాత మంత్రి బైరాతి సురేశ్ హెలికాప్టర్‌లో మైసూరుకు వెళ్లి కీలక ఫైళ్లను తెచ్చారని, ఇందుకు సుజీత్ సాయపడ్డారని స్నేహమయి కృష్ణ పేర్కొన్నారు. కాగా, ముడా స్కామ్‌లో సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలపై పార్లమెంట్ కమిటీ అసంతృప్తి

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికం సంస్థ 'బీఎస్‌ఎన్‌ఎల్' సేవల్లో నాణ్యత లోపించడంపై పార్లమెంట్ కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు, పనితీరుపై సోమవారం బీజేపీ ఎంపీ సంజయ్ జైశ్వాల్ నేతృత్వంలో కమిటీ సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీలు బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవల నాణ్యతపై మాట్లాడారు. ఎంపీల ఫిర్యాదులపై స్పందించిన బీఎస్‌ఎన్‌ఎల్ సీఎండీ, టెలికం కార్యదర్శి.. ఆరు నెలల్లో మెరుగైన ఫలితాలు చూపుతామని తెలిపారు. 4జీ సేవల టవర్ల సంఖ్యను 24వేల నుంచి లక్షకు పెంచుతామని ఎంపీలకు తెలిపారు.

యూఎస్ ఓటర్లకు మస్క్ బంపరాఫర్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ టెస్లా బాస్ ఎలాన్ మస్క్ బంపరాఫర్ ప్రకటించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆయుధ హక్కుకు మద్దతునిచ్చే పిటిషన్‌పై సంతకం చేసే నమోదిత ఓటర్లు ప్రతి ఒక్కరికీ 47 డాలర్ల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రకటించారు. అయితే, ఈ ఆఫర్ స్వింగ్ స్టేట్స్ (రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు సమాన మద్దతు కలిగిన రాష్ట్రాలు) ఓటర్లకు మాత్రమే పరిమితం. యూఎస్ అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ట్రంప్‌కు మద్దతుగా పలువురు టెక్ వ్యవస్థాపకులతో ఏర్పడిన మస్క్ అమెరికా పీఏసీ వెబ్‌సైట్‌లో ఈ పిటిషన్‌ను ప్రారంభించారు.

విద్యుత్తు ఉత్పత్తి చేసే కృత్రిమ మొక్క

- కార్బన్ డయాక్సైడ్‌ను ఆక్సిజన్‌గా మార్చగలదు
- అభివృద్ధి చేసిన అమెరికా శాస్త్రవేత్తలు



న్యూయార్క్, అక్టోబర్ 7: విద్యుత్తును ఉత్పత్తి చేసే కొత్త రకమైన కృత్రిమ మొక్కను అమెరికాలోని బింఘామ్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బయో బ్యాటరీలతో పని చేసే ఈ మొక్క గదిలో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇది కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు కొంత మొత్తంలో విద్యుత్తును సైతం ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. పరిశోధనలో భాగంగా వీరు ఐదు ఆకులతో కూడిన కృత్రిమ మొక్కను తయారుచేశారు. దీని నుంచి దాదాపు 140 మైక్రోవాట్‌ల విద్యుత్తు తయారైనట్టు ప్రొఫెసర్ సియోక్యూన్ చోయ్ తెలిపారు. ఈ సాంకేతికతను మెరుగుపరిచి ఒక మిల్లీవాట్ కంటే ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామని, దీనికి లిథియం అయాన్ బ్యాటరీలను జత చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో దీని ద్వారా సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకునే అవకాశం ఉండేలా మారుస్తామని తెలిపారు. సాధారణంగా బయట కంటే గదిలోనే కార్బన్ డయాక్సైడ్ ఎక్కువ ఉంటుందని, ఈ కృత్రిమ మొక్క గదిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, ఆక్సిజన్‌గా మార్చడంలో బాగా పని చేస్తున్నట్టు చెప్పారు. ఈ కృత్రిమ మొక్కకు సంబంధించిన వివరాలు 'అడ్వాన్స్‌డ్ సస్టైనబుల్ సిస్టమ్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

35 వేల కోసం అన్నాచెల్లెలు వివాహం!

ప్రభుత్వ నుంచి నగదు ప్రయోజనం కోసం..

లక్నో: అన్నాచెల్లెలు డబ్బు కోసం చేయకూడని పని చేశారు. కొత్తగా పెండ్లి చేసుకున్న జంటకు ప్రభుత్వం అందజేసే నగదు సాయాన్ని పొందేందుకు అక్రమ మార్గం తొక్కారు. ఉత్తరప్రదేశ్ హాథ్రస్ జిల్లాలో రూ.35 వేల కోసం అన్నాచెల్లెలు వివాహం చేసుకోవటం అందర్నీ షాక్‌కు గురిచేసింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో అన్నాచెల్లెలు వివాహ బాగోతం బయటపడింది. దీనిపై జిల్లా అధికారులు దర్యాప్తు చేపట్టారు. యూపీ ప్రభుత్వం అమలుజేస్తున్న పథకం 'ముఖ్యమంత్రి సామూహిక్ వివాహ యోజన' అక్రమార్కులకు బంగారు బాతుగా మారింది.

రైల్వే ట్రాక్‌పై సోలార్ పవర్ ప్లాంట్

స్విట్జర్లాండ్ ప్రభుత్వ వినూత్న నిర్ణయం



బెర్న్, అక్టోబర్ 7: సౌర విద్యుత్తు ఉత్పత్తి కోసం స్విట్జర్లాండ్ ప్రభుత్వం విప్లవాత్మక ఆలోచన చేసింది. రైల్వే ట్రాక్‌పై తొలిసారి రిమూవబుల్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఆ దేశ రవాణా శాఖ ఇప్పటికే అనుమతి ఇచ్చింది. స్విట్జర్లాండ్‌లో ఇలాంటి ప్రాజెక్టుకు ఆమోదం తెలపడం ఇదే తొలిసారి. దీంతో అక్కడ వినూత్న తరహాలో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టును స్విస్ స్టార్టప్ 'సన్-వేస్' అభివృద్ధి చేస్తున్నది. న్యూచాటెల్ ప్రజా రవాణా సంస్థ 'ట్రాన్స్ ఎన్' ఆధ్వర్యంలోని 221 రైల్వే వ్యవస్థలో 100 మీటర్ల లీనియర్ సెక్షన్‌పై వచ్చే ఏడాది ఈ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించాలని 'సన్-వేస్' భావిస్తున్నది. 6,21,800 యూరోల (దాదాపు రూ.5.74 కోట్ల) వ్యయంతో ప్రయోగాత్మకంగా నిర్మించే ఈ ప్లాంట్‌లో 380 వాట్ల చొప్పున ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 48 సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 18 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్తును స్థానిక గ్రిడ్‌కు అందజేయనున్నారు. స్థానిక విద్యుత్తు పంపిణీ సంస్థ 'విటెయోస్'తోపాటు రైల్వే ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్లలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన 'డీజీ-రైల్' సంస్థ సహకారంతో 'సన్-వేస్' ఈ ప్రాజెక్టును నిర్మించనున్నది.

సోఫాలు, ఏసీలు ఎత్తుకెళ్లారు

తేజస్వీ యాదవ్‌పై బీజేపీ ఆరోపణలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై బీహార్ బీజేపీ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో పాట్నాలో ఆయనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాను తేజస్వీ యాదవ్ ఇటీవలే ఖాళీ చేశారు. అయితే ఈ బంగ్లా ఖాళీ చేస్తూ, అందులోని ఖరీదైన ఫర్నిచర్, ఏసీలు, సోఫా సెట్స్, వాష్ బేసీన్లను తేజస్వీ యాదవ్ ఎత్తుకెళ్లారని రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జ్ డానిష్ ఇక్బాల్ ఆరోపణలు గుప్పించారు. ఆ బంగ్లాలోకి తమ బీజేపీ నేత రాబోతున్నందున.. అక్కడికి వెళ్లి చూడగా తామంతా షాక్‌కు గురయ్యామని, ప్రభుత్వ బంగ్లాలోని సామానంతా లూటీ అయ్యిందని అన్నారు. ఇంతకు ముందున్న తేజస్వీ యాదవ్ ఆ పరికరాల్ని పట్టుకెళ్లారని ఆరోపించారు.

అమెజాన్‌లో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల విక్రయం

న్యూఢిల్లీ: ఈకామర్స్ సంస్థ అమెజాన్‌లో ఇకపై ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను విక్రయించనున్నారు. కిండర్‌గార్టెన్ నుంచి 12వ తరగతి వరకు, అలాగే యూపీఎస్సీ అభ్యర్థుల కోసం అమెజాన్ ఇండియా వెబ్‌సైట్‌లో అధీకృత విక్రేతల ద్వారా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను విక్రయించనున్నట్టు ఆ సంస్థ సోమవారం వెల్లడించింది. ఎన్‌సీఈఆర్‌టీతో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. వ్యక్తిగత కస్టమర్లతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలు, స్కూళ్లకు బల్క్ ఆర్డర్లలో పుస్తకాలను సప్లయ్ చేయనున్నట్టు పేర్కొన్నది.